సాహిత్య

# ప్రస్థానం

మే 2010

వెల రూ. 10




సాహితీ స్రవంతి


ఫొటో: గుడిపూడి విజయరావు

సాహిత్య
ప్రస్థానం
సంపుటి : 10 | మే 2010 | సంచిక : 53

# వేయి తలల విష సంస్కృతి

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ  విష సంస్కృతి  జాతి జీవనం మూల మూలల్లోకి చొచ్చుకు వస్తున్న తీరు ఆందోళన కరమే కాక అనర్థదాయకంగానూ తయారైంది. ఈ నెలలో దేశాన్ని కుదిపేసిన ఐపిఎల్ కుంభకోణం ఒక్కటి చాలు సకల జీవన రంగాలనూ అదెలా అతలాకుతలం చేస్తున్నదో తెలియడానికి. క్రికెట్టును కిక్కెట్టుగా క్రుకెట్టుగా మార్చి మార్కెట్ వాణిజ్యానికి నల్లడబ్బు చలామణీకి సాధనంగా చేసుకున్న ఆసాముల లోతుపాతులు తెలిసి మహామహులు కూడా నిష్క్రమించవలసి వచ్చింది. క్రీడాస్ఫూర్తితో పాటు దేశ గౌరవాన్ని ప్రజా జీవితపు విలువలనూ కూడా మంట గలిపిన ఈ విష ప్రహసనంలో మరెన్ని తలలు నేల రాలతాయో చూడాలి. దాన్ని కప్పిపుచ్చుకునే క్రమంలో రాజకీయ బేరసారాలు టెలిఫోన్ ట్యాపింగులు చివరకు వ్యవస్థనే కుదిపేస్తున్నాయి.

సానియా మీర్జా సోయబ్  మాలిక్‌ల పెళ్లి వ్యవహారంలో విపరీత పోకడలు, శ్రుతి మించిన ప్రచార పరిభ్రమణాలూ వెగటు పుట్టించాయి. ఇంతలోనే పసిపిల్లలతో వికృత నృత్యాలు చేయిస్తున్న వైపరీత్యంపై ఆగ్రహావేశాలు చెలరేగాయి. ఎవరు దేనికి ఎంత వరకూ బాధ్యులో తెలియకపోయినా కాస్త బాధ్యత తెలిసిన వారెవరూ ఆమోదించలేని అదే సమయంలో అడ్డుకోలేని అసహాయ అసహ్య పరిస్థితి.

వీటన్నిటికీ పరాకాష్ట స్వాములోళ్ల నీచ నికృష్ట భాగోతాలు. కల్కితో మొదలై నిత్యానందుడికి పాకి ఆ పైన కాళేశ్వరుడి గుట్టు తీసిన వార్తా కథనాలు కంపరమెత్తించాయి. వాటిని  మాఫీ చేయడానికి మీడియాపైనా వల విసిరే ప్రయత్నం-దానిపై  అంతర్యుద్ధం ఇవన్నీ మేడిపండు చందంగా తయారయ్యాయి. ఈ లోగా పాలకవర్గ  రాజకీయ నేతలు అంతర్యుద్ధాల గురించి మాట్లాడ్డం, అవకాశ వాదాలకు పాల్పడ్డం మరింత ఆందోళన కరంగా మారింది. ఇన్ని పరిణామాల మధ్య అధిక ధరలపై అఖిల భారత  ఆందోళన ఒక్కటే కాస్త సానుకూలంగా కనిపించే పరిణామం.

..........

చాలా మంది పాఠకులు ప్రస్థానంలో సవివరమైన సంపాదకీయం అవసరమని రాస్తున్నారు. వచ్చే సంచిక నుంచి అలాటి ప్రయత్నం చేయగలమని తెలియజేస్తున్నాం.

........

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా శ్రామిక లోకానికి ప్రగతి వాదులకూ  అభినందనలు.

| |
|---|
| **ముఖచిత్రం: చికాగోలో 1886 మే 4న 8 గంటల పనిదినం కోసం జరిగిన కార్మికుల సమ్మె దృశ్యం** |
| **బొమ్మలు : శేఖర్, శివాజి, లక్ష్మీనారాయణ, వెంకటేష్** |

## ఈ సంచికలో...


| | |
|---|---|
| కత్తెర (కథ) | 2 |
| కవిత | 7 |
| మహాప్రస్థానమే మహత్తర చిరునామా | 8 |
| షికారీ సాహిత్యం-సంస్కృతి | 10 |
| ఆఫ్రో అమెరికన్ మహిళా సింహనాదం అలైస్ వాకర్ | 13 |
| అశాంతి (కథ) | 16 |
| కవిత | 20 |
| 'మారనివాడు'లో దళిత స్పృహ | 21 |
| జిందాబాద్.. జిందాబాద్ (మినీకథ) | 23 |
| కాల్వకిందికి (కథ) | 24 |
| ఐపిఎల్ అతిపెద్ద గోల్‌మాల్ | 26 |
| కవిత్వంలో శ్రమదోపిడీ చిత్రీకరణ | 28 |
| నిర్దిష్ట స్థలకాలాల స్పృహ వున్న కథలు | 31 |
| అనుబంధాల దర్పణం | 33 |
| వాస్తవిక జీవన శిల్పాలు | 35 |
| కవిత | 37 |
| కొత్త పుస్తకాలు | 38 |
| డైరీ | 42 |


సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** *(సంపాదకుడు)*
**కె.ఆనందాచారి**
**ఎ.సత్యభాస్కర్**
**వొరప్రసాద్**
**ఎం.నరహరి**

**కె. లక్ష్మయ్య, మేనేజర్**

చిరునామా

**సాహిత్య ప్రస్థానం**
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

**కథ**

# కత్తెర

## పాలకొల్లు రామలింగస్వామి



***"అవునే లచ్చిమి!.... తెల్లారగట్ట కవురెడితే ఇప్పుడారావడం.. మంచి దానివే! ఎల్లెల్లు.. గబీల్న ఎల్లు.. ముసిలోడు నీ గురించే సూత్తండు!" ఎదురుగా వస్తోన్న ఆదిలక్ష్మిని చూసి అంది పైడితల్లి. నడుము వరకు పొడుగు జాకెట్టు, లంగా వేసుకున్న ఇరవైయేళ్ల ఆదిలక్ష్మి అప్పుడే అరవిచ్చిన మల్లెలా... అందంగా, పొందిగ్గా ఉంది.***

"ఆఁ.. ఇదిగో!... అక్కడికే ఎల్తన్నాను పిన్ని!" అందామె గబగబ నడుస్తూ. నెత్తిన తాటాకుల గొడుగులు, భుజాన తువ్వాల్లు, ఒక చేత్తో నీళ్ళ సీసాలు, మరోచేత్తో బొరిగెల్ని పట్టుకుని నిల్చుని ఉన్న ఆడవాళ్ళ గుంపును తప్పించుకుని వెళ్లింది ఆదిలక్ష్మి.

నాయుడోరి వీధికి పెరటి భాగం కావడం చేత ఈ ఆడవాళ్ళ గుంపు తప్ప పెద్దగా జనసంచారం లేదక్కడ. వాళ్ళలా నడుస్తూనే సంభాషణను కొనసాగించేరు. "పనేటి పైడితల్లి!... దాన్ని బేగి ఎల్లమంతన్నావ్?!" ప్రశ్నించింది డబ్బాలమ్మ అనబడే పార్వతి. ఆమెకు కొంచెం నోరు ఎక్కువ. అందుకలా ఆమెకాపేరు ఆ వూర్లో స్థిరపడింది. పనేమిటో చెప్పిందామె. విని తెల్లమొహం వేసింది పార్వతి.

"నిజివేనే పారువోతి!.. ఆలయ్యకి ముసిలికాలం. సూపు ఆనదు. పనేటి సేతకాదు. అందుకని ఆడికి బదులుగా దీన్ని పన్లోకి పంపిస్తండు!" నోట్లో చుట్టను తీసి తుపుక్కున ఉమ్మేస్తూ అంది పైడితల్లి.

"ఓసీ!... అలాగా!"

పార్వతిలో ఇంకా తొలగని ఆశ్చర్యం సూరీడమ్మకు వింతగా అనిపించింది. "వోస్ ఇదేటిది!... ఆచ్చర్యంగుంది. వూరు వూరంతా ఎప్పుడో గుప్పమని పోతేనూ... నీకింతదాక తెలీనేదా...!? అని అందామే అనుమానంగా. "నీమీదొట్టమి.. నిజంగా నాకు తెలీదు" పార్వతి అంది నమ్మిస్తూ... "మరింకేమి... అప్పోజికి మగ్గుంటలు లేని లోటు తీరిసీసిందయితే ఈ గుంట... ఈ రోజుల్లోన పనికి ఆడేటి... మగేటి... ఎవులయినా వొకటే!" నేటి లోకరీతిని సూత్రీకరించింది మరొకామె సరస్వతి.

"అవును గానప్పా.. ఇదా వొయసు వొచ్చిన ఆడదాయి.. అదా... మగోల కాడకెల్లి వొల్లొంచి సెయ్యవలసిన పని... ఎలాగ సేత్తందో యేటో ఈ పిల్ల.... సెప్పకోవలసిందే ! ఆదిలక్ష్మిని నిజాయితీగా మెచ్చుకుంది సూరీడమ్మ.

"ఓస్‌యేటే!.. లోకంల లేని మాటలాడుతున్నావ్.. బస్సుల్లోన, బడుల్లోన, ఆఫీసుల్లోన, అస్పత్తుర్లలోన మగోల్తో సమానంగా... ఆడోలు లేరేటి...!? వుజ్జోగాలు సెయ్యడంనేదేటి...!? ఇది కూడా అంతే! ఇందులోన తప్పేటుంది.!? తనకు ఉన్న లోకజ్ఞానం మేరకు విశ్లేషించింది పార్వతి.

"అసలు సంగతి మీకిద్దరికీ తెలీదు గావాల... తెలిస్తే ఇంకెంతసేపు నోరెళ్లబెడతారో... వొచ్చినన్ని గింజలురానీయని సిన్నోలికి, ముసలోలికి తప్ప వొయసునోలికి ఈ పనిసెయ్యనని కరాకండిగా సెప్పీసిందట.. సిత్రంగా వూర్లోనంతా సెప్పకుతన్ను "వివరించింది సూరీడమ్మ ఏదో కొత్త విషయం చెబుతున్నట్టుగా.

"తప్పేటినేదునేయే... ఆ మాత్రం జాగర్త ఆడదానికి ఉండాల.. నేప్పొతే మగ్గండలు వూరుకుంతారా... మీద బడిపోరు!"

ఓ జీవిత సత్యాన్ని తాపీగా ముక్తాయించింది పార్వతి.

"నడండర్రా... నడండి! పెల్లినడకలు మానేసి గబగబ అడుగులెయ్యండి... అత్తల గొప్పకు ఏలయిపోతంది!" అందర్నీ తొందరపెడుతూ గట్టిగా అంది పైడితల్లి.

మండల కేంద్రానికి సుమారు పదికిలోమీటర్లు దూరంలో ఉన్న ఆ ఊరు చిన్నదేం కాదు. అలాగని పెద్దదీకాదు. సుమారు పదిహేను వందలదాకా జనాభా ఉంటుంది.

అటు శివాలయాన్నీ, ఇటు రామాలయాన్నీ చెరోపక్కికి విడదీస్తూ ఊరు మధ్యగుండా పోతుంటుంది రాష్ట్ర రహదారి. ఆప్రక్కనే... విశాలమైన అరుగులతో ఎత్తుగా ఉన్న నాయుడోరి ఇల్లన్నీ పడుకుని చూస్తోన్న పశువుల్లా వరుసగా కొలువుదీరి ఉంటాయి. శివాలయం చుట్టూ ప్రహరీ... దానిననుసరించి ఉన్న సిమెంటుగచ్చు.. దానిపైకి



May 2010 pages.pmd 2 4/27/2003, 8:39 PM

ఉదయం తొమ్మిదింటికే చేరే పంచాయితీ పేపరు.. దాన్ని చదవడానికే గాక లోకాభిరామాయణం ముచ్చటించుకోవడానికిగాను వచ్చేజనం! వీటికి తోడు టౌనులోని కార్పోరేటు కాలేజీల్లో చదివే కుర్రకారు బస్సుకోసం ఎదురుచూస్తూ అక్కడికి చేరుకోవడం రోజూ జరిగే తంతే !



అక్కడ నుంచి నిలబడి చూస్తే నాయుడోరి ఎత్తిళ్ల ముందు ఏం జరుగుతుందో తెరమీద సినిమాలా స్పష్టంగా కనిపిస్తుంది. అలా.... కాలేజి కుర్రాళ్లూ, ఊరి జనమూ అలవాటుగా అక్కడకి చేరే సమయమూ, బెరుకుగా ఎరుకునాయుడు ఎదుట ఆదిలక్ష్మి నిలబడ్డ సందర్భమూ ఒక్కటే అయ్యింది. ఇప్పుడక్కడ ఏం జరగబోతుందో... ఏమిటో చూద్దాం.

"యేటే వోలమ్మి!... ఏటిలేటు.. అప్పుడే నీకు పెరిగిపోయిందేటి...!? నొసలు చిట్లించి ఆదిలక్ష్మిని చిరాగ్గా ప్రశ్నించేడు ఎరుకునాయుడు. "అదికాదు తాతయా!.. ఇంటిల సుక్కనీరునేదు. నీలుకోసమని బోరింగు కెలితే అక్కడే వొకటే జనం.. రెండు కుండలు పట్టిసొచ్చీసరికి.. ఇదిగో ఈటయిమయింది. ఇంతలోన.. మాయయ్యకి..." అంటూ చెప్పబోయిందామె. తుళ్ళన గసిరేడు ఎరుకునాయుడు. చప్పున నోరు మూసుకుంది ఆదిలక్ష్మి.

"ఇక సాల్లే ఆపు.. లేటయ్యిందేటని అడిగితే కతలు సెప్తావేటే.. గుంటకన! అందికే అంతారు మంగలోలికి మాటల్లావు ఎలుగు బంటికి ఈకల్లావని. ఎంతైనా మీ జాతిగుణం ఎక్కడికి పోద్ది... మరేటి ఆలస్యం... వొచ్చి గెడ్డం గీయ్!"

ఒకప్పుడు రాష్ట్రస్థాయిలో తిరుగులేని నేతగా చక్రం తిప్పిన ఎరుకునాయుడకి ముక్కుమీద కోపం. అతనికి ఎదురు మాట్లాడేంత ధైర్యం ఎవరికీ లేదు. ఇక ఆదిలక్ష్మి ఎంత...!? మౌనంగా కళ్లల్లో నీళ్లు దించుకుందామె. అలా... అపరాధిలా అవమానపడటం ఆదిలక్ష్మికి కొత్తగావచ్చు గాని ఆమె ముందు తరాలకు మాత్రం అలవాటే!

●●●

సరిగ్గా మూణెల్ల క్రిందట
ఆమె తండ్రి అప్పోజి
అదే ఇంటి ముందు...
అదే వ్యక్తి చేత...

గడ్డం గీస్తున్నపుడు రక్తం చిమ్మిన కారణంగా నానా మాటల్ని పడ్డాడు. వృద్ధాప్యం చేత కనుదృష్టి మందగించడం చేత జరిగిన తప్పును మన్నించమని ఎరుకునాయుడు కాళ్ళావేళ్ళాపడ్డాడు అప్పోజి. ఐనా అతను కరగలేదు. పైగా పనినుంచి అతన్ని శాశ్వతంగా దూరం చేసేలా హుకుం జారిచేసేడు ఎరుకునాయుడు. అలా ఎదురులేని ఆదేశం ఊర్లో క్రమేపి అమలవడంతో చెరువునుంచి వొడ్డునపడ్డ చేపపిల్లలా గిజగిజలాడేడు అప్పాజి.

పనిలేక... మరో పనిలోకి వెళ్లలేక.. బతుకు భయంతో నిద్రాహారాలుమాని రోజు రోజుకి క్షీణించిపోతున్న తండ్రిని చూసి మదనపడింది ఆదిలక్ష్మి "అయ్యా... వూర్లోని ఎవరో.. ఏదో అన్నారని ఇంటిపెద్దవి నువ్వే ఇలాగ దిగాలు పడిపోతే ఎలాగ...!? నీ వలన ఇప్పుడు రాబడి రానంత మాత్రాన నీ విలువ పడిపోద్దా... చిన్నప్పట్నుంచి మన పనిని చూసన్తా పెరిగిదాన్ని ఆ మాత్తరం పని నాకు సేతకాదా.. వొకరేదో అనుకుంటారని మనకు బాధ యేల.. పద! నీఎనకే నేను వస్తాను. మన కులవృత్తి చేస్తాను. నువ్వు మాత్తరం మన సొగ్గీకురయ్యా!"

అని ఓదార్చడమే కాక తండ్రికి చక్కగా క్రాపు చేసి గడ్డం గీసింది. కూతురు ఇచ్చిన మనోధైర్యానికి ఏ విధంగా స్పందించాలో తెలీని అయోమయో స్థితిలో చిప్పిల్లిన కళ్లతో చాలాసేపు మౌనంగా ఉండిపోయాడు అప్పాజి. మనసు తేలికయ్యింది.

పంచాయితీ సమావేశంలో ఊరు పెద్దల ముందు కూతురి ప్రతిపాదనను సాధికారికంగా ప్రవేశపెట్టాడు. వాళ్లు అభ్యంతరం పెట్టలేదు. సరేనన్నారు. అలా అందరి సహకారంతో ఆదిలక్ష్మి క్షౌరవృత్తిని చేపట్టి రెండు నెలలు గడిచాయి.

●●●

రెండు ముక్కల్ని చేసిన బ్లేడులో ఒక ముక్కని కత్తిలో ఉంచింది ఆదిలక్ష్మి. అతని రెండు దవడలపై షేవింగ్ క్రీమును అటూ ఇటు రాసి నురగ వచ్చేక మెత్తగా గెడ్డం గీయడం మొదలుపెట్టింది.

ఇదంతా....

దూరంగా నిల్చుని ఉన్న కుర్రాళ్ల గుంపుకు ప్రత్యక్ష ప్రసారంలా అలరించడమే కాక వారి నోళ్లకు బోలెడు పని కల్పిస్తోంది.

"వోరేయ్ అటు చూడండ్రా... ఆదిలక్ష్మి!"

"అబ్బో! ఏం ఫిగర్రా బాబూ!... పిచ్చెక్కిస్తోందనుకో!"

"ఒక్క ఛాన్స్ ఇస్తే.. ఎంత బాగుణ్ణో!?

"దేనికిరా!"

"మరిదేనికి.... గెడ్డం గీయించుకోవడానికి!"

"వోస్ అంతేనా... నేనింకేటో అనుకున్నాను."

"ఛ...ఛ... నోర్మూయిహే!... అదలాంటిదాయి కాదు."

"వోస్.. నువ్వు మరీసెప్పుతావ్రా!"

"నిజంరా బాబూ... నీమీదొట్టు!"

"ఏట్రోయ్... కొంపదీసి దానికి లైనేసి దెబ్బతిన్నావేటి..!?

"అదేటి కాదురా దానిదదోలోకం.. ఇటువంటివి తెలీదు."

"అవున్రా.. దాని అక్క నీకు గుర్తుందా... ఎలా గుండీదది సూపర్ ఫిగరనుకో మొగోడి ముకం తెలీనట్టుగా వుండేది. కాని బాండ్ మేళాల్లో పాడ్డానికి ఎల్లి ఏటయ్యింది? ఎవడితోనే తిరిగి జెండా ఎత్తిలేదేటి... ఇదీ అంతే! అలాగ చూస్తుండు." ఆమె భవిష్యత్తును అప్పుడే ఊహించేడు మరో కుర్రాడు.



May 2010 pages.pmd 3 4/27/2003, 8:39 PM

అంతవరకు అక్కడే కూర్చుని వున్న రామినాయుడు చెవిన ఈ సంభాషణనంతా పడింది. అతనొక వూరి పెద్ద. చిర్రెత్తుకొచ్చి ములకాలకర్ర సాయంతో దిగ్గున లేచేడు.



"నోర్ముయ్యండిరా గుంటల్లార!.. బుద్దిగేనం మీకుందిరా.. ఏదో కడుపు జరక్క దాని మానాన అది కులవృత్తి సేస్కొని గుట్టుగా ఇంటిని నడిపించుకొని వస్తుంటే దాన్ని సూసి నోటికొచ్చినట్టు మాట్లాడటానికి సిగ్గేయ్యనేదురా! కడుపుకు అన్నం తింతన్నారా.. గడ్డి తింతన్నారా... టిప్పుటాపుమని కాలేజిల కెల్లొచ్చీడం కాదురా.. కసింత సంసకారం నేర్చుకోవాల... అందికే అన్నార్రా.. సదూకున్నోడికంటే సాకలోడు మేలని.. సి.. సి!" ఆ పెద్దాయన వేసిన కేకలకి అవమానంతో బిక్కచచ్చిపోయేరు కుర్రాళ్ళంతా!ఎంతలా అంటే ఆదిలక్ష్మి తన పని తాను ముగించుకుని వాళ్లముందే వెళ్ళిపోయినా సరే.. కనీసం కన్నెత్తి అయినా చూడనంతగా!

●●●

ఇంటి ముంజూరు నుంచి వంగొని లోపలకు దూరిన ఆదిలక్ష్మికి గడపలోనే మంచంపై కూర్చున్న ఆమె స్నేహితురాలు లలిత కనిపించింది. ఆమె ఏడో తరగతి వరకు ఆదిలక్ష్మితో కలిసి చదివింది. ప్రస్తుతం టౌనులో డిగ్రీ చదువుతోంది. కబుర్లయ్యేక.. తన సైన్సు రికార్డుల్ని ఆదిలక్ష్మికి అందించి వచ్చిన పనేమిటో చెప్పింది లలిత. కాదనలేకపోయింది ఆదిలక్ష్మి. రికార్డుల్లో పెన్సిలుతో క్షణాలపై చక్కగా బొమ్మలు వేసిచ్చింది. ఈ ఒక్క విషయంలోనే కాదు చదువులోనూ ఆమె అంతే! ఎంత కష్టమైన పాఠాన్ని ఐనా క్షుణ్ణంగా నేర్వగల ప్రతిభ ఆమె సొంతం. లలిత వెళ్ళిపోయింది వస్తానంటూ! చెంపపై జారిన కన్నీళ్లతో ఆమె వెళ్లినవైపే నిశ్శబ్దంగా చూస్తుండిపోయింది. ఆమెలాగ తను కూడా కలవారి ఇంటిలో పుట్టి ఉంటే తనకెంతో ఇష్టమైన చదువును కొనసాగించి ఉండేదాన్నన్న బాధ ఆమె ముఖంలో తొణికిసలాడుతోంది. "రాజుకున్న కుంపటి"లా ఉన్నామెను చూసి మాట్లాడటానికి క్షణకాలం జంకేడు అప్పోజి. కొంచెం సేపయ్యాక

"ఎంది అలాగ ఉన్నావమ్మీ!" అంటూ మెల్లగా అడిగాడు.

"యేటిలేదులే అయ్యా!"

రెప్పల క్రిందకు వొలికిన కన్నీళ్లని తుడుచుకుని ఆమె అన్నప్పుడు ఆమె గొంతులోని జీరని అప్పోజి పసిగట్టేడు. "నువ్వేటి సెప్పకపోయినా నీ మనసులో బాదేటో నాకు తెలుసమ్మి. నిన్ను సదివించలేకపోన్నాను. అందరి ఆడపిల్లలల్లాగ గుమ్మం దాటనీకుండా పెంచలేకపోన్నాను. కుటమం మొత్తం బారం నీ బుర్రమీదెట్టేసి వొట్టి సేతగాని సవటనాగ మిగిలిపొన్నాను. ఇంత వయసొచ్చినా నీకు పెళ్లి సెయ్యలేకపొన్నాను. ఈసెతగాని అయ్యని సెమించొద్దమ్మీ!' అతని అంతర్మధనం దుఃఖపుటేరులా సాగినపుడు గొంతు సన్నగా వణకడం గమనించి బాధపడిందామె.

"ఛ...ఛ... అవేం మాటలయ్యా!.. నా తలరాతకి నువ్వేటి సెయ్యగలవు? ఐతేవొకటి...కళ్ళు గూడా అగుపడని ఈ ముసలికాలంలో నేను గనక అందుకొని రాకపోతే మీరేటవుతారోనన్న భయం నన్ను మనశ్శాంతిగా ఉంచకుంటంది. బయట నాగురించి నలుగురు నానారకాలుగా మాట్లాడతారు అవన్నీ నాకు తెలుసు. వాటి గురించి నాకు భయంలేదు. నేనేటైనా తప్పుపనులు చేస్తేనే కదా భయపడాలి. కాని అయ్యా.. నాకు తెలీకడుగుతాను. మంగలోల్లంటే అందరికీ ఎందుకంత చులకన.. వాళ్లు మనలాంటి మనసులేనని ఎందుకనుకోరు...!?"

ఇప్పుడిప్పుడే తనకు పరిచయమైన వృత్తి జీవితంలోని చేదును భరించలేక వేదనగా అడిగింది ఆదిలక్ష్మి. "ఏటి సెప్పుతావమ్మీ అవన్నీను!... పూర్వం కాన్నుంచి మన బతుకులే అంత.. అలాగ బెమ్మదేవుడు రాస్సాడు మనరాత. ఎవుడే పనిసెప్పినా కాదనకుంట సెయ్యాల... నాయుల్లెనకాతల బేపికూనల్లాగ తిరగాల. ఆల కాలూ ఏలూ పట్టాల.. ఎవులింటికి పెల్లిల్లయినా, సావులయినా, సమర్తలయినా అందరికంటే ముందు మనవే ఎల్లాల... మేలాలు వోయించాల... ఎవులెన్ని రకాలుగా మాటలన్నా పడాల.. కతలు, కార్యాలప్పుడు అసిరమ్మ పండగలప్పుడు సూడాల.. కాల్లకి బలపాలు కట్టుకొని వూరూర తిరగాల కార్డులు పంచాల.. మరోపక్క నాయురాల్లిచ్చే కోల్లు జేసి ఇవ్వాల.. ఇంతసేసి ఏ కస్టమొచ్చినా, సుకమొచ్చినా డబ్బుకరుసుకోసం ఇంటింటా తిరిగి సెయ్యి సాపితే గాని దినం తీరదు. వూల్లోని ఏ పనికి మాలోడి కాల్లోని ముల్లైన ఆసేయం పడకుంట తియ్యాల.. వొకేల సిరోచ్చి ఎదురు సెప్పేమనుకో.. బతుకే లేకుంట సేత్తారు. ఇలాగ సమచ్చరమంతా సచ్చీసెడీ బాడిసెరికం సెత్తే వొచ్చేవి బుర్రకి పన్నెండు కుంచాల దాన్నిం... ఆడితోటి వూల్లోనున్న మంగలోడు ఏటి బతుకుతాడు సెప్మీ.. సి...సి.. మంగలోడు బతుకంతా నామోసుకేనమ్మి!"

తన బతుకు జ్ఞాపకాల్లో ఇగిరిపోయిన నాయిబ్రాహ్మణుల జీవనస్థితిగతుల్ని జీరబోయిన గొంతుతో వివరించేడు అప్పోజి.

సాలోచనగా వింటూ మౌనం వహించింది ఆదిలక్ష్మి.

ఇంతలో బయటనుంచి వచ్చిన ఆమె తల్లి గంగమ్మ తలుపు తోసుకుని ఇంటిలోకి ప్రవేశించింది.

"గంగా!... వొచ్చీసేవా...!? ఆమెను పలకరించేడు అప్పోజి.

వచ్చానన్నట్టుగా తలాడించింది గంగమ్మ.

లేటయ్యిందేటని అక్కడ ఎవులేటి అన్నారేటి..!?

మళ్ళీ అడిగేడు అప్పోజి.

"అబ్బె.. అదేటినేదులే!"

బిరియానీతో నిండుగా ఉన్న గిన్నెను నేలమీద ఉంచుతూ అందామె. నాయుడు గారింటికి వెళ్లి కోడిని చంపి, చేసినందుకు ప్రతిఫలంగా నాయురాలమ్మ ఇచ్చిన పోరటి ఇది.



May 2010 pages.pmd 4 4/27/2003, 8:39 PM

దాన్ని మూడు ప్లేట్లలో సర్దిం తర్వాత ముగ్గురూ ఇష్టంగా తిన్నారు. "అమ్మి.. అయినాక పెసిడెంటు ఇంటికాసి అలాగ ఎల్లమ్మా.. ఆ బావుకు సవరవట. దార్లోన పోలిగాడు ఇందాక కనిపించి సెప్పుతండు!"



ఖాళీప్లేట్లను కడగడానికని పెరట్లోకి దారితీస్తూ అంది గంగమ్మ సరేనంది ఆదిలక్ష్మి.

మద్యాహ్నం అయ్యింది. ఎండ అంతగా లేదు.

●●●

మబ్బుల్లో దాగివున్న సూర్యుడు.. ఇంత తొందర్లో అజ్ఞాతవాసం వీడేటట్లు లేడు. దేనికోసమో కాచుక్కూర్చున్నట్లుగా!

ఆదిలక్ష్మి.. పెసిడెంటు ఇంటికి బయల్దేరింది

"లచ్చిమి.. పెసిడెంటు ఇంటికాడనేడు. మిల్లిదగ్గిర ఉన్నాడు. అక్కడికే పద.." త్రోవలో ఎదురుపడిన పోలిగాడే మళ్లీ చెప్పేడు. ఊరవతల...

పొడుగాటి ఊడలతో... చేతులు చాచిన రాకాసిలా ఉన్న మర్రిచెట్టు ఒకవైపు... శిథిలమైన రేకుల షెడ్డులో ఉన్న రైసుమిల్లు మరో వైపు... అంతా ప్రశాంతంగా.. నిర్మానుష్యంగా ఉంది.

అక్కడకు చేరుకున్న ఆదిలక్ష్మికి ఎవరూ కనిపించకపోవడంతో కాసేపు అటూ, ఇటూ వెదికింది. ఎవరైనా ఉన్నారా అని గట్టిగా కేకేసింది. కాసేపటికి... పెసిడెంటు కొడుకు చినబాబు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చేడు యంత్రాల పక్కనుంచి

అతడు వైజాగులో పెద్ద ఉద్యోగంతో పాటు మంచి స్థాయిలో ఉన్నాడు. "బాగున్నారా.. బాబూ!?

ఆదిలక్ష్మికి పలకరింపుకు అవునన్నట్టు చిరునవ్వుతో తలపంకించేడు చినబాబు.

"అయ్యగారున్నారని వొచ్చినాను.. లేరా బాబూ!"

మళ్లీ ప్రశ్నించింది ఆదిలక్ష్మి.

"నాన్నగారా.. ఈ టైములో ఆయనెందుకు ఇక్కడుంటారు?" అతని ప్రశ్నలోనే సమాధానం దొరికిందామెకు

"అవునేలచ్చిమి.. పెసిడెంటు ఉంటేనే వొత్తావా.. ఏమి మేముంటే రావేటి...!?

పళ్లికిలిస్తూ అన్నాడు అతని వెనుకే వచ్చిన పోలిగాడు. అతని మాటల్లోని మర్మాన్ని కూడా ఆదిలక్ష్మి పసిగట్టింది.

"నేను ఎల్తాను బాబూ మళ్ళొస్తాను! వెనుదిరుగుతూ అంది ఆదిలక్ష్మి. "ఏయ్ లక్ష్మి... ఆగాగు.. నిన్నే! వొక్కనిముషం.. గెడ్డం పూర్తిగా మాసిపోయింది. గియ్యవేటి..!?

తన వయసువారికి ఆమె గడ్డం గీయదని తెలుసు. అయినా ఆమెతో మరింత మాట్లాడాలని అలా అన్నాడు చినబాబు. "అలాగే.. గీస్తాను.. గీసినపుడు చర్మం ముక్కలూడి పోతాయి.. ఫర్వాలేదా... చెప్పండి.. గీస్తాను." అతన్ని తీక్షణంగా చూస్తూ అందామె. ఆమె జవాబు ఎక్కడో చురుక్కుమని తగలడంతో అతను కొంచెం సర్దుకున్నాడు.

"అది కాదు లక్ష్మి... మీ నాన్న ఎంత మంచోడనుకున్నావు! వైజాగు నుంచి నేనెప్పుడొచ్చినా నన్ను వదిలి ఒక్కక్షణం ఉండడు. నా వెనుకే తిరుగుతాడు. సిగరెట్లూ, మందూ, తెస్తాడు. కాలూ ఏలూ పడతాడు. నేనిచ్చే వదో వరకో పుచ్చుకుంటాడు. మరి నాకోసం నువ్వు ఇప్పుడేం జేస్తావ్?! అని అన్నాడు చినబాబు.

అతని ఆంతర్యం అప్పటికే పూర్తిగా బోధపడిన ఆదిలక్ష్మి మరిక అతనితో మాటలనవసరమని భావించి త్వరగా అక్కడ్నుంచి బయటపడాలనుకుంది. దాన్ని అతను గమనించేడు.

"సరే లక్ష్మి!... ఈ ముసుగులో గుద్దులాట మరెందుకు... డైరెక్టుగా చెప్పేస్తాను.. ఇందా.. ఈ వందనోట్లన్నీ నీకే.. తీసుకో... ఇంకా కావాలంటే అడుగు ఇస్తాను. నా దగ్గర మొహమాటపడకు. దాచుకుంటావో ఏవైనా కొనుక్కుంటావో నీ ఇష్టం.. జస్ట్! నువ్వు 'ఊఁ' అంటేచాలు. నీకు స్వర్గం చూపిస్తాను. జీవితాంతం నిన్ను ఉంచుకుంటాను. నీకు ఏ లోటూ రాకుండా చూసే బాధ్యతనాది. నన్ను నమ్ము! సరేనా..."

గబగబా బయటకు నడవబోతున్న ఆమెను లాగి చేతిలో కొన్ని కరెన్సీ నోట్లను కుక్కుతూ అన్నాడు చినబాబు. అతని దగ్గర్నుంచి ఒక్కసారిగా గుప్పుమన్న మద్యం వాసన ఆవేశంతో, ఆమె రక్తాన్ని కుతకుతలాడిస్తోంది. అసహ్యంగా తలతిప్పుకుంది.

బయట వాతవరణం.. ఏ మార్పులేక నిశ్చలంగా ఉంది.

"వోసే లచ్చిమి.. నీ పంట పండిందే... సిన్నయ్యగోరంటే అలాటిలాటి మనిసికాదే.. బంగారపు బాతు.. కాదనకు.. వొప్పేసుకో.. కాల్దగ్గరి కొచ్చిన కూడును కాలదన్నుకోకు. మీయమ్మ, అయ్య గురించి నువ్వేటి ఆలోసించకు. ఆల సంగతి నాకొదిలీ.. నాను సూసుకుంతాను. సరేనా!" ఆదిలక్ష్మితో చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు పోలిగాడు ఇదే మంచి అదనుకొని ఆమెపై మెల్లగా చేయివేశాడు చినబాబు. ఇప్పుడామె రగులుతున్న అగ్నిపర్వతంలా పేలడానికి సిద్ధంగా ఉంది. "చేయ్ తీయ్‌రా కుక్కా!" దిక్కులు పిక్కటిల్లేలా ఆదిలక్ష్మి గద్దించింది. ఐనా అతను తగ్గలేదు. పైగా ఇంకో అడుగు ముందుకేశాడు ఏంచేయగలవన్నట్టు!

అంతే!

ఆమె చేయి ఎప్పుడుపైకి లేచిందో గాని అతని రెండు దవడలు ఫట్ ఫట్ మని పేలిపోయాయి.

మరుక్షణం మేఘాలు గర్జించినట్టుగా ధ్వనించిందామె గొంతు. "ఏట్రా.. దొంగబాడుకో.. వొళ్లెలాగు వుంది..!? ఒంటిమీద చెయ్యేస్తావా..!? ఎంత ధైర్యం.. పళ్లు రాలగొడతాను. కడుపు మంట కోసం మీ దగ్గరికి పనికి వచ్చే ఆడోళ్ళంటే మీలాగ దిగజారిపోయి ఉంటారనుకుంటావ్‌రా.... గండా!.. ఏటి చూసుకుని ఈ వూర్లోని నీకింత పొగర్రా.. నీ కాడ డబ్బుందని నీకెవరు అడ్డుచెప్పలేరని వూరికే గొప్పడిపోకు.. చెప్పుదెబ్బలు తినిపోగలవు. ఇదిగో.. నువ్విచ్చిన



May 2010 pages.pmd 5 4/27/2003, 8:39 PM

## ఊపిరి పోసుకుంటూనే ఉంటా

**వల్లభాపురం జనార్దన**



లాభాల విమానాలు
వేటాడుతూ వెంటాడుతున్నా
వ్యూహాల క్షిపణి
భద్రతను శకలాలుగా చేసేస్తున్నా
దోపిడీ జన్యువు
గుండెను తూట్లు పొడిచి జల్లిస్తున్నా
భోగాల హక్కుల మోహరింపులు
ఆమ్యామ్యా మంత్రాలతో
పవిత్ర పరిశుద్ధస్నానం చేయిస్తున్నా
మొలకెత్తటం మరచిపోను
ఊపిరిపోసుకొంటూనే ఉంటా
ప్రకృతినీ – ప్రవృత్తినీ సర్జరీతో
మార్చటానికి చూస్తున్నా
ప్రాణశక్తిని కొడిగట్టించటానికి
కర్మయోగ సౌందర్య శృంఖల విశ్వరూపం
చూపిస్తున్నా
నా ప్రకృతికి రాజీనామాచేయను
ఊపిరి నాసహజ గంధం
గ్లోబల్ గోబెల్స్ మిసిలీ పహరాలో
చలనానికి పక్షవాతం తెప్పిస్తున్నా
బలప్రయోగ ఏరువాకతో స్వార్ధాన్ని విత్తి
నేరాల యెరువులేసి పంట పండించుకొనే
చరిత్రనాదంటూ
కబ్జా చేసుకోజూస్తున్న మాయలఫకీరుకు
లొంగను
మొలకెత్తటం నాసహజాతం
ఊసరక్షేత్రంలో పదేశానని
మొలకెత్తడం యిక ఉండదంటూ
భయపెట్టే వ్యాపారం చేయటం చెల్లదు.
చరిత్రనాది
చారిత్రక పరివర్తనంపై పెత్తనం నాది
మొలకెత్తటమే నా ఊపిరి ప్రాణంకూడా
ప్రాణరహితంగా కనిపిస్తూనే
ప్రాణం పోసుకుంటాను
ప్రాణరహితం చేయాలనే దగుల్బాజీతనానికి
అంతుచిక్కని పజిల్‌గా మారి
మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతాను
మారాకులు తొడుగుతాను
మహావృక్షాన్నై శిరసెత్తి నిలబడతాను

## సూర్య స్వాగతం

**డా॥ మోపిదేవి విజయగోపాల్**

జారిన క్షణాన్ని
పూర్తిగా జారిపోనీ
నీ మనసులోంచి పారిపోనీ !
వాడిన సుమాన్ని
కిందపడిపోనీ
నీ శరీరం మీంచి
మరలిపోనీ
పోయిన రూకను
రాలిపోనీ
నీ జేబులోంచి
దొర్లిపోనీ
పోయిన అవకాశాన్ని
ఎగిరిపోనీ
జాబితానించి
తొలగిపోనీ
పొంగిపోయిన పాలను
పొర్లిపోనీ
ఆపలేని అలలను
దాటిపోనీ
చిక్కటి చీకటి
మాటున దీటైన
సూర్యకిరణం
నీకు స్వాగతం చెప్పనీ !

---

వందనోట్లు.. అవన్నీ నీ దగ్గరే వుంచుకో... మరోసారి నావైపు సూచినా, రాయబారం పంపినా నలుగుర్లో నిన్ను ఛీకొట్టిస్తాను. అవమానంతో తిరగకుండా చేస్తాను.. నాతో పెట్టుకోకు.. ఈ కత్తిని చూసేవా.. మంగలిపని చెయ్యడానికే కాదు అవసరమైతే నీలాటోల పనిబట్టడానికి కూడా వెనుకాడదు. గుర్తుంచుకో.. ఈ కత్తి ఎప్పుడూ నాదగ్గరే ఉంటాది.. ఖబడ్దార్!"

అనుకోని సంఘటనతో అతనికి కళ్లు బైర్లుకమ్మి ఒక్కసారిగా చీకటి కమ్మినట్లయ్యింది. తేరుకుని చూసేసరికి అతని మెడ మీద ఆమె పెట్టిన కత్తి ఉంది. దాన్నుంచి మెల్లగా చిమ్ముతోన్న రక్తం ఉంది. కరెన్సీ నోట్లన్నీ తునాతునకలై ఎగురుతూ గాల్లో కనిపించేయి. మత్తువదలడంతో ఏంచేయాలో అర్ధంకాక అయోమయంగా ఉండతనికి. పైన ఆకాశంలోని మబ్బుపరదాలు ఒక్కొటొక్కటిగా తొలగిపోయేయి. వెలుగురేఖలు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా విచ్చుకుంటున్నాయి.



"సినబాబూ!... ఎంత మెడపోత్తరం దానికి.. మీ మీదే కలబడతాదా ఉండండి బావ్.. నాలుగు తగిలించి దాన్ని లాక్కొస్తాను. ఏటి సేత్తాదో సూద్దుము!?"

'ఉగ్రకాళిక'లా విసురుగా బయటకు నడుస్తున్న ఆమెను చూసి ఆవేశంగా అన్నాడు అప్పుడే లోపలకు ప్రవేశించిన పోలిగాడు. "పోరేయ్ పోలిగా.. ఆగాగు.. నీకు తెలీదు.. దానికి ఎదురెల్లకు.. చాలా డేంజర్.. ఆదిలక్ష్మి కాదురా అది ఆదిశక్తి.. దాన్తో పెట్టుకుంటే పరువు మర్యాదలకే కాదు ప్రాణాలకే ప్రమాదం.. ట్రయ్ చేశాం.. వర్కవుట్ కాలేదు. అంతే!.. ఇక్కడితో దీన్ని మరచిపో... బయట ఎవ్వరికీ చెప్పకు... నీకు పుణ్యముంటాది.. అర్థమైందా...!? కంపిస్తున్న స్వరంతో, మంటపెడుతున్న గొంతును తడుముకుంటూ అన్న చిన్నబాబు మాటలకు నిశ్చేష్టుడయ్యాడు పోలిగాడు. రేకుల షెడ్ నుంచి బయటపడ్డ ఆదిలక్ష్మికి.. ఎదురుగా జ్వాజ్వల్య మౌనంగా ప్రకాశిస్తూ స్వాగతించేదు సూర్యుడు.



May 2010 pages.pmd 6 4/27/2003, 8:39 PM

## దాహాల కన్నీరు

**కటుకోఝ్వల రమేష్**



ఎప్పుడూ ఇంతే!
ఎండాకాలమొచ్చిందంటే
తడిలేని నాలుకలు
పిడసగడుతున్న గొంతులు
మా పల్లెలో ప్రతి ఇంట్లో
మండుటెండలో
మధ్యాహ్న భోజనం
బుక్క దిగటానికి
నీళ్ళుండవు
దాహం! దాహం!
పోరగాండ్ల గోల
ఊర్లోని బోర్లన్నీ
నోర్లు తెరుస్తాయి
ఊటబావిలో చేదలన్నీ
టపాటపా కొట్టుకుంటాయి
ముష్టి యుద్ధం చేసినా
దోసెడు నీళ్ళే బిందెలో
ఆశలతో పాటు
నీళ్ళూ అడుగంటుతాయి
డబ్బున్నోళ్ళ ఇంటికి
క్యాన్లలో నీళ్ళొస్తాయి

మినరల్ వాటర్ సీసాలు
వాళ్ళ చేతుల్లో కొలువుంటాయి
ఈ పేదోడి ఒంటిపై
చమట బిందువులే తోడుదుంటాయి
మండుతున్న ఎండల సాక్షిగా
తడారని ఉప్పు చారలుంటాయి
వీళ్ళ దప్పిక కేకలు
గుండె గొంతుకలోనే
ఎండిపోతుంటాయి
ఒంట్లో డీ హైడ్రేషన్‌తో
కంట్లో దృశ్యాలు దూరమవుతుంటాయి
గుక్కపెట్టి ఏడ్చే

పిల్లోడి కోసం
చేతుల్ని పారల్ని చేసి
ఇసుకలో చెలమల్ని తీసి తీసి
కళ్ళన్నీ బైర్లు కమ్ముతుంటాయి
దాహమంటూ
ఎంత తన్లాడినా
ఈ పల్లె బతుకుల చివర
తులసి ఆకులే గానీ
తీర్థాలుండవు !

## అమ్మక పోరుడు

**పి. లక్ష్మణ్‌రావ్**



నిగనిగలాడే షూ
ధగధగ మెరిసే డ్రెస్సూ
రెపరెపలాడే టై
టపటపలాడే బ్యాగు
వాడి జీవన అలంకారాలు !
చకచకా మాట్లాడే నైపుణ్యంతో
మనల్ని మంత్రముగ్ధుల్ని చేసి
వాడి వైపుకు త్రిప్పుకునే
ప్రయత్నం చేస్తాడు
వృత్తిధర్మమే అయినా
అది వాడి జీవిత పోరాటం !
లక్ష్యసాధనలో
ఆదరించిన గడపకు
కృతజ్ఞతాశ్రువులతో
నమస్కరిస్తాడు !
విసుక్కునే గడపకు
చిరునవ్వుల పువ్వుల్ని
బహూకరించి నిష్క్రమిస్తాడు !
మండే ఎండైనా
కుంభవృష్టి వర్షమైనా

వాడి పయనం
ఆగకుండా సాగాల్సిందే
బతుకు చక్రానికి
నిలువెత్తు సాక్ష్యంవాడు
ఒక్కోసారి
శ్రమ స్వేదమే మిగులు ప్రశ్నై
వస్తు విక్రయం దొరకని జవాబౌతుంది
ఆ రోజున వాడు పడే మనోవ్యధకు
కన్నీరు జలపాతమై జారుతుంది
జీవితం వర్తమానమై
భవిష్యత్తు పోరాటానికి
నిత్యం సన్నద్ధం చేస్తుంటే
వర్తమానం గతమై
తీపిచేదుల బతుకుని
రుచిచూపిస్తుంది
జీవనపోరుని
ధరహాస ఆయుధంతో ఎదుర్కొనే
ప్రశాంత హృదయుడూ
అవిశ్రాంత యోధుడూ వాడే !

## నిరీక్షణ

**పురిమళ్ల సునంద**



భూగోళాన్ని భుజానికెత్తుకొని
జనాల ఆకలి తీరుస్తూ........
పుడిమితల్లి ఒడిని నమ్ముకొని
మహిలో మాణిక్యాలు పండించే
అలుపెరుగని అన్నదాత
అపహాస్యం చేస్తున్న ప్రకృతి
అతివృష్టి - అనావృష్టి గర్జించే మేఘాలు
మెరుపులతో కుమ్మక్కయ్యి
అడుతున్న దాగుడుమూతలు
తారుమారవుతున్న సామెతలు
ముందైన ఏకాదశి మోడు వారిన ఏరు
ఇసుకమేటగా మారిన తీరు
బీళ్ళుగా మారిన చేలు
నీళ్ళకోసం తెరచిన నోళ్ళు
రావాలని చినుకు కోసం
రాల్చిన ఆశల కన్నీళ్ళు
కల్తీలేని విత్తనాలు, ఎరువులు
కోతలేని కరెంటు ఓల్టేజీ
కలగా మారిన వర్తమానం
రక్తం చిందిన స్వేదజలం
చేతికందని శ్రమఫలం బతికి చెడిన జీవితం
ప్రకృతి - ప్రభుత్వం ఆడేజూదంలో
పావుగా మారింది
పొలాల మధ్యన దిష్టి బొమ్మయ్యింది...
అప్పులకు ఆకలికీ మధ్య సంఘర్షణ
కల్లంలో కష్టం గుమ్మం చేరదు
దళారీల బారిన పడి ఋణం తీరదు
పగలు, రాత్రులు అన్నీ....
చీకటి వేదికలై నడిచిపోతున్నాయి
చిక్కులవలయంలో చిక్కుకుపోతున్నా యి....
పెగలని గొంతుతో కుములుతున్న గుండెతో
అహర్నిశలు నిరీక్షణ
ఆశల కిరణాలు ఉదయిస్తాయని
రైతు రాజయ్యే రోజులు వస్తాయని...



May 2010 pages.pmd 7 4/27/2003, 8:39 PM

**ప్రతిస్పందన**

# మహాప్రస్థానమే మహత్తర చిరునామా

**తెలకపల్లి రవి**




*నన్ను తిట్టగ కోపమాగక*
*కుక్క నక్కల తక్కువ చేసెను*
*నరుల మోసి అలసిపోయె*
*కాలిచెప్పుల కించపర్చెను*
*మహాకవినే సంకలించి*
*మూలసారం మరచిపోయెను*
*పూర్ణసత్యం చెప్పమంటె*
*ఉగ్రరూపిగ మారిపోయెను*

**('నన్ను తిట్టిన తిట్లతోనే' శ్రీశ్రీ కవితకు కృతజ్ఞతలతో)**

**శ్రీశ్రీ** లేఖపైనే అనుమానాలా? అంటూ ఆంధ్రజ్యోతి వివిధ ( ఏప్రిల్ 12) లో వెలువడిన చలసాని ప్రసాద్ లేఖనం అసహనానికి అద్దం పడుతుంది. అధార రహితమైన ఆరోపణలకూ అభాండాలకూ అసలు సిసలు ఉదాహరణగా వుంది. పైగా రాసిన తీరు అయోమయం. అన్నిటికీ సమాధానంగా అనివార్య బాధ్యతగా రాస్తున్న లేఖ .

విరసం నా శాశ్వత చిరునామా అంటూ శ్రీశ్రీ పేరుతో ఇచ్చిన ప్రకటన పూర్తి రూపం ఇప్పటి వరకూ అందుబాటులో లేదు. విరసం వారు పదే పదే ప్రకటిస్తున్నది( దీన్ని వివిధలో కూడా ఇచ్చారు) కనీసం పత్రికా వార్త సంపూర్ణ పునర్ముద్రణైనా కాదు. ఒక పత్రికా వార్త ఆధారంగా చెప్పడం తప్ప దాని అధికార ప్రతి ఇంతవరకూ ప్రకటించలేదని మాత్రమే నేను రాశాను. అనుమానం వ్యక్త పరచలేదు, చేతిరాతా కోరలేదు. అలాగే సదరు ప్రకటనలో పేర్కొన్నట్టు తన రాజీనామా ఉపసంహరించుకుంటూ శ్రీశ్రీ విరసంకు తర్వాత లేఖ రాశారా? లేదా? రాసి వుంటే ప్రకటించడం, రాయకపోతే ఎందుకు రాయలేదో వివరించడం జరగాలి కదా? ఇలాటి ప్రశ్నలు అడగడం అనుమానాన్ని సూచిస్తుందా లేక ఆసక్తిని వెల్లడిస్తుందా? ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్ని కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం అన్న శ్రీశ్రీ వీర విప్లవ వారసులు నేను అధికార ప్రతి లేదన్నంత మాత్రాన శంకితాత్ములై నా మీద విరుచుకుపడటం దేనికి సంకేతం?

ఈనాడు హైదరాబాదు ఎడిషన్‌లో జులై 24న ఆ ప్రకటన ప్రచురితమైంది. అనంతపురం నుంచి వచ్చిన ఆ వార్తలో విలేకరి శ్రీశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు అని ఒకటికి రెండు సార్లు రాశాడు. అయితే ఆ వార్తలో వున్నది ప్రకటన పూర్తి పాఠమో కాదో తెలియదు. (1980 జులై-సెప్టెంబరు అరుణతారలో దాని ఆనవాలు కనిపించలేదు.) శ్రీశ్రీ పేరుతో ఇంత ప్రధానమైన ప్రకటన ప్రచారమవుతున్నప్పుడు దాని సంపూర్ణ స్వరూపం వెల్లడించవలసిన బాధ్యత సంకలన కర్త చలసాని పైన విరసంపైన వుంది. ఆ పని చేయకుండా నేను శంకితాత్ముడైనానని ఎదురు దాడి చేయడం హాస్యాస్పదం. స్పష్టత అడగడమే అనుమానించడమైతే - ప్రతి మనిషీ ప్రతి దాన్ని సందేహించాలి అన్న కారల్ మార్క్స్ సూక్తిని పొందుపర్చవలసి వస్తుంది.

కొంతమంది సామెతలను నిజం చేయడానికే పుడతారంటూ చలసాని ప్రసాద్ పొందుపర్చిన చాటువును చూస్తే ఎవరికి తగిన సామెతలు వారికి దొరుకుతాయని స్పష్టమవుతుంది. . శ్రీశ్రీ సంపుటాలు ప్రచురించి నాతో సహా అందరి గౌరవం పొందిన చలసాని ప్రసాద్


May 2010 pages.pmd 8 4/27/2003, 8:39 PM

# శ్రీశ్రీ అనంతం!



**యం. కె. సుగమ్ బాబు**

*తలపై*
*కదిలే మేఘం*
*తలలో*
*మెదిలే వేగం*
*మహా కవి*
*శ్రీశ్రీ!*

*బిగిసిన*
*ఉక్కుపిడికిలి*
*పదునెక్కిన*
*ఎర్రని కొడవలి*
*కామ్రేడ్*
*శ్రీశ్రీ!*

*నిప్పులు చిమ్ముతూ*
*నింగికి*
*నెత్తురు కక్కుతూ*
*నేలకు*
*శ్రీశ్రీ*
*స్పందనలు*

*దుర్నీతిపై*
*రగిలిన ఆగ్రహం*
*ఉరికొయ్యపై*
*ఊగిన వీరుడు*
*శ్రీశ్రీ*
*ఆవేశాలు!*

*సామాన్యుని*
*భుజం తట్టి*
*అతనితోనే*
*జతకట్టి*
*మహాప్రస్థానం*
*శ్రీశ్రీ!*

*పోరాటం*
*అనివార్యం*
*కదం తొక్కిన జనమే*
*సైన్యం–*
*ఎర్రజెండా*
*శ్రీశ్రీ!*

*'తాజ్'కై*
*రాళ్లెత్తిన కూలీ*
*ఉద్యమించిన*
*జట్కావాలా*
*శ్రీశ్రీ*
*ఆదర్శాలు!*

*ఒక మలుపున*
*కాసినవాడు*
*మెరుపుదాడి*
*చేసినవాడు*
*తిరుగుబాటు*
*శ్రీశ్రీ!*

*హాహాకారాలకు*
*విలాపాలకు*
*అనంత*
*దుఃఖాలకు*
*విముక్తి గీతం*
*శ్రీశ్రీ!*

*నిన్న*
*ఎదురుగా శ్రీశ్రీ*
*నేడు*
*స్మృతిలో*
*అనంతం*
*శ్రీశ్రీ !*

---

'కుక్కపిల్లా సబ్బుబిల్లా అగ్గిపుల్లా హీనంగా చూడకు దేన్నీ' అని మహాకవి చెప్పిన చరణాల సారం వంటపట్టించుకోలేకపోయారు. అవే గుర్తుంటే కుక్కలను నక్కలనూ చెప్పులనూ తక్కువ చేస్తూ చాటువు రూపొందించే వారు కాదు. మనదీ ఒక బ్రతుకేనా సందులలో పందుల వలె అనీ, ఆదిసూకర వేద వేద్యుడు అని అత్యంత గౌరవంగా రాసిన మహాకవికి అతి సన్నిహితుడైన 'ఏకైక కైక' (శ్రీశ్రీ మాటల్లో) నుంచి ఇలాటి రాతలా? హతవిధీ!

పనిలో పనిగా ఆయన ఎప్పుడో జనశక్తి స్టాలిన్ సంచికకు శ్రీశ్రీ రాసిన అభినందన సందేశం వూసు తీసుకొచ్చి నేను మోటూరు శిష్యుణ్నని గుర్తు చేశారు. సంతోషం. ఒక పత్రికకు పంపిన అభినందన సందేశమూ, ఒక మహాకవి శాశ్వత చిరునామా ప్రకటన ఒకే స్థాయికి చెందినవని ఆయన అనుకుంటే ఎవరూ చేయగలిగింది లేదు. మోటూరు నాకే గాక కొన్ని తరాల కార్యకర్తలకు నాయకులు. ఆయన సంపాదకుడుగా నేను సహసంపాదకుడుగా పనిచేసి చాలా విషయాలు నేర్చుకున్నా ఆయనకూ నాకూ కూడా గురు శిష్య పరంపరలపై నమ్మకం లేదు. ఇది కూడా పైన చెప్పిన విపరీత ధోరణిలో భాగమే. వర్గ పరిభాషలో చెప్పాలంటే అదే ఫ్యూడల్ తత్వం.

ఎవరికైనా సరే ఆక్రోశం ఆలోచనను చంపుతుంది. ఆసహాయత అసహనానికి దారి తీస్తుంది. అప్పుడు అనుకోకుండానే అతి విచిత్రమైన తప్పులు జరుగుతాయి. 1980 లో శ్రీశ్రీ రాస్తే45 ఏళ్ల తర్వాత నేను శంకితాత్ముడైనానని చలసాని వెటకారం చేశారు. నేను లెక్కల్లో బాగా వెనకబడిన వాణ్నయినా ఈ లెక్క తప్పుని చెప్పగలను.

ఆ సంగతి అలా వుంచి నేను ఈ విషయం రాసి ఏడాది గడిచిపోయింది. శతజయంతి ప్రారంభం నాడు ప్రచురించిన శ్రీశ్రీ సాహిత్యం సమకాలీనత పుస్తకం, ప్రస్థానం ప్రత్యేక సంచిక విడివిడిగా రెండు ముద్రణలు వెలువడి మంచి ఆదరణ పొందాయి. ఇంతకాలం తర్వాత ఇప్పుడీ హఠాత్ దురాగ్రహం.

దీన్ని లేవనెత్తిన వారి ఉద్దేశం ఏదైనా ఆ కారణంగా శ్రీశ్రీ శతజయంతి నివాళి దారి తప్పిపోవడం నాకు బొత్తిగా ఇష్టం లేదు.

ఎందుకంటే – ఎన్ని మజిలీలు, మలుపులు వున్నా శ్రీశ్రీ శాశ్వత చిరునామా మహాప్రస్థానం– అంతే.



May 2010 pages.pmd 9 4/27/2003, 8:39 PM

## పరిశీలన

# షికారీ సాహిత్యం - సంస్కృతి

డా॥ భూక్య తిరుపతి



*బ్రిటిష్ పాలనలో కూడా వేటకు తుపాకీ వాడిన వారు స్వాతంత్ర్యం తరువాత తుపాకీ వాడకానికి అనుమతి తప్పనిసరి అనే చట్టాన్ని ఆధునిక రాజ్యాంగం విధించింది. తత్ఫలితంగా వేట అనేది వారికి నేరంగా మారింది. అప్పుడు షికారీ తెగ చిన్న చిన్న వ్యాపారాలు అంటే పిన్నీసులు, దువ్వెనలు, పిల్లల ఆటవస్తువులు రైళ్ళల్లోనూ, బస్టాండ్‌లలోనూ అమ్ముకోవడానికి సిద్ధపడ్డారు. ఆ క్రమంలోనే వీరికి దొంగలు, నేరస్తులనే ముద్రవేసింది ఆధునిక సమాజం. కాని వారి నేరాలను నిరూపించే చట్టపరమైన ఆధారాలు లేకుండానే ప్రమాదకరమైన తెగగా ముద్రవేసింది.*

ఆధునిక సమాజం వర్గప్రాతిపదిక మీద నిర్మాణమైంది. ఆ వర్గ స్వభావమే దాని ఆదర్శాలను చీకటిలోకి నెట్టింది. ఆధునికత సకల మానవాళినీ విశేషంగా ప్రభావితం చేసింది. అది ప్రధావం సానుకూలంగాను. ప్రతికూలంగానూ ఉంది. ఆధునికత తన వలయంలోకి అన్ని జాతులను, తెగలను సాదరంగా ఆహ్వానించింది. అదే కాలక్రమంలో ప్రకృతిని, మానవ ప్రాకృతిక జీవనాన్ని విధ్వంసం చేస్తూ వచ్చింది. ఆధునికతకు దూరంగా జీవిస్తున్న వారిని అనాగరికులనీ వారి సంస్కృతి వెనుకబడిందని అవమానించింది. కొండకోనల్లో హాయిగా బతుకుతున్న ఆదివాసీలను, మైదాన ప్రాంతాల్లో నిసర్గ జీవితం గడుపుతున్న గిరిజన తెగల్ని ఆధునికత తన ఉక్కు కౌగిలిలో బంధించింది. అది భారీ ప్రాజెక్టుల రూపంలోనూ, ఆధునిక సంస్కృతి రూపంలోనూ అటవీ ప్రాంతంలో జరుగుతున్న మైనింగ్ తవ్వకాలలోనూ, ఆధునిక విజ్ఞానం ఆదివాసీ గిరిజనులను పరాయీకరించింది.

గ్రామీణ మైదాన ప్రాంతాలలో స్వేచ్ఛా జీవనం సాగించే కొన్ని తెగలున్నాయి. వేటాడుతూ, సంచార జీవితం సాగిస్తూ బతికే గిరిజన తెగలున్నాయి. అటువంటి వారిలో షికారీ తెగ ఒకటి. వేట ప్రధాన వృత్తిగా ఉన్న వీరికి ఆధునిక రాజ్యం విధించిన అనేక విధి నిషేధాలు ప్రతిబంధకాలుగా మారాయి. పక్షులు, వన్య ప్రాణుల రక్షణ చట్టం చేయడం వల్ల ఆ వృత్తికి దూరంగా జరగాల్సి వచ్చింది. బ్రిటిష్ పాలనలో కూడా వేటకు తుపాకీ వాడిన వారికి స్వాతంత్ర్యం తరువాత తుపాకీ వాడకానికి అనుమతి తప్పనిసరి అనే చట్టాన్ని ఆధునిక రాజ్యాంగం విధించింది. తత్ఫలితంగా వేట అనేది వారికి నేరంగా మారింది. అప్పుడు షికారీ తెగ చిన్న చిన్న వ్యాపారాలు అంటే పిన్నీసులు, దువ్వెనలు, పిల్లల ఆటవస్తువులు రైళ్ళల్లోనూ, బస్టాండ్‌లలోనూ అమ్ముకోవడానికి సిద్ధపడ్డారు. ఆ క్రమంలోనే వీరికి దొంగలు, నేరస్తులనే ముద్రవేసింది ఆధునిక సమాజం. కాని వారి నేరాలను నిరూపించే చట్టపరమైన ఆధారాలు లేకుండానే ప్రమాదకరమైన తెగగా ముద్రవేసింది.

వీరి గురించి రఘుయాద్ అనే పరిశోధకుడు "వీరు సహజంగా స్వేచ్ఛాప్రియులు. చాలా మొరటుతనంతో వ్యవహరిస్తారు. భార్యా పిల్లలతో సహ కుటుంబమంతా సారా త్రాగుతారు. ఇళ్ళలోనూ, చెట్ల పొదల్లోనూ సారా సొంతంగా తయారు చేసి అమ్ముకొంటారు. కొత్త వ్యక్తుల్ని త్వరగా నమ్మరు. ఒకవేళ విశ్వాసంతో ఎవరినైనా నమ్మితే వారి కోసం ఎంతటి త్యాగాన్నైనా చేసే నిజాయితీపరులు. కాని తమకు అనుమానం కలిగిన వ్యక్తిని అందరు కలిసి కొట్టడం జరుగుతుంది. ఎదురు తిరిగిన వారిని చంపటానికి సైతం వెనుకాడరు. కుటుంబ సభ్యుల్లో సైతం సమస్యలు ఉత్పన్నమైతే ఒకరిపైకొకరు బండరాళ్ళను విసురుకొని తలలు పగులగొట్టుకుంటారు. సినిమా టికెట్లు అమ్మేటప్పుడు ఏమైనా గొడవలు జరిగితే బ్లేడ్లు నమిలి విసిరితే ఎదుటి వ్యక్తి ముఖం ఎక్కడికక్కడ తెగిపోతుంది. ఒకవైపు రక్తస్రావం జరుగుతున్నాగాని గొడవను మానరు. దొంగతనాలు చేయటంలో నేర్పరులు" అని పేర్కొన్నాడు. ఇది పరిశోధకుని అపోహ మాత్రమేనని చెప్పవచ్చు. ఆధునికోత్తర కాలంలో కూడా వీరు తమ జీవితాన్ని కొనసాగిస్తున్న వారిని ఆధునికత ప్రమాదకారులుగా, వ్యతిరేకులుగా ప్రచారం చేస్తున్నది. ఆధునికత రూపొందించిన రాజ్యం, రాజ్యం ప్రచారం చేస్తున్న ఆధునికత రెండూ సంచార తెగలు పట్ల, వేట వృత్తిగా గల తెగలపట్ల శత్రువైఖరి ప్రదర్శిస్తున్నాయి. అప్పుడు షికారీలు ఏం చేయగలరు. ఆధునిక రాజ్యంలో సంలీనం కావడమో లేక ఆధునిక విధానాల్ని అనుసరించడమో వారి ముందు ఉన్న ప్రత్యామ్నాయం.

షికారీలు గతంలో వారి పేర్లు వారి తెగను సంకేతించేవి. సింగ్, నాయక్ అనేవి వారి నామాంతంలో ఉండేవి. ఇప్పుడవి కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం సినిమా హీరోలపేర్లు, లేదా ఆధిపత్య సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తుల పేర్లు పెట్టుకుంటున్నారు.

**"The adherence to administrative of justice through customary practices is based on the concept that such system of administrative of justices shall protect and promote the religion, culture and social belief of**

**the tribes" (Tribal customes, law and justice)**

మంజుశ్రీపాఠక్ అరుణాచల్ ప్రదేశ్‌లోని ఆదివాసీ గిరిజనుల గురించి వివరించిన అంశం వాస్తవమైనది. ఉత్తరాది రాష్ట్రాలలోనూ, ఈశాన్య రాష్ట్రాలలోను గిరిజన సంస్కృతిని కాపాడడానికి అవసరమైన చట్టాలను రాజ్యాంగం సూచించిందని అతను వివరించారు. అయితే దక్షిణాది రాష్ట్రాలలోని తెగల పట్ల, షికారీ తెగల విషయంలో అలా జరుగలేదు. షికారీలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు ఏమిటి?

**షికారీ కురియు కురియన్ – హక్కీ పక్కీ**

షికారీలు ఆంధ్రప్రదేశ్‌లోనూ, తమిళనాడులోనూ, కర్ణాటకలోనూ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వారిని వేరు వేరు ప్రాంతాలలో వేరు వేరుగా గువ్వలోళ్ళు, పిట్లలోళ్లు, షికారోళ్ళు, నక్కలోళ్ళు అని పిలుస్తారు. తమిళనాడులో కురుయు, కురియన్ అని, కర్ణాటకలో హక్కి పక్కి అని పిలుస్తారు. వీరిని వివిధ పేర్లతో పిలుస్తున్న వారి సంస్కృతిలో కొద్దిపాటి తేడాలు కూడా ఉన్నాయి. ఈ మూడు తెగలు ఒకటా? కాదా? అనే విషయం పూర్తిగా తెలియాలంటే తులనాత్మక పరిశీలన చేస్తే తప్ప నిర్ధారణ కాదు. అయితే కొంతమంది పరిశోధకులు ఈ మూడు తెగల్ని ఒకే తెగగా భావిస్తూన్నారు. ఈ తెగలో ఐదు శాఖలున్నాయి. 1. మూండ్ (ముక్డియ) 2. భూక్య, 3. ఆంబోత్ 4. చెంగా, 5. చౌహన్, మొదలైనవి. వీరు మాట్లాడే భాష వ్యాగ్రిబోలి.

**షికారీ కుటుంబ వ్యవస్థ**

వీరిది పురుషాధిక్య సమాజం. కుటుంబంలో పితృస్వామ్యం కొనసాగుతుంది. స్త్రీలు కూడా కుటుంబ పోషణలో పురుషునితో సమానంగా బాధ్యతను నిర్వహిస్తారు. ఈ తెగ స్త్రీలు ధైర్యవంతులు, మొరటు స్వభావం కలవారు. స్త్రీ ఇంటి దగ్గర సారాయి తయారు చేసి పురుషునితో (భర్తతో) సమానంగా కుటుంబాన్ని నడుపుతుంది. మగసంతానాన్ని కోరుకుంటారు. స్త్రీలకు ఆస్తి హక్కులేదు. ఆడపిల్ల పెద్దమనిషి అయినప్పుడు మేనమామ కొబ్బరి గిన్నె, బెల్లం ఇస్తాడు. రజస్వల అయిన నాటి నుంచి ఏడు రోజుల వరకు అమ్మాయి బయటికి రాకూడదు. బహిష్టు అయిన స్త్రీ ఇంట్లో వస్తువులు ఐదు రోజుల వరకు ముట్టరాదు. స్త్రీ ప్రసవించినప్పుడు పదిహేను గజాల దూరంలో ఒక గుడారం వేస్తారు. ప్రసవం జరిగిన రోజు నుంచి మూడోరోజు వరకు బెల్లం, నెయ్యితో చేసిన పాయసం తినిపిస్తారు. దీనిని 'మీఠాఖానా' అని అంటారు. ఆరు రోజుల తరువాత శిశువుకు తల్లి స్వయంగా గుండుగీస్తుంది. దీనిని 'ఛట్టి' అని అంటారు. మగబిడ్డకు పదిహేను రోజుల తరువాత తెగనాయకుని సమక్షంలో దేవునికి పూజ చేసి, పిల్లోడి నడుముకు మొలతాడు కడతారు. దీనిని 'కందొర' అని అంటారు. వస్త్రధారణలో కొంత నిర్లక్ష్యం కనిపిస్తోంది. పిల్లల పోషణ పూర్తిగా స్త్రీలదే. మూఢ్ గోత్రం వారు నిర్వహించే ఛాముండదేశ్వరీ దేవీ పండుగను తెగపెద్దలే పురుషులే నిర్వహిస్తారు. స్త్రీలు పాల్గొనరు. బలిచ్చిన ఎనుబోతు మాంసంను వడ్డించడానికి స్త్రీలకు అప్పగిస్తారు.

**వివాహ వ్యవస్థ**

మేనరిక వివాహాలు చేసుకుంటారు. వివాహాలకు బంధువర్గాన్నంతా ఆహ్వానిస్తారు. కొందరు మేనరిక వివాహాలు నిరాకరిస్తున్నవారున్నారు. వరకట్నం, కన్యాశుల్కం లాంటి దురాచారాలు లేవు. కాని, అత్తమామలు శక్తిమేరకు కోడలికి సొత్తు పెట్టాలి. 'నల్లపూసల దండ'ను తాళిగా ఉపయోగిస్తారు. పెళ్ళి ఖర్చు మగపెళ్ళివారే భరించాలి. స్త్రీ, వివాహానంతరం మరో పురుషుని ఇష్టపడి వివాహం చేసుకుంటే మొదటి భర్తకు ఆమె తల్లిదండ్రులుగాని, రెండవ భర్తగాని పెళ్ళి ఖర్చులు చెల్లించాలి. ఒకవేళ భర్త విడాకులు కోరితే పెళ్ళి ఖర్చులు వదులుకోవాల్సి ఉంటుంది. కుల పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి విడాకులు తీసుకుంటారు. బాల్య వివాహాలు అరుదుగా జరుగుతాయి. బహు భార్యత్వం ఉంది. అయితే మొదటి భార్య సమ్మతి ఉండాలి. వితంతువులకు పునర్ వివాహం చేసుకునే అవకాశం లేదు.

**పండుగలు**

వీరు హిందు దేవతల్ని కొలుస్తారు. సంవత్సరానికి ఒకసారి దుర్గమ్మ ఉత్సవం నిర్వహిస్తారు. ఫిబ్రవరి నెలలో జరిగే ఈ ఉత్సవాన్ని మూడు రోజులపాటు జరుపుకుంటారు. దుర్గమ్మ గుడి ముందు దున్నపోతును బలిస్తారు. మూడ్ శాఖ బలిచ్చిన ఎనుబోతు మాంసం తినరు. కాని, దాని రక్తం తాగుతారు. భూక్యశాఖ ప్రజలు మాత్రమే మేకపోతును బలిచ్చి దాని మాంసం ఆరగిస్తారు. ఈ ఉత్సవంలో ప్రతి షికారీ పాల్గొనాలి. లేకుంటే కీడు జరుగుతుందని వారి నమ్మకం. చిత్తూరు జిల్లాలోని షికారీలు రేణుక, ఎల్లమ్మ, దుర్గామాత అంగాళేశ్వరి, పార్వతి, కాళీయమ్మ మొదలైన గ్రామదేవతల్ని, దైవాల్ని కొలుస్తారు. వేటలో జంతువులు, పక్షులు దొరకనప్పుడు ఇంటి దగ్గర దేవునికి పూజచేసి, జంతుబలిచ్చి జరుపుకునే పండుగ 'ఈద్'. ఈ పండుగ ప్రతి రెండు సంవత్సరాలకొకసారి అడవిలోకి దూరంగా వెళ్లి రెండు మూడు రోజులపాటు అక్కడే ఉండి జరుపుకునే పండుగ. ఈ పండుగలో ప్రతి కుంటుంబం నుంచి కనీసం ఒక మేకను బలివ్వాలి. లేకుంటే కీడు జరుగుతుందని వీరి నమ్మకం.

**విశ్వాసాలు**

వీరి విశ్వాసాలు విచిత్రంగా ఉంటాయి. కుప్పం, గుడిపల్లి, మదనపల్లి, పలమనేరు, బోయకొండ, తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి, చిత్తూరు ప్రాంతాల్లో శకునాల విషయంలో ఖచ్చితంగా ఉంటారు. వీరు వ్యాపారానికి బయలుదేరే ముందు జిల్లేడు పూలను జేబులో లేదా సంచిలో వేసుకుంటారు. ఆరోజు వ్యాపారం బాగా జరుగుతుందని వీరి నమ్మకం. శుభకార్యానికి బయలుదేరే ముందు పాము ఎదురైతే అశుభంగా భావించి వాయిదా చేసుకుంటారు. బల్లి అరుపు శుభసూచికం. కట్టెలమోపు ఎదురైతే అపశకునం. గాడిద మొహం చూస్తే శుభం, నక్కలు, చేపలు చూస్తే శుభం. నీటి కుండ తలమీద నుంచి క్రింద పడితే అశుభం. నక్క అరచిన దిక్కు నడవరు. గాజులు అమ్మేవారు ఎదురైతే శుభం.

మొదటి రుతుక్రమం అయిన అమ్మాయికి స్నానాదుల తరువాత అలంకరించి ముఖానికి, చేతులకు, కాళ్ళకు ఎరుపు రంగు పూస్తారు. ఇంటింటికి మీఠా పంపిస్తారు. ఆరోజు నుండి అమ్మాయి పెళ్ళికి అర్హురాలు అవుతుంది.

షికారీలకు ప్రత్యేకమైన భాషా వ్యవస్థ ఉంది. కొద్దిమంది



May 2010 pages.pmd 11 4/27/2003, 8:39 PM

# ఒక పశ్చాత్తాపం

**దాకరపు బాబూరావు**



నీకేం తెల్సమ్మా! అని
నేను విసుక్కున్నప్పుడల్లా
అమ్మ నవ్వేది
బహుశా !
వయసు నాకు నేర్పిన మిడి మిడి జ్ఞానాన్ని
చూసికాబోలు!

ఆ గుంభనపు నవ్వు రహస్యం
నాకప్పుడర్థమయ్యేది కాదు

'నిన్నింతవాణ్ణి చేసింది... నాకు తెలీని తనమే
కదరా నాన్నా'
అన్నట్లు అమ్మ చూపులు నన్ను తడుముతూ
అన్నీ తెలుసన్న నా అహంకారాన్ని
ప్రశ్నిస్తున్నట్లుంటే
అర్థాలు వెతుక్కోటానికి యిష్టపడని వయసునాది

ఆవేశం నన్నెప్పుడూ చేతులు కాల్చుకునేలా
చేస్తుంటే
నిట్టూర్పుల మజిలీల్లో
ఆమ్మెన్నిసార్లు రాజీపత్రమై నాకు ఆమోద
సంతకాలు తన నిశానీ ముద్రల్తో చేసిందో
నా అహం నన్నెప్పుడూ ఆలోచించుకోనివ్వలేదు

అమ్మపోయాక గానీ... ఆ అడుగుల ముద్రలు నా
కర్థం కాలేదు

జీవన సాగరంలో తను కన్నీటి కెరటమౌతూ కూడా
నన్నెన్నిసార్లు ఒడ్డెక్కించిందో !
అమ్మకేం తెలీదు అనుకునేవాణ్ణి
అక్షరాలు అర్థంకాని పత్రాల మీద అమాయకంగా
వేలిముద్రలేసే అవిద్య అనుకునేవాణ్ణి
నాకు తెల్సినంత లోకం కూడా అమ్మకు తెలీదు
అనుకునేవాణ్ణి

కానీ !
అమ్మకు అన్నీ తెల్సు
జీవితంలో ఎలా నడవాలో – జీవితాన్ని ఎలా
నడుపుకోవాలో
వేలిముద్రల జాడల్లోంచి పాద ముద్రల్ని ఎలా
జాగ్రత్తపర్చుకోవాలో
చదువుకున్నా ననుకునే నాకంటే
అమ్మకే ఎక్కువ తెల్సు

---

మాత్రమే దానిని మాట్లాడతారు. భాషాపరంగా ఎన్నో విషయాలు పరిశీలించవచ్చు. అది భాషా వేత్తలు చేస్తేనే దానిలోని విషయాలు బహిర్గతమవుతాయి. వీరిలో రోజులకు ప్రత్యేకమైన పేర్లున్నాయి. అవి

ఆదివారం – నయతోగామ్
సోమవారం – తింగేగామ్
మంగళవారం – సేవాగామ్
బుధవారం – బొదల్‌గామ్
గురువారం – వియాళగామ్
శుక్రవారం – వెళిగామ్
శనివారం – శనిగామ్

గామ్ అంటే వారం అని అర్థం. గ్రహం గాము అవుతుంది. పెద్దన కూడా గాము అనే పదం వాడాడు. జ్యోతిష శాస్త్రం ప్రధానమైన ఏడు గ్రహాలకు ఏడువారాలు సూచన అని వివరణ ఉంది. ఆ రకంగా చూస్తే గ్రహం పేరుతో గ్రహం అనేది చేరి సూర్యగ్రహం, చంద్రగ్రహం కావాల్సి ఉండగా నయితోగామ్ (ఆదివారం) తింగేగామ్ (సోమవారం) అనే పదాలు వాడుకలో ఉన్నాయి. ఇందులో విశేషమేమిటంటే మొదటిపదాలు ద్రావిడ భాషకు సంబంధించినవి. ఇయిజ్? ఇయిర్ ఇయితు నయితే (తెలుగులో యక్షగానాల్లో అయితారం దీనికి దగ్గర పదం) అయిందనవచ్చు. తింగళ్ = నెలపొడుపు, నెలవంక = సోమ చంద్రునికి సంబంధించినదీవారం. అదే విధంగా ఖగామ్ అంటే సంబంధాలు చూడడమని అర్థం. వయా – వివాహం, ధాన్ – అన్నం, మోటోభయా – అన్న మోటోభాహిన్ – అక్క, నాన్‌భాయి – తమ్ముడు, జంగ్లీజారొచు – అడవికి / వేటకు వెళ్ళడం, లబ్బర్ లక్డు – ఉండేల్ (పిట్టల్ని కొట్టె పరికరం) సంగ్యమ్ – పెద్దఖర్మ (దినాలు) బొక్డా – పొట్టేలు, ఖ్వాళొ – ఒడినింపడం. ఈ విధంగా కొన్ని భాషా విషయాలు విశ్లేషించవచ్చు.

షికారీలు హక్కిపిక్కిలు, కురియకురియన్ రాజపుత్రులని చెప్పుకుంటారు. అందరిలాగానే దళితులను తక్కువగా చూసి వారిని తాకరు. లంబాడీలు, మార్వాడీలు, షికారీలు, హక్కిపిక్కిలు ఒకప్పుడు, రాజస్థాన్‌లోని ఒక పూర్వీకుని సంతానమని, క్షేత్ర పర్యటనలో ఒక షికారీ తెగ నాయకుడు తెలిపాడు. అయితే దీనికి సరైన ఆధారాలు పరిశీలించబడాలి.



May 2010 pages.pmd 12 4/27/2003, 8:39 PM



# అఫ్రో, అమెరికన్ మహిళా సింహనాదం అలైస్ వాకర్

రావెల పురుషోత్తమరావు

***శ్వేత జాతీయుడైన భూస్వామి – మాటల సందర్భంలో నల్లజాతి వారికి చదువుకోనవసరం లేదని చెప్పడంతో అలైస్‌వాకర్ తల్లి ఆ మాటలనెదిరించి ధృఢనిశ్చయంతో తన కూతురు అలైస్‌ను నాలుగవ యేటనే మొదటి తరగతిలో చేర్పించి పట్టుదలగా చదివించనారంభించింది. అనగా.. అనగా అంటూ అమ్మలు, నానమ్మలు, తాతయ్య, తాతమ్మలు చెప్పే కథలతో తనకున్న జ్ఞాన పరిధిని క్రమేపీ విస్తరించుకుంటూ అలైస్ వాకర్ పెరుగుతూ వచ్చింది.***

అలైస్ మాల్సీనియర్ వాకర్, జార్జియా లోని ఈటంటక్‌లో ఎనిమిది మంది సంతానంలో ఆఖరిదానిగా విల్లీలీ మిన్నలౌ దంపతులకు జన్మించింది. వర్ణ, కుల వ్యవస్థపై తీవ్రంగా విరుచుకుపడుతూ ఎన్నో నవలలు, కథలు, కథానికలు. కవితా సంపుటాలు మరెన్నో యితర గ్రంథాలను వెలువరించి ఎన్నో విశేషమైన జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బహుమానాలను పొందిన ఘనకీర్తి శ్రీమతి వాకర్‌ది. 1983 సంవత్సరంలో పులిట్జర్ బహుమతి నందుకున్న ప్రప్రథమ నల్లజాతీయురాలిగా గణన కెక్కింది. (గ్రంథం – కలర్ – పర్పుల్) 1984లో జాతీయస్థాయి సాహితీ బహుమతి ప్రప్రథమ నల్లజాతీయురాలిగా అందుకోవడం జరిగింది. 1985లో ఓ హెన్రీ బహుమతిని (గ్రంథం కీంద్రెడిస్పిరిట్స్) ఉత్తమ పత్రికా విమర్శకురాలిగా – ది ఫ్రంట్ పేజీ బహుమతిని, న్యూస్‌వుమన్‌క్లబ్ – న్యూయార్కు వారి ద్వారా పొందింది 2006 సంవత్సరంలో కాలిఫోర్నిమహవ్ ఆఫ్ ఫేమ్' లో చోటు సంపాదించుకున్న ఖ్యాతిని దక్కించుకున్నది. 11 కవితా సంపుటాలు 14 నవల కథా సంపుటాలు 9 పైగా ఇతర గ్రంథాలను వెలువరించి దేశవిదేశాలలో విశేషమైన ఖ్యాతి నార్జించింది. అలైస్‌వాకర్ తండ్రి గణితంలో ఆశ్చర్యచకితులను గావించే ప్రతిభ కలిగినా కౌలుదారుగా పాడిపరిశ్రమ నిర్వహణలో అంతగా రాణించలేక కేవలం సంవత్సరానికి మూడు వందల డాలర్ల సంపాదనతోనే సరిపెట్టుకోవలసివచ్చింది. అలైస్ తల్లి కూడా పొలం పనులలో తండ్రికి చేదోడు వాదోడుగా వుంటూ – ఆ తండ్రి సంపాదన మెరుగు పరచేదిశగా ఎంతో సహాయ సహకారాలను అందించింది. వాళ్ళు పనిచేసే శ్వేత జాతీయుడైన భూస్వామి – మాటల సందర్భంలో నల్లజాతి వారికి చదువుకోనవసరం లేదని చెప్పడంతో అలైస్‌వాకర్ తల్లి ఆ మాటలనెదిరించి ధృఢనిశ్చయంతో తన కూతురు అలైస్‌ను నాలుగవ యేటనే మొదటి తరగతిలో చేర్పించి పట్టుదలగా చదివించనారంభించింది. అనగా.. అనగా అంటూ అమ్మలు, నానమ్మలు, తాతయ్య, తాతమ్మలు చెప్పే కథలతో తనకున్న జ్ఞాన పరిధిని క్రమేపీ విస్తరించుకుంటూ అలైస్ వాకర్ పెరుగుతూ వచ్చింది. పులిట్జర్ బహుమతి నందుకున్న 'కలర్ పర్పుల్'లో తన అమ్మమ్మ ప్రధాన పాత్రగా దర్శనమిచ్చింది. 1952 తన సోదరుడు కాల్చిన తుపాకీ వల్ల కుడికన్నును కోల్పోయింది. వాళ్ళు అమెరికాలో – కారులాంటి రవాణా సౌకర్యం కలిగివున్న కుటుంబం కాదు గనుక – వెంటనే వైద్య చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించలేదు. వారం తర్వాత 'వాకర్'ను ఆసుపత్రిలో చేర్చగా, అప్పటికే ఆ కన్ను పూర్తిగా అంధమయ మయిందని తెలిసింది. ఈ 'అవకరం' ఆమెను వెంటాడుతుండగా, ఇంట్లోనే సమయాన్ని గడుపుతూ, పుస్తక పఠనంతో ముఖ్యంగా కవితలను చదువుకుంటూ కాలాన్ని వెళ్ళదీయడానికి అలవాటుపడింది వాకర్. కంట్లో 'మరక' 14వ ఏట తొలగించడం జరిగింది. ఈ కంటిలో ఏర్పడిన ఇబ్బంది. వాకర్‌కు తన చుట్టూ వున్న ప్రపంచాన్ని దగ్గరగా చూసే వీలు కలిగింది. ఆ తర్వాత ఆమె ప్రఖ్యాతి గల బాలికగా పాఠశాలలో ఎంపికయ్యింది.



May 2010 pages.pmd 13 4/27/2003, 8:39 PM

అట్లాంటాలో కాలేజీ విద్యార్థిగా వుండగా, వాకర్ – మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్) ను కలవడం జరిగింది. 1963 మార్చిలో వాషింగ్టన్‌లో జరిగిన పౌరహక్కుల యాత్రలో పాల్గొంది. ఆ తర్వాత జార్జియా మిసిసిపి లలో – ఓటర్లను జాగృతం చేసే దిశగా ఉత్సాహంగా పనిచేసింది.




ఎక్కడ మానవ హక్కులకు విఘాతం కలుగుతున్నదని తెలిసినా – ఒక ఉద్యమనేతగా అక్కడ వాకర్ ప్రత్యక్షమయ్యేది.

2003 మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యుద్ధ వ్యతిరేకమైన ఉద్యమానికి చేయూతనిస్తూ – మరొక 24 మందితో కలిసి పోలీసులు గీసిన 'గీత' నుదాటి అరెస్టవడం జరిగింది. శ్వేతసౌధం – ఎదురుగా 5000 మంది కార్యకర్తలతో నిరసన ఉద్యమాన్ని నెఱపుతూ, మానవహారం లాగా చేతులను కలుపుకొని ఉద్యమ గీతాలను ఆలపిస్తూ ఇరాక్ దేశంలోని మహిళలు, పిల్లలు మిగతా ఇతర దేశాల్లో నివసిస్తున్న వారితో సమానమేనన్న భావన – ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. మనమంతా ఒకే కుటుంబానికి చెందిన వారం వసుధైక కుటుంబం మాది అన్న భావననే నిరసనోద్యమాన్ని చేపట్టడానికి ఊతమిచ్చింది. మమల్ని మేమే బాంబులతో హతమార్చుకుంటున్నా మన భావనతోనే ముందుకడుగువేయడం తటస్థించింది.

అలాగే మార్చి 2009లో ఇంకొక 60 మంది మహిళా ఉద్యమనేతలతో యుద్ధ వ్యతిరేకనినాదంతో గాజా సరిహద్దులకు వెళ్ళడం జరిగింది. ఈ పర్యటన ముఖ్య లక్ష్యం ఇరాక్‌లోని యుద్ధ బాధితులను కలవడం స్వచ్ఛంద సేవా సంస్థలతో మాట్లాడడం అక్కడ నివసించే వారిని కలిసి వారి బాగోగులను గూర్చి క్షుణ్ణంగా తెలిసికోవడం అన్న ఉద్దేశ్యంతో ఈ పర్యటన రూపు దిద్దుకుంది.

**వ్యక్తిగత జీవితం**

1961లో అట్లాంటాలో ఉన్నత విద్యానంతరం కళాశాల విద్యలో పూర్తి స్కాలర్ షిప్‌ను పొంది చేరింది. ఆతర్వాత 1965 పట్టభద్రురాలయైదాకా న్యూయార్కు నగరంలోని సారా లారెన్సు కళాశాలలో చదవడం జరిగింది. అమెరికాలోని పౌరహక్కుల ఉద్యమంలో ప్రధానపాత్ర పోషించేందుకు విదవ వాకర్ సమయాత్తమయింది. ఆ తర్వాత మళ్ళీ దక్షిణాది ప్రాంతాలకు చేరి అక్కడ పౌరులను ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియ – సంక్షేమ పథకాల కోసం పోరాడే దిశగా పౌరులను తీర్చిదిద్దడం చిన్న పిల్లలకు సంబంధించిన ఎన్నో కార్యక్రమాలకు ఊతాన్నివ్వడం జరిగింది.

1965లో మెప్ లెవెంతల్‌ను కలుసుకోవడం ఆ తర్వాత వివాహం చేసుకోవడం జరిగింది (1967 మార్చి 17న న్యూయార్కు నగరంలో) ప్రప్రథమంగా న్యాయ బద్ధంగా జాతి వివక్షలేని జంటగా వారు జాక్సన్ (మిసిసిపి)లో ఉంటూ సరయిన గుర్తింపు పొందారు. ఈ గుర్తింపు వారికి సంతోషం కన్నా సంతాపాన్ని ఆనందంకన్నా ఆవేదనను అధికం చేసిందనే చెప్పుకోవాలి. కుక్లక్స్‌క్లాన్ దగ్గర నుండి హత్య చేస్తామన్న బెదిరింపులను కూడ వారెదుర్కోవడం మనం ఇక్కడ ప్రస్తావించుకోవాలి. 1969లో వారికి రెబెకా అన్న కుమార్తె జన్మించి – ఆమె క్రొత్త అమెరికాలో నూతన అధ్యయాన్ని వినూత్నమైన ఊపిరి తరానికి చెందిన వ్యక్తిగా విశేష ఖ్యాతినార్జించింది. 1976లో వాకర్ భర్త నుండి విడాకులు పొందడం. ఆ తర్వాత కూతురు కూడా (కూతురు రాజకీయ చిహ్నమేగాని వాత్సల్యాన్నందించే కూతురుగా లేదు) ఆమె తర్వాత తన తల్లిదండ్రుల ప్రభావం తన మీద ఎలాగ పడిందో వివరిస్తూ 'బ్లాక్ లైట్ మరియు జూయిష్' అన్న పుస్తకాన్ని వెలువరించడం జరిగింది.

**సాహితీ వ్యాసంగం**

వాకర్ ప్రప్రథమ కవితా సంపుటి ఆమె కళాశాల విద్యార్థిగా ఉన్న కాలంలోన వెలువడడం ఆ తర్వాత పౌరహక్కుల కోసం పోరాడే నేపథ్యంలో రచన వ్యాసంగానికి కొంత విరామ మివ్వడం గమనించదగిన అంశం.

1970లో మళ్ళీ రచనా వ్యాసంగాన్ని ప్రారంభించింది. ప్రథమ నవలను ప్రచురించడం 1976లో రెండవ నవలను ప్రచురించడం కూడా జరిగింది. 'మెరిడిమన్' ఈ నవలలో పౌరహక్కుల ప్రస్తావన వుండడం విశేషం. 1982లో మూడవ నవల "కలర్‌పర్‌పుల్" ప్రచురించడం జరిగింది.

ఈవెం నవలల్లో సింహభాగం మహిళలు వారి వెనుకుబాటుతనం దీన్నాసరాగా పురుషులు జరిపే అకృత్యాలు అంతేకాకుండా జాత్యహంకారం హింసతో అట్టుడికిపోతున్న – సమాజం పట్ల నిరసన వర్ణవ్యవస్థవల్ల ఏర్పడుతున్న అంతరాలు, అగాధాలు, ఎక్కువగా దర్శనమిస్తాయి. సంప్రదాయేతరమూ, బహుళ ప్రచారంలోని ఎన్నో వినూత్నమైన భావాలను ప్రోదిచేస్తూ కథలు, నవలలలో కవితంలందించిన ఘనత వాకర్‌ది.

2007లో వాకర్ 122 పెట్టెల నిండా తన వ్రాత ప్రతులను ప్రాచ్యలిఖిత ఖండాగారానికి ఎమెరీ విశ్వవిద్యాలయానికి అందజేయడం జరిగింది. ఆమె సంపాదకులతో, నేతలతో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను కూడా ఇందులో చేర్చింది.

2009వ సంవత్సరంలో టొరంట్ (కెనడా)లో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఇస్రాయేలుకు సంబంధించిన చిత్రాలను ఈ ప్రదర్శనలో భాగం చేయడాన్ని నిరసిస్తూ చేసిన సంతకాల ఉద్యమంలో గణనీయమైన పాత్రను పోషించారు వాకర్. ఆమె మరిన్ని రచనల ద్వారా మహిళాలోకానికి మహితమైన మార్గదర్శిగా దారిచూపాలని ఆశిద్దాం.



May 2010 pages.pmd 14 4/27/2003, 8:39 PM

# అలైస్ వాకర్ కవితలు

స్వేచ్ఛానువాదం:
రావెల పురుషోత్తమరావు

**భారతదేశం**

వేపచెట్లు
చట్టబద్ధమైనవే
అలాగే
ప్రతిభాసంపదకూడా

**స్వేచ్ఛ**

నా కూతురు
నాకు దూరమయింది
నేను కాదు...
స్వేచ్ఛ అంటే ఆమెకు
ప్రేమించే మాతృమూర్తి
అది
ఇబ్బందికరమైన
విషయమేమీ కాదు..
నాకు స్వేచ్ఛ అంటే
చిట్టచివరిగా
నాకు నేను పొందడం
నాకు నేనేదగ్గరవడం

**నీవొచ్చావు**

నాదగ్గరకు
నువ్వొచ్చింది
కేవలం
మేయడానికి
ఎందుకంటే
నీవు
ఆకలిగొని
వున్నావు
కడుపు నిండేదాక
నోరంతా
పుక్కిలిస్తూనే
వుంటావు
నా ఆకలి
మాత్రం
నిన్ను నిరాశ పరుస్తుంది

**కొన్నాళ్ళు**

కొన్నాళ్ళు
ఎందుకో .. ఎలానో
ఎవరికి తెలుస్తుంది
మళ్ళీ
కలసికట్టుగా
తిరిగిరా...
కలం పట్టుకున్నావు
రాస్తుంది
ప్రకటనల
సమాచారాన్ని గాదు
కానీ
హృదయాన్ని గురించి
గుర్తిస్తూ రాస్తుంది.

**విజేత**

పసివాడికైనా
పరిచయమైపోతుంది...
మనల్ని భయపెట్టేవాడే
తీవ్రవాది అనీ..
మన వస్తువుల్ని దొంగిలించేవాడు
తస్కరుడనీ..
మనల్ని అనునిత్యం ప్రేమించేవాడు
జగద్విజేత అనీ....

**బహుమతి**

పోటీ
ఏంకాదు గానీ
జీవితం
మనం గెలుచుకున్న
వర్తమానం

**రేఖలు**

ముఖం మీద ముడతల్ని
జీవితం
సాదరంగా ఆహ్వానించింది
అవి
స్వేచ్ఛగా నా ఇంట్లోకి దూరి
నా తలమీద కెక్కి
ముఖం మీదకు జారి
స్థిర నివాసమేర్పరుచుకున్నాయి.

**మహిళగా....**

మహిళగా
మనడమంటే
శవానికి
గడ్డకట్టుకోవడం
లాంటిది... కాదు

స్త్రీత్వానికి .. చావులేదు
అజరామరం అది
స్త్రీ నిద్రాళువు.. కాదు

కోపం సహజం
ఉడికిపోవడం నిజం
సహనంతో
కాలాన్ని గడపడం
యదార్థం

**నిన్ను నేను పూజిస్తాను**

నిన్ను నేను
మనసారా పూజిస్తాను
కానీ
నా సర్వస్వాన్ని మాత్రం
నీకర్పించను
నీవు నా తనువును
తగదన్నా
నీ అధరాలను
నాకు చేరువగా
చేర్చలేకపోయినా...
ఒకరి నొకరం
మనం..
ఆలింగనం చేసుకోకపోయినా
నిన్ను మనసారా పూజిస్తాను.














May 2010 pages.pmd 15 4/27/2003, 8:39 PM

కథ

# అశాంతి

## సి.హెచ్.వి. బృందావనరావు



***ఇంటికి వచ్చేసరికి రాత్రి పదిదాటింది. కారుదిగి ఇంట్లోకి వచ్చాను బాగా అలసిపోయాను అప్పటికే. డ్రైవరు కారు గారేజీలో పెట్టి, 'నేను వస్తాను సర్' అని చెప్పి వెళ్లిపోయాడు.***

***జ్యోతీ, దీపా చదువుకుంటున్నారు. 'అన్నం తిన్నారామ్మా' అని అడిగాను 'తిన్నాం డాడీ' అన్నారిద్దరూ. 'ఆయా పోయి ఎంతసేపయింది' 'నైన్ తర్టీ దాకా వుండి, మేం డిన్నరు చేసిం తర్వాత పోయింది' అన్నారు పిల్లలు.***

ఈ వారమంతా విమలకు నైట్ డ్యూటీ. ఓ పెద్ద కంపెనీలో పనిచేస్తున్నది. జీతం నెలకు ముప్పై వేలు. నాకు డెబ్బై వేల దాకా వస్తుంది. విమలకు ఓ వారం డే డ్యూటీ వుంటే ఓ వారం నైట్ డ్యూటీ. నాకు మామూలుగా డే డ్యూటీయే కాని అప్పుడప్పుడూ రాత్రిళ్లూ వుండాల్సొస్తుంది. ఆఫీసులో తీరికుండదు. ఒకటే టెన్షను.

డ్రైవర్ ఉదయం ఎనిమిదిన్నరకు వస్తాడు మామూలుగా. విమలకు నైట్ డ్యూటీ ఉన్న రోజుల్లో ఐతే ఇంకా పొద్దునే వస్తాడు. పావుతక్కువ తొమ్మిదికల్లా పిల్లలిద్దరూ స్నానాలూ, టిపిన్లూ ముగించుకుని స్కూలుకు రడీ అవుతారు. వాళ్లను స్కూల్లో దించి వస్తాడు డ్రైవరు. విమలకు కూడా డే డ్యూటీ అయితే ఇద్దరం కలిసి కార్లో పోతాం. కానీ ఇద్దరం కలిసిపోయే సమయాలు తక్కువ. 'ఇంకో కారు కొందామండీ' అంటుంది విమల. ఆ రోజు మెయిల్లో ఒక కవరు వచ్చింది. పర్సనల్ లెటరు. కొంచెం బరువుగా వుంది. పంపిన వారి అడ్రస్ చూశాను సూరి దగ్గర్నించి. ఏదో పెద్ద ఉత్తరమే రాశాడు. లెటర్ పక్కన పడేశాను తీరిగ్గా చదవొచ్చులే 'మేం నిద్రపోతాం డాడీ' అని లేచారు పిల్లలిద్దరూ. 'ఒకే మ్మా. గుడ్‌నైట్' అన్నాను. వారు వాళ్ల బెడ్రూంలోకి పోయారు.

మనసేమీ బాగుండడం లేదు. కారణం ఫలానా అని ఏమీ లేదు. సోఫా మీద నుంచి లేవాలంటేనే బద్ధకంగా వుంది. రూంలోకి పోయి షర్టూ పాంటూ విప్పేసి షార్టుల్లోకి మారాను. బాత్రూంకు వెళ్లి వేడివేడిగా స్నానం చేశాను.

మొట్టమొదట పనిచేసిన కంపెనీలో నలభై వేలిచ్చేవారు. ఓ సంవత్సరం అనుభవం రాగానే కంపెనీ మారాను. ఆ కంపెనీలో యాభై ఇచ్చారు. కానీపని బాగా ఎక్కువగా వుండేది. ఓ రెండేళ్లు ఆ కంపెనీలో పనిచేసి ఇంకా ఎక్కువ వస్తుందని ఈ కంపెనీకి మారాను. వీళ్లు జీతం బాగానే ఇస్తారు. అయితే రాత్రింబగళ్లు పనిచెయ్యాలి. ఫలితాలు చూపించాలి. వాళ్లకు అనుకున్న సమయానికి వారు కోరుకున్న ఫలితాలు వస్తే సరే లేకపోతే పీకిపారెయ్యడమే. అందుకే ప్రతి నిముషం టెన్షన్ టెన్షన్. విమలగ్గూడా మొదట ఓ పదివేలు వచ్చే చిన్న వుద్యోగం ఓ కంపెనీలో దొరికింది. కొంచెం అనుభవం రాగానే ఈ కంపెనీకి మారింది. జీతం బాగానే వస్తుంది కాని టైమింగ్సు అంత సౌకర్యంగా లేవు.

డిన్నరుకు్కూచున్నాను. ఆయా అన్నీ అమర్చిపోయింది. భోంచేసి, ఓ పావుగంట టి.వి. చూసి పడకమీదికి చేరాను నిద్ర రావడంలేదు. అశాంతి కారణం లేని అశాంతి.

తనూ విమలా బాగానే సంపాదిస్తున్నారు. మంచి ఇల్లు కొనుక్కున్నారు. లేటెస్టు సదుపాయాలన్నీ ఏర్పాటు చేసుకున్నారు. కారు కొనుక్కున్నారు. పిల్లలకు మంచి ప్రిస్టీజియస్ స్కూల్లో సీట్లు సంపాదించుకున్నారు. డ్రైవరున్నాడు. వంటకూ ఇల్లు సర్దడానికీ ఆయావుంది. మేం లేనప్పుడు పిల్లలను కనిపెట్టుకుని వుంటుంది. డబ్బు ఇబ్బందుల్లేవు. అయినా అశాంతి ఏదో కొరత.



May 2010 pages.pmd 16 4/27/2003, 8:39 PM

అప్పుడు జ్ఞాపకం వచ్చింది సూరి రాసిన ఉత్తరం ఏం రాశాడో పొద్దునే చదవాలి.

సూర్యమూ, నేనూ క్లాసుమేట్సుమి. మా వూరికి ఇరవైమైళ్ల దూరంలో వాళ్ల పల్లె. ఇంటర్మీడియట్టూ, ఇంజనీరింగూ, యం టెక్కూ కలిసి చదువుకున్నాం. వాడికీ మంచి వుద్యోగమే వచ్చింది. ఓ ఏడాది చేశాడు. తర్వాత మానేసి వాళ్ల వూరికి వెళ్లిపోయాడు. అదేమిట్రా అంత మంచి జాబ్ ఎందుకు వదిలేస్తున్నావు అని అడిగితే, లైఫ్ మొత్తాన్నీ ఉద్యోగమే తినేస్తుందిరా, అది నాకిష్టంలేదు అన్నాడు. అప్పట్నుంచీ వాళ్ల వూర్లోనే వ్యవసాయం చేయించుకుంటున్నాడు. వాడి భార్య ఉష కూడా పోస్టుగ్రాడ్యుయేట్. మంచి జంట. సూరి నాకు ప్రాణస్నేహితుడు. వాడు తల్లిదండ్రుల్తోనే కలిసివుంటున్నాడు. తల్లి దండ్రులనగానే జ్ఞాపకం వచ్చింది. అమ్మానాన్నా ఎలా వున్నారో. చాలా రోజులైంది వారిని చూసి. ఇక్కడికి రండి నాన్నా అంటే రారు. ఇక్కడ ఏమిలోటు వాళ్లకు. లంకంత ఇల్లు. వాళ్లకు ఏ పనికీ అభ్యంతర పెట్టేవాళ్ళు లేరు. మీరిద్దరూ ఉద్యోగాలనీ, పిల్లలేమో చదువులనీ వెళ్లిపోతారు. ఎప్పుడో పోతారో ఎప్పుడొస్తారో తెలియదు. ఇంట్లో మేమిద్దరమే గదా. మన వూళ్లో అయితే మాట్లాడుకోడానికి స్నేహితులైనా వుంటారు. ఇక్కడెందుకు మరి అంటారు. సరే వాళ్లిష్టం అని వూరుకున్నాం నేనూ విమలా.



ఓసారి వచ్చి నాలుగురోజులుండిపోరా అని సూరిని పోరి పోరి అడిగా వస్తాన్లే అనే వాడే గాని రాలేదు. మొన్న సిటీలో వాడికేదో పని తగిలి వచ్చి ఓ మూడు రోజులు మా ఇంట్లో వున్నాడు. రారా రారా అని గొడవైతే చేశాను గాని తీరా వాడితో గడపడం వీలే కాలేదు. అప్పుడు ఆఫీసులో విపరీతమైన పని వొత్తిడి వచ్చింది. శలవు దొరకలేదు. ఏ అర్ధరాత్రో వస్తే అప్పటికి వాడు నిద్రపోతుండేవాడు. ఓ మూడు రోజులుండి వెళ్లిపోయాడు. నా ప్రాణమిత్రుడు వాడు. వాడి దగ్గర నాకు రహస్యాలేంలేవు. ఒకరి భుజాల మీద ఒకరం చేతులు వేసుకుని ఒకరి బాధలు ఒకరితో ఏకరువు పెట్టుకునే వాళ్లం. ఈసారి మాత్రం తనివితీరా వాడితో మాట్లాడ్డం కుదరలేదు. అప్పటికీ ఒకసారి అన్నాను. 'ఏమీ బాగుండటంలేదు రా' అని 'ఏం' అన్నాడు. 'ఛ్చ, ఒకటే అశాంతి, విసుగు, వెలితి కారణం ఏమీ లేదు. ఏ ఇబ్బందులూ లేవు ఐనా…' అన్నాను. చాలాసేపు నా వైపు చూసింతర్వాత 'కారణం తెలుసుకోవడానికి ఏమైనాప్రయత్నం చేశావా' అన్నాడు. కారణం ఏమీలేదని నాకు తెలుసు. ఆ మాటే చెప్పాను. 'ఓమాటు నువ్వూ, విమలా, పిల్లలూ ఓపదిరోజులు శలవు పెట్టి మా వూరు రండ్రా' అన్నాడు. 'పదిరోజులు శలవే. అదీ ఇద్దరికీ ఒకేసారి. పైగా పిల్లలకూను నో వే అన్నాను.' మూడ్రోజులుండి వాడు వెళ్లిపోయాడు.

మర్నాడు పొద్దున్నే మామూలుగా లేచాను. పిల్లలు అప్పటికే లేచి వున్నారు. వాళ్ల పనులన్నీ పద్ధతి ప్రకారం చేసుకుంటున్నారు. పనిమనిషి ఇల్లు తుడుస్తున్నది నేను బాత్రూం లోకి దూరబోతుండగా కారు శబ్దం వినిపించింది. విమల వచ్చినట్లున్నది. బాత్‌రూం నుంచి రాగానే ఆయా కాఫీ తెచ్చి ఇచ్చింది. తాగుతూ పేపరు చూస్తున్నాను. విమలగూడ కాఫీ గ్లాసు తెచ్చుకొని సోఫాలో కూచుంది. నేను పేపరు చూస్తుండగానే కాఫీ త్రాగి రూమ్‌లోకి పోయింది. పావు తక్కువ తొమ్మిదికి పిల్లలు కార్లో స్కూలుకు పోయ్యారు. 'టిఫిన్ తెమ్మంటారా అయ్యగారూ' అడిగింది ఆయా 'కొంచెం ఆగులే, విమలా నేనూ కలిసి చేస్తాం' అన్నాను 'అమ్మగారు నిద్రపోతున్నారయ్యా' అంది ఆయా. నైట్ డ్యూటీలో పని ఎక్కువగా వుందేమో కాఫీ త్రాగి నిద్రకుపక్రమించింది విమల. టిఫిన్ తిని కంప్యూటర్ ముందు కూర్చున్నాను. 'నువ్వుపొయ్యే ముందు అమ్మగార్ని లేపి తలుపేసుకోమని చెప్పిపో' అని ఆయాకు చెప్పి పదిన్నరకు ఆఫీసుకు బయల్దేరాను.

మామూలు గానే ఆ రోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి పదిన్నరైంది. విమలలేదు. ఆమెకు నైట్ డ్యూటీ. జ్యోతి టి.వి చూస్తున్నది. దీప కంప్యూటర్ గేమ్స్ ఆడుతున్నది. ఆయా ఇంటికి పోవడానికి సిద్ధమౌతున్నది. కారుతాళాలిచ్చి డ్రైవరు వెళ్లిపోయాడు. ఇవ్వాళ ఆఫీసులో పని ఇంకా ఎక్కువగా వుంది. ఎవరో విదేశాలనించి డెలిగేట్లు వచ్చారు. వాళ్లతో చాలా సమయం గడిచిపోయింది. ఇంటికొచ్చేసరికి బాగా అలసిపోయాను. అదే అశాంతి. అదే వెలితి విసుగు విసుగు.

సూరి రాసిన లెటర్ చదవనే లేదనేది గుర్తుకు వచ్చింది. లెటర్ తీశాను. నిజానికి మేం లెటర్లు ఎప్పుడూ రాసుకోలేదు. లాండ్ ఫోన్లోనో సెల్‌లోనో మాట్లాడుకుంటుంటాము.

వాడు స్వయంగా తెలుగులో రాసిన నాలుగు పేజీల ఉత్తరం చదవడం మొదలెట్టాను.

నా కళ్లు అక్షరాల వెంట పరుగెత్తాయి. అయినా నెమ్మదిగానే పదం పదం పట్టి చూసుకుంటూ వాక్యం వాక్యం మననం చేసుకుంటూ ఉత్తరం పూర్తిగా చదివాను. ఒక పెద్ద విశ్వాసం వచ్చింది. ఓ రెండు నిమిషాలు కండ్లుమూసుకుని అలాగే కూర్చున్నాను. ఆ ఉత్తరం లోని ప్రతి వాక్యమూ నా వంటి మీద ఒక్కొక్క బట్టనూ ఒక్కొక్క బట్టనూ విప్పివేస్తున్నట్లుంది. నా చర్మాన్ని కూడా వలిచి నా అసలు అస్తిత్వాన్ని కూడా నాకు చూపెడుతున్నట్లుంది. నిజానికి వాడు చెప్పిందాకా నా బ్రతుకింత వర్ణహీనంగా రుచి హీనంగా సౌరభ రహితంగా వుందనే సంగతి నాకు తెలియలేదు. వాడు రాసిన ప్రతి మాటా నన్నో ఏకాంత నిర్జన ప్రదేశంలో నగ్నంగా నిలబెట్టినట్లనిపించింది.

"వొరేయ్ మూర్తీ! ఎలా వున్నావురా! నిజం చెప్పుమంటావా. నువ్వు ఎలా వున్నావో నీకు తెలియదు. నీకు తెలియదనే సంగతి కూడా నీకు తెలియదు. బ్రహ్మాండంగా బతుకుతున్నానని అనుకుంటున్నావు గాని నిజానికి లోకంలోని నిరుపేదలందరికన్నా హీనమైన స్థానంలో



May 2010 pages.pmd 17 4/27/2003, 8:39 PM

వున్నావురా నువ్వు. జీవనయాత్రలో ఎక్కడికి పోతున్నావు. ఎలా ప్రయాణం చేస్తున్నావు. అసలు నీ గమ్యం ఏమిటి. గమ్యం అలా వుంచు. అసలు నీవు ఎందుకు బ్రతుకుతున్నావో నీకేమైనా తెలుసా, తెలుసుకోవాలనే ప్రయత్నం చేశావా? జీతం నలభైవేలు వస్తుంటే చాలదని యాభైవేలిచ్చే దానికిపోయావు. అదీ చాలలేదని డెబ్భై వేలిచ్చేదానికి పోయావు. విమలను కూడా క్రమంగా ఒక్కొమెట్టూ ఎక్కించావు. కాని మీరు మెట్టెక్కి పైకి పోతున్నారా ఒక్కో సోపానం నుంచి కిందికొస్తూ అధోలోకం లోకి కూరుకుపోతున్నారా అనేది ఎప్పుడైనా ఆలోచించారా.



ఓ బ్రహ్మాండైన ఇల్లు కొన్నావు గుడ్. అన్ని సౌకర్యాలూ అమర్చుకున్నావు. ఫైవ్ స్టార్ హోటల్ లెవెల్లో అన్ని సదుపాయాలూ సమకూర్చుకున్నావు హీటర్లు, ఫ్రిజ్‌లు, టి.విలు, వాషింగ్ మెషీన్లు, సోఫాలు, కంప్యూటర్లు, మైక్రోవేల్ ఓవన్లు, డైనింగ్ టేబుల్సు, రివాన్లు, మ్యూజిక్ సిస్టమ్సు, సీడీ డీవిడీ ప్లేయరూ, అన్నీ సునాయాసంగా అమర్చుకున్నావు గ్రేట్ నీ ఇంట్లో అన్నీ వున్నాయి గాని, అసలైంది అదే 'ఆత్మ' అనేది వుందట్రా. ఏమి ఇల్లురా నీది. అశాంతిగా వుంటున్నది ఏమీ బాగుండటం లేదురా అన్నావు. ఆత్మ అనేదే లేకపోతే అశాంతిగాక మారెట్లా వుంటుంది రా.

మొన్న నేను మూడ్రోజులుంటే ఒక్క గంటసేపు నాతో గడపలేకపోయ్యావు నువ్వు. నీ బిజీ జీవితం నాకు తెలుసు కాబట్టి నేనేమీ బాధపడలేదు.కాదు కాదు, చాలా బాధపడ్డాను. నువ్వు నాతో గడపనందుక్కాదు. ఎన్నో రోజుల తర్వాత కలిసిన నా ప్రాణమిత్రుడితో ఓ గంట కూడా గడపలేనంత భయంకరంగా తయారైందే నీ జీవితమని చాలా బాధపడ్డాను.

ఒరేయ్ మూర్తీ! నాతో గడపడం, గడపకపోవడం అటుంచు. విమలతో నువ్వు గడిపి ఎన్ని రోజులయిందిరా. గడపడం అంటే సమయం అనుమతించిన ఏ క్షణంలోనో ఓ అయిదు నిముషాలు బెడ్‌మీద గడపడం సంగతి కాదు నేను చెప్పేది. ఆమె వొళ్లో నువ్వో, నీ వొళ్లో ఆమో తలపెట్టుకు పడుకుని, ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసుకుంటూ, ఒకరి చేతులొకరు పట్టుకొని, కలసి నవ్వుకొని, కలసి మాట్లాడుకొని, కలిసి కన్నీళ్లు రాల్చుకుని కలసి పాత ఘటనలు నెమరు వేసుకొని ఎన్ని రోజులైందో గుర్తుంది రా నీకు. ఇద్దరూ చేతుల్లో టీ కప్పులు పట్టుకొని, బాల్కనీలో కూచుని, వానపడుతుంటే ఆనందంగా చూస్తూ నవ్వుకున్నార్రా ఎపుడైనా. అసలు కలిసి భోంచేసి ఎంతకాలమైందో గుర్తుందిరా నీకు. ఇల్లిల్లూ అడుకుని తెచ్చుకున్న కబళాన్ని ఏ చెట్టు కిందో, ఏ సత్రం అరుగు మీదనో కూచుని బిచ్చ గాళ్లు మొగుడూ పెళ్లాలు ఒకరినోట్లో మరొకరు ముద్దలు పెట్టుకుంటూ తింటారే కనీసం ఆ ముష్టి వాళ్లు పొందే ఆనందం పొంది ఎన్ని రోజులైంది రా మీరు. నీ ఆఫీసుకు నువ్వు పోతావు నీకు వీలు దొరికినప్పుడు ఇంటికి వస్తావు. విమల ఎప్పుడోపోతుంది ఎప్పుడోవస్తుంది. ఇంట్లో సమయానికి అన్నీ అమరిపోయే ఏర్పాట్లు చేసుకున్నారు. గాని మీ బ్రతుకులు ఒకదానికొకటి అమరే ఏర్పాట్లు చేసుకున్నార్రా !

సరే, దీపా, జ్యోతీల సంగేతేమిటి? ఉదయంలేవడం కార్లో స్కూలుకు పోవడం, సాయంత్రం రావడం టీ.వీ ముందో కంప్యూటర్ ముందో కూచోడం ఇదేనా వాళ్ల జీవితం? మీ ఇంటి నాలుగ్గోడల అవతలుండే ప్రపంచాన్ని గురించీ, మనుషుల గురించీ చెట్ల గురించీ, కొండల గురించీ, సెలయేళ్ల గురించీ జంతువుల గురించీ వాళ్లు తెలుసుకునే అవకాశం టి.వీ ద్వారా కాకుండా స్వయంగా అనుభవించి తెలుసుకునే అవకాశం వాళ్లకు జీవితంలో ఎప్పుడైనా వస్తుందా. టీ.వీలో కన్పించే ప్రపంచం కాక ఇంకా అద్భుతమైన, విశాలమైన ప్రపంచం వుందని వాళ్లు ఎప్పుడు తెలుసుకుంటారు. అదలా వుంచు. నువ్వూ విమలా వాళ్ళను కని భూమ్మీద పడేశారు గాని ఆ పిల్లలను అసలు మీరు ఎత్తుకుని ముద్దాడారా. వాళ్లకు స్వయంగా లాలలు పోసి, తలలు దువ్వే ఆనందం వాళ్లకిచ్చారా, మీరనుభవించారా, చేస్తే ఆయా చేయాలి, లేదా వాళ్లే చేసుకోవాలి. అసలు మీరంతా ఏ ఆదివారమో తప్ప, అదీ వీలు కుదిరితేనే, కలిసి ముచ్చట్లాడుకున్న రోజులెన్ని? అలాంటి కుంచించుకుపోయిన వాతావరణంలో పెరిగిన పిల్లల మనస్సులు ఎలా విశాలమౌతాయి. పుస్తకాలు బట్టీ పట్టి జనరల్ నాలెడ్జిలో వందకు వంద మార్కులు తెచ్చుకుంటారు. లెక్కల్లో ఫిజిక్సులో వందలొందల మార్కులొస్తాయి. ఇంతే నా వాళ్ల జీవితం తల్లి ఎప్పుడొస్తుందో తెలియదు. వచ్చిన తర్వాత ఎప్పుడు నిద్రపోతుందో ఎప్పుడు లేస్తుందో తెలియదు. తండ్రి ఎప్పుడొస్తాడో తెలియదు. స్కూలూ, టీ.వీ, కంప్యూటరూ తప్ప మరేమీ తెలియని ఆ పసి పువ్వులు వికసించేదెల్లారా? మార్కుల్లోపోటీ, గ్రేడుల్లో పోటీ వీటితో మొద్దుబారిపోయి ఆర్ద్రత లేకుండా ఎండిపోవట్రా ఆ పసి మనుసులు?

నీ బ్రతుకులో అశాంతి ఎవరు సృష్టించింది కాదు నువ్వు సృష్టించుకున్నదే నువ్వే నీ బ్రతుకును బందిఖానాగా మార్చుకున్నావు. డబ్బు, డబ్బు, జీతం, మరింత జీతం, ఇంకా ఎక్కువ సంపాదన. ఈ ఇరుకు సందులోపోతూ గాలి ఆడడం లేదని గోలపెడితే ఏం లాభంరా. నీ బంధనాలు నువ్వే తెంచుకొని ఆ ఇరుకులోంచి ఆ మురికిలోంచి బయటపడకపోతే నీ బ్రతుకే కాదు నీ భార్యా పిల్లల బ్రతుకులూ కూడా నీలాగే అశాంతితో మగ్గిపోతాయి. నువ్వు అశాంతి అశాంతి అని నాతో అన్నావు. విమల నీతో అన్నదో లేదో, లేక తనలో తను అదే అశాంతితో ఆరాటపడుతున్నదేమో నువ్వు కనుక్కున్నావా? ఆ మాత్రం తీరిక వుందా నీకు? మీ ఇంట్లో వున్న మూణ్ణాళ్లూ నేనూ బందిఖానాలో వున్నట్లనిపించింది. జీవితమంతా స్వేచ్ఛగా గడిపిన మీ అమ్మానాన్నలకేమనిపించి వుంటుందో వూహించు ఇప్పుడైనా.

డబ్బు కొంచెం సుఖమిస్తుంది. అంతేకాని డబ్బే సుఖం కాదు. ఈ లోకంలో సుఖం చాలా వాటిల్లోవుంది. స్వేచ్ఛలో సుఖముంది. ఆపేక్షలో సుఖముంది. అనుబంధాల్లో సుఖముంది. కష్టంగానీ సంతోషంగానీ ఆత్మీయుల్లో కలిసి పంచుకోవడంలో సుఖముంది.



May 2010 pages.pmd 18 4/27/2003, 8:39 PM

# రెక్కలు కుట్టిన పావురం

**నాగిశెట్టి**




పంజరంలోని చిలుక
దోసకాయను గిల్లుకున్నట్లు
'కార్పొరేట్' గోడల మధ్య
బాల్యం
పుస్తకాలను జుర్రుకుంటోంది
కెరీర్ మత్తులో
కాలం – మార్కులు గ్రాఫ్‌తో
కుస్తీ పడుతూ
నీటి తొట్టిలో వేసిన మొగ్గలా
బలవంతంగా విచ్చుకుంటోంది
మారాం చేస్తుంటే
బుజ్జగించే అమ్మ చేతులకు
గారాలు పోతుంటే
మురిసిపోయే నాన్న చూపులకు
వెన్నెల్లో తనతోపాటే
పరుగెత్తే చందమామకూ,
బామ్మ బతుకు కథలకూ
దూరంగా, నా బాల్యం
సొట్టల టంగుపెట్టెలో
మగ్గిపోతోంది
రెక్కలు కుట్టిన పావురంలా
ఆకాశమంత జీవితాన్ని
అగ్గిపెట్టెలో చూసుకుంటూ

# నానీలు

**జోసఫ్**



అన్ని బంధాలను
బద్దలు కొడుతుంది
రాజకీయ
సంబంధం

పచ్చితాగుబోతు
చనిపోయాడు
భార్యాబిడ్డలు
సుఖపడ్డారు

కళ్ళు ఉంటేనే
చూస్తారు అందరు
లేకున్నా చూస్తారు
మనసున్న కొందరు

ఆలిపోయినా
భర్త పోయినా
మలిగిన దీపాలే
తేడాలెందుకు ?

ఇనుము – సిమెంట్
కలిపి తిన్నాడు
సొంతిల్లు వెలిసింది
వంతెన కూలింది.

కొనగోటితో
కోటిరాగాలు
పిడికెడు గుండెలో
మహాసాగరం

మీ ఆరోగ్యమే
మాకు ప్రధానం
నీళ్ళపాలు పోస్తూ
పాలబ్బాయి!

---

అంతేకాని కేవలం డబ్బులోనే కాదు.

ప్రాణమిత్రుడివి నువ్వు, అశాంతిగా వుందిరా, మనసు బాగుండటంలేదు అంటుంటే ఉండబట్టలేక ఇదంతా రాశాను. పంజరంలోని పక్షికీ స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరే పక్షికీ తేడా తెలియని వాడివి కాదు నువ్వు పంజరం వీడి బయటకు వచ్చిం తర్వాత ఇక పక్షి పంజరంలోకి పోదు. ఓసారి నువ్వూ, విమలా, పిల్లలూ శలవుపెట్టి ఇక్కడికి రండి. నాల్రోజులుండి పోదురు గాని"



ఇదీ ఉత్తరం. చదవడం పూర్తయిన తర్వాత చాలాసేపు అలానే వుండిపోయాను. గుండె పిండినట్లయి, ఉన్న చోట్నించి గొంతులోకి వచ్చి బయటకు రాలేక అక్కడే కొట్టుకుంటున్నట్లు డగ్గుత్తిక.

రాత్రంతా నిద్రలేదు. ఒకటే ఆలోచనలు. పొద్దున్నే విమల వచ్చి స్నానమదీ చేసి ఫ్రెష్‌గా వచ్చి సోఫాలో కూచుంది. సూరి రాసిన వుత్తరాన్ని విమలకిచ్చి, 'సూరి మనిద్దరికీ రాసిన వుత్తరమది చదువు' అన్నాను. పూర్తిగా చదివింతర్వాత తలెత్తినావైపు చూసింది. నాకెలాంటి అనుభవమైందో అలాటి ఉద్వేగమే విమల్లో. ఆమె కళ్లల్లో సన్నటి నీటిపొర.

నేను అప్పటికే నిశ్చయం చేసుకొని వున్నాను. నా మనసు చాలా తేటగా వుంది. లేచిసోఫాలో విమల పక్కనే కూచుని ఆమె చెయ్యి నా చేతిలోకి తీసుకున్నాను. విమల నన్నే చూస్తున్నది. చాలాసేపు ఆమె కండ్లల్లోకి చూస్తూ ఉండిపోయాను.

'విమలా, ఏం ఉద్యోగాలివి. రాత్రింబవళ్లు నిన్నెంత బాధపెట్టాను. ఎలా వుండే దానివి ఎలా అయిపోయావు. నీకండ్లల్లో ఆ మెరుపేమైంది. వేరీసారీ విమలా. సంపాదించుకున్నది చాలు. ఇక నువ్వీ పరుగులు మానెయ్యి. నిశాచరిలా కాకుండా స్వేచ్ఛగా సంతోషంగా వుండు. ఇకనైనా మనం ఎక్కువ కాలం కలిసి బ్రతుకుదాం! అన్నా. విమల కండ్లల్లోఆనందంతో కూడిన ఆమోదం కనిపించిది. సెల్ తీసుకుని సూరిని పిలిచాను.

"ఒరే సూరీ ! నేనూ విమలా పిల్లలూ వచ్చే సోమవారం మీ వూరు వస్తున్నాం. ఉషకి కూడా చెప్పు ఓ వారం రోజులు అక్కడే వుండి మా వూరికి పోతాం. వచ్చేటపుడు మా అమ్మా నాన్నల్ను ఇక్కడికే పిలుచుకొచ్చుకుంటాం. వాళ్లిక మాతోనే వుంటారు. ఒరేయ్ సూరీ ! చాలా చాలా థాంక్స్‌రా!" అని ఫోన్ ఆఫ్ చేసి విమల వైపు చూశాను విమల ముఖంలో కనిపించిన రిలీఫ్ చూసి నాకు ఇంకా రిలీఫ్ అనిపించింది.



May 2010 pages.pmd 19 4/27/2003, 8:39 PM

## కవితకో కవిత

ఎ. పుష్పాంజలి



కవితా ఓ కవితా
నీకోసం దిగంతాలకు పరుగులు పెట్టేవాళ్లకూ
ఆలోచనల అగాధాల్లో, మేధల మదింపుల్లో
మిథ్యాశోధనలు చేసే వాళ్లకూ,
నువ్ దొరకలేదు.
కాని
ప్రకృతి వికృతుల మధ్య బద్ధలై
ఆకృతి మాసిన నా మనసు ముక్కల్ని
ఏడుస్తూ నేనేరుకుంటున్న వేళ
నీ చల్లటి స్పర్శతో నా కన్నీళ్లు తుడవడానికొచ్చావు.
కవితా,
శ్వేతతివాచీలుగా నారాతలనే పరుద్దామనుకొన్నా
కలాల హలాలతో ఆలోచనలు దున్ని
కనుల నిరీక్షణలే నీకు నైవేద్యాలు చేసి,
నే స్వాగతించిన వేళ నువ్ రాలేదు.
ఐతే,
శబ్దంలేని వేడితో పూల వయసు దోచేసి
సెలయేళ్ల గర్భాలనుంచి మేఘాలను ప్రసవింపజేసే,
ఇనుడెంత ఘనుడా అని అచ్చెర వొందే వేళ
కమ్మటి వాసనలు విరజిమ్ముతూ వొచ్చావు.
కవితా,
చుక్కల సభలో రేరాజు కొలువు తీరిన వేళ,
వెన్నెల్లో తడిసి ముద్దైన నేను, తన కోసం....
వలపుల దారుల్లోకి తలపుల ద్వారాలు తీస్తే
మెరుపుల విరుపులతో, మధ్య నువ్వెందుకొచ్చావు?
ఇంకా కవితా,
ఒంటరి ఎడారుల్లో తడారిన గుండెల్లోకి
తొలకరు లేవైనా తొంగి చూస్తాయని భ్రమసి
నిరాశలే శాశ్వతాలని నిశ్చయంగా నమ్మినవేళ
మనసు పరదాలు ఛేదిస్తూ నువ్వొక్కదానివేవొచ్చావు.
నా కవితా,
యుగయుగాల దాస్యాల్లో, నిరంతర సహగమన కాష్టాల్లో
బలిపశువునై, అవిశ్రాంత పోరాటంలో నిగ్గుదీరేనాకు,
తరతరాల సంకెళ్లు ఛేదించమంటూ బోధించి,
కసి కలాల కత్తులిచ్చావు కవితా.
చివరిగా కవితా,
ఆశనిరాశల్లో అలసి, నీ స్పర్శలో సేదదీరి,
అవతలేముందో చూద్దామనుకుని
నాతుది శ్వాస నింగికెగిసితే ......
అక్కడ కూడా నువ్వుంటావా కవితా?

---

## కన్నీటి వరద

సోమిశెట్టి వేణుగోపాల్



ఎందుకో గానీ ప్రకృతి తల్లి
కర్నూలుపై కన్నెర్రజేసింది
తన వైపరీత్యంతో
వికృత నాట్యం చేసి వెళ్ళింది
అరుదుగా వచ్చిన ఈ కన్నీటి వరద
విషాదకాలాన్ని మోసుకొచ్చింది
వ్యవసాయానికి వరప్రసాదమైన కృష్ణవేణి
ప్రాచీన కవుల పొగడ్తలను త్రోసిపుచ్చుతూ
కర్నూలు దుఃఖదాయనిగా మారింది
తుంగభద్రతో జతకట్టి
విలయతాండవం చేసి వెళ్ళింది
కళ్ళు మూసి తెరిచేలోగా
కర్నూలును మింగేసింది
ఉన్నదంతా ఊడ్చుపెట్టుకుపోయింది
కన్నీళ్ళను మాత్రమే మిగిల్చింది
ఏమయితేనేం !
దురదృష్టం దాడి చెయ్యనే చేసింది
ఇది మానవత్వానికి
ప్రకృతిపెట్టిన పరీక్ష అనుకుందాం
ఇప్పుడిక
మానవత్వం పరమళించవలసిన
సమయం ఆసన్నమైంది
సాటి మనిషికి నీ సహాయం కావాలి!
ప్రతిచేయి ఒక అభయహస్తం కావాలి!
నేనే ఒక సమస్యల సుడిగుండం" అనుకోకు
కర్నూలులో కరిగిపోయిన ఒక ఇల్లు
నీదే అనుకో!
మంత్రాలయంలో మరణించిన ఒక మనిషి
నీ మనిషే అనుకో !
ఇప్పటికే ఎందరో ముందుకొచ్చారు
పిల్లలు కూడా ప్రేమమూర్తులయ్యారు
తాతలు కూడా దాతలయ్యారు
ఉన్నతవర్గం ఉదారతత్వం చాటుతోంది
వెల్లువెత్తిన ఈ ఔధార్యానికి అభివందనం
ఆపన్నహస్తం అందించిన
ప్రతివ్యక్తి పాదాలకు పుష్పాభివందనం !
ఎన్నో సహాయపు కెరటాలు లేచాయి
ఇంకా విశాల జనసంద్రంలో
అన్ని వర్గాల అలలు
ఉవ్వెత్తున ఎగసిపడాలి
ఇంకా ఉప్పెనలా ఎగసిపడాలి
కర్నూలును ముంచి వేసిన వరదకన్నా
ఈ వాత్సల్యపు వరద
ఇంకా పెద్దదవ్వాలి!
అసంఖ్యాకమైన అభాగ్యుల వ్యధలను
తన ప్రవాహంతో పాటు ఊడ్చుకెళ్ళాలి.



May 2010 pages.pmd 20 4/27/2003, 8:39 PM

## పరిశీలన

# 'మారనివాడు' లో దళిత స్పృహ

పి. సుధారాణి

బోయిభీమన్న దళితకవి. దళితుల కవి. దళితులను గూర్చి ఆవేదన బోయి భీమన్న రచనలలో కనిపిస్తుంది. హిందూ సమాజం, హిందువులే అయిన దళితులను వేరుచేయటం, బోయిభీమన్నను ఎంతో అసహనానికి గురిచేసింది. ఆ ప్రభావం బోయిభీమన్న ఎన్నో కవితలలో కనపిస్తుంది కూడా. సమాజంలోని హరిజనులను గూర్చి సాగిన రచనే 'మారనివాడు' అనే వచన కవిత. 'గుడిసెలు కాలిపోతున్నై' లోని ఖండిక ఇది. 1973లో వెలువడిన సంకలనంలోని ఈ కవితలో ఎంతో దళిత చైతన్యం ఉంది.

**'మారని వాడు' వృత్తి**

"మనిషి మారినా
వాడు మాత్రం మారడు!"
"వాడి చేతిలోది
అదేమిటనుకొంటున్నారు?
.................................
పుర్రె! పుర్రె !
...............................
మనిషిది, అది మనిషి పుర్రె"
...............................
బాబోయ్! పాములు, పాములు,
వాడికి శ్మశానం ఇల్లుకానూ"
.............................
"వాడు కట్టిన ఆ మురికి తోలు
ఏనాడు చచ్చిన ఏ జంతువుదో
ఆ జడల్లోదేమిటో తెలుసా?
గంగాతీర్థమా? వాడి శ్రాద్ధం!
అది కల్లండీ... కల్లు !
వీడికి వెంట నాలుగు కుక్కలు కూడానా?"

ఇవన్నీ ఈ కవితలోని హరిజనుడు, కాటి కాపరి వృత్తి కలవాడిగా చెబుతున్నాయి.నీ ఇల్లు బంగారంగాను అన్నది లోకోక్తి. వాడికి శ్మశానం ఇల్లుగానూ అన్నది కవి ఉక్తి. కవి ఆశ కవి కాంక్ష. హరిజనుడి ఆవాసంగా శశ్మానం కాక ఇల్లు ఉంటే ఎంత బావుంటుంది అనే కోరిక ఉంది. సవర్ణులుండే చోటుకి వచ్చాడని ఆశ్చర్యపోవటం వెనుక హరిజనుడి నిత్యావసరం ఊరి వెలుపల, ఊళ్ళోకి రావటం పెద్ద ఆపదగా అశుద్ధంగా ఆశ్చర్యంగా భావింపబడటం ఉంది. ఇది పరోక్షంగా సమాజంలో కాటికాపరి స్థానాన్ని తెలుపుతుంది.

హరిజనుడు వృత్తిలోని చావుతో, శవాలతో ముడిపడిన వృత్తిలోని – కుంగదీసే గుణాన్ని జయించే మానవ ప్రయత్నం ఫలితంగా కల్లుతాగి ఉన్న స్థితిని చెప్పవచ్చు. అతని వెంట ఉన్న కుక్కలు అతని భూతదయకు నిదర్శనం. మానవమాత్రులు తోడుగా నిలవని అతని ఏకాకితనానికి తోడుగా నిల్చే సహచరులు.ఇన్నింటి ద్వారా భీమన్న కాటికాపరి వృత్తిగా గల హరిజనుడిని ప్రధాన వారధిగా చేసుకొన్నాడు తన ఆలోచనల ప్రసారానికి

**హరిజనుడి వర్ణన**

ఈ కవితలో హరిజనుడిని వర్ణించాడు.

"అంత మారని ఆత్మారాముడు
ఎవరు అంటున్నారా?
వాడు ఆత్మారాముడు కాదండీ
హరిజనుడు !
వట్టి అంటరానివాడు
అడుక్కు బ్రతికేవాడు
.............................
'వాడు కట్టిన ఆ మురికి తోలు
ఏనాడు చచ్చిన ఏ జంతువుదో'
...............................
ఈ ఒంటెద్దు వ్యవసాయం గాదు
మింగడానికి మెతుకైనా లేనివాడు
కడుపూ, కన్నూ నకనక మండుతున్నా
ఎదుటి దుకాణం నుంచి ఒక్కో కబళం
లాక్కు తినడమైనా చేతకాని వాడు.
ఈ దెసమాలిన దిసమొలవాడు."

ఇక్కడ భీమన్న సరైన తిండి గుడ్డలేని హరిజనుడిని వర్ణిస్తున్నాడు. తిండి గూడు గుడ్డ కనీసపు భౌతిక అవసరాలు. అవే లేవు. అంతేకాదు లేని అవసరాలను సమకూర్చుకోలేని అంతటి అమాయకుడు. అమాయకుడు మాత్రమే కాదు, కనీసం దౌర్జన్యంగానైనా కడుపు నింపుకొనే యత్నం చేయలేని నిజాయితీపరుడు. ఉండటానికే కాదు కట్టటానికి కూడా ఏమీ లేనివాడు. ఇంకా అంటాడు–

"వాణ్ని మీరెప్పుడైనా చూశారా?
చూసుందరు, వాడు చూడరాని వాడు!
........... వాడు చేరరాని వాడు !" అయిన హరిజనుడు ఎలా ఉంటాడో భీమన్న పరిచయం చేస్తున్నాడు.

"ఎప్పుడైనా చూశారా, వాడి కాళ్ళు?
ఆ కాళ్ళ కింద ఎంత చండాలం !
అందుకే వాణ్ని చండాలుడన్నారేమో !



May 2010 pages.pmd 21 4/27/2003, 8:39 PM

................................

చూడండి, ఆ ముడులు కట్టిన జడలు
ఆ సుడులు చుట్టిన ఒడలు !
వాడినిండా ఎక్కడెక్కడి ధూళిదూగరో
ఎవళ్ళెవళ్ళ బుగ్గి బూడిదో !

అంటూ శారీరక శుభ్రతలేని, తెలియని హరిజనుడి రూపాల్ని, అది ఎంత దుమ్ము ధూళితో కలగలిసి ఉందో చెప్తున్నాయి.

"బహుశా, అది నెలవంకలా వంచి కట్టిన
కల్లుపాయ కావచ్చు.
..........................
వీడికి వెంట నాలుగు కుక్కలు కూడానా?
అరె – అటు వెళ్ళకండి !
కరుస్తై
వాడిలాగే అవి కూడా
ఎప్పుడూ మత్తెక్కి వుంటై."

అంటూ నిత్యం కల్లు కంపుతో కైపెక్కి ఉండటం హరిజనుడికే కాదు అతని వెంట తిరిగే కుక్కలకూ అలవాటే అని చెబుతున్నాడు–

"వీడు చచ్చు హరిజనుడే కాదు
పచ్చి గిరిజనుడు కూడా!"

"లౌక్యం సవర్ణులకు తెలిసినంత అవర్ణులకు తెలియదు కదా ! ......................... అంటూ వీడిని కొండల్లో బండలా బ్రతికే గిరిజనునితో పోల్చాడు." – ఆనందరావు కల్లూరి (హరిజనాభ్యుదయం)

ఇలా భీమన్న హరిజనుడి అనాగరిక రూపం. ఆరూపంలో దాగిన స్వచ్ఛత, అమాయకత, ఔదార్యం నిజాయితీలను వర్ణించాడు.

**హరిజనుడి పట్ల సమాజ దృష్టి**

"అడుక్కు బ్రతికేవాడు!
వాణ్ని మీరెప్పుడైనా చూశారా?
చూసుందరు, వాడు చూడరానివాడు
వాడి మూకుట్లో మీరేదైనా వేశారా?"

సమాజం హరిజనుడిని దూరంగా ఉంచింది. స్వతంత్ర దేశంలో తరాలుగా అణచివేతకు గురైన హరిజనుడికి ఎలాంటి ఉద్ధరణ అవకాశమూ లేదు. నేటికి అదే మనస్తత్వం కొనసాగటాన్ని ప్రశ్నిస్తున్నాడు భీమన్న.

తినడానికే కాదు కట్టుకోడానికీ ఏమీలేదు ఆ హరిజనుడికి అని చీదరించుకొనే కంటే

"వాడు కట్టిన ఆ మురికి తోలు
ఏనాడు చచ్చిన జంతువుదో
............................
ఒక తోలు వాడి ముఖాన పారేసి
హరిజన సేవ చేసినందుకు
అవార్డు పుచ్చుకోవచ్చు కాని
మన కంపెనీ గొడౌంలో
పన్నీట పిండి, అత్తరు అద్ది ఆరేసిన
తాజాతోళ్ళెన్ని లేవు?" అని ఎద్దేవా చేశాడు.

అంతే కాదు హరిజన ఉద్ధరణ కేవలం రాజకీయానికో ప్రచారానికో పరిమితమై పోవటాన్ని

"ఒక పదవి గల ప్రెసిడెంటు
ఒక స్వజనుడైన విలేకరి
ఒక తెలిసిన ఫొటోగ్రాఫరు
సమయానికి దొరికి చావాలి కదా
లేకపోతే – ఎందుకూ దండగ?
పబ్లిసిటీ లేని ప్రజాసేవ
పనిలేని మంగలితనం !"

అని వ్యంగ్యంగా నిరసించాడు.

"బాబోయ్! పాము పాము
........................
ఇదే తన ఇల్లన్నట్టు కూర్చున్నాడు"

అంటూ ఇల్లులేని వాడు సమాజంలోకి ప్రవేశిస్తేనే, సమాజం ఎలా ఈసడించుకొంటుందో చాటాడు.

సమసమాజం నవనాగరికత పేర హిప్పీ సంస్కృతి పేరిట పడుతున్న పెడదారులను వ్యంగ్యంగా నిరసించాడు.

"వీడు మారకపోతే – పోయె
మారుతున్న మనిషిని
మారుతున్న సమాజాన్ని కూడా
తనకేసి మార్చుకొంటున్న
పరమ ధూర్తుడు వీడు!
ఇప్పటికే మీరు గుర్తించి వుంటారు
ఈనాటి నవ నాగరిక
అత్యాధునిక హిప్పీకుంక లందరికీ
వీడే ఆదిపురుషుడు కాదంటారా?"

సమాజం చేయూతనివ్వకపోయినా, రాజ్యాంగం చట్టం ఇచ్చే ఆసరా కూడా ఇతని పురోగతికి దోహదం కావటం లేదు.

"వీడికెన్ని రిజర్వేషనులు కల్పించినా
ఎంత సానుభూతితో రాసుకు తిరిగినా
ఎన్ని చట్టాల రాజ్యాంగ రథాలపై వీణ్ని
కాస్త ముందుకు తోలుకుపోదా మనుకొన్నా
వీడు ఒక్క అడుగైనా ముందుకు కదలడు!'

అంటూ సమాజం, రాజ్యం, రాజ్యాంగం, చట్టం అన్ని సహృదయతతో దళితుడి పురోగతిని కాంక్షిస్తే తప్ప హరిజన ప్రగతి సాధ్యం కాదు.

**ముగింపు**

ఈ కవితలో పరమ దారిద్ర స్థితిలో ఉన్న హరిజనుడు అతని హేయమైన రూపం, అతనిలోని నిర్మల విధానం చెప్తూనే, బోయి భీమన్న, ఆ హరిజనుడికి సమాజ సహకారం లేదని, రాజ్యాంగాదులు ఇస్తున్న అవకాశాలు అందటం లేదని చాటుతూ సమాజాన్ని చైతన్యపరిచే ప్రయత్నం చేశాడు.



May 2010 pages.pmd 22 4/27/2003, 8:39 PM

మినీ కథ

# "జిందాబాద్..... జిందాబాద్"

## డా॥ కె.జి. వేణు



సింహాద్రికి నీరసం రెట్టింపై పోయింది... ప్రొద్దుట్నుంచి సముద్రంలో వల విసిరి... ఎంతసేపు కాచుక్కూర్చున్నా... ఒక్క చేప కూడా పడలేదు... మీద కాస్తున్న ఎండకూడా తన ప్రతాపాన్ని తగ్గించుకొని పడమటి వైపుకు వాలిపోసాగింది... చివరికి విసుగొచ్చి, తనని తానే తిట్టుకొంటూ ఇంటికి వెళ్లిపోదామనుకొన్న సమయంలో వలలో చేప పడింది... ఎగిరి గెంతేసి గబ, గబ ఇంటికొచ్చాడు.

చేప... ఇంకా బ్రతికే వుంది... అటూ... ఇటూ.. తోక ఆడిస్తూ... కదులుతోంది. పాకముందు ముసుగుతన్ని పడుకొని ఉన్న భార్య కొమరమ్మను ఉషారుగా తట్టిలేపాడు.

"ఇదిగో... సూసినావా! ఎట్టాంటి సేప యీ ఏళ యీ వలలో పడినాదో.. సూడు.. దీన్ని కోసి కూర వండేయ్.. కూర గుమ, గుమ లాడిపోవాలా!.. యిదిగో యింటున్నావా.. యీ ఏళ నాకు సానా ఆకలిగుంది... అన్నం కాత్త ఎక్కువ వండేయ్.." అంటూ చేపను భార్య చేతిలో పెట్టాడు.

భద్రకాళిలా మారిపోయింది కొమరమ్మ.. చేతిలోని చేపను భర్త ముఖం మీదికి విసిరేసి... రెండు చేతుల్ని నడుం మీద బిగించి... కళ్లల్లో నిప్పులు చెరుగుతూ..." ఏడేటి అన్నం కాత్త ఎక్కువండాలా! బియ్యం ధర ఎట్టా మండిపోతావుందో నీకు తెలవదా.... పిడికెడు బియ్యం కొనాలన్నా మన బతుకులు సాలటం లేదు. ఇక సేపను వండాలంటే నూనెగావాల, పసుపు... కారం.. ఉప్పు.. ఉల్లిపాయ... ఎల్లుల్లి... మసాలా.. గావాల ఆటిలో ఏ ఒక్కొటి గాని మన కొంపలో ఉందా.. నేదే .. ఎందుకు నేదు.. గవర్నమెంటోళ్ల పుణ్యమా! అని ఆటి ధరలు ఎపుడో ఆకాసానికెళ్లిపోనాయి.. మరెపుడూ యినాంటి కోరికలు కోరమాకు" అంటూ రుస, రుస లాడి వెళ్లిపోయింది.

సింహాద్రికి ఇంతకోపం ఎపుడూ రాలేదు.. ఎదురుగా ఉన్న ఖాళీ గిన్నెను కాలితో బలంగా తన్ని... ఇంకా ప్రాణంతో కదులుతున్న చేపను పట్టుకొని గబ, గబ సముద్రం దగ్గరికి వెళ్లి చేతిలోని చేపను గిర, గిర త్రిప్పి.. సముద్రంలోకి విసిరేశాడు.

చావునుండి తప్పించుకొన్న చేప నీటిలో హాయిగా ఈతకొడుతూ కృతజ్ఞతా పూర్వకంగా "ధరలు... జిందాబాద్.. ధరలు జిందాబాద్" అంటూ నినాదాలు చేసింది. చుట్టూ చేరిన చేపలన్ని "ప్రభుత్వమూ జిందాబాద్.. ప్రభుత్వమూ జిందాబాద్" అంటూ కోరస్ పలికాయి.

---

# హెచ్చరిక

## పిట్ట సాంబయ్య

గుడ్డును పొడుచుకొచ్చిన పిల్లలా,
భూమి తోలు ఒలుచుకొనే
మట్టి మొగ్గలుగా వికసిస్తున్న వాన్ని
గోటిలో ఇరుక్కున మట్టి
బువ్వతో కలిస్తేనే బుక్క దిగని
మన్నును జీర్ణించుకున్న
గట్టి మట్టి బంధం వున్నవాన్ని
గొఱ్ఱుతో పొర్లాడుతూ
మట్టిని కరిగించి
తలార బురద స్నానం చేస్తున్నవాన్ని
బాధను గుండెల్లో దాచుకుని
నా శ్రమ చెమట చుక్కలుగా
వేదన కన్నీటి బొట్లుగా
నెర్రెల్లో నింపుతున్న వాన్ని
స్వేదంతో కలగలిసిన మన్ను
పెయ్యంత పులుముకొని
గాలినై, మట్టి పరిమళాన్ని
లోకం నలుదిక్కుల వీస్తున్నవాన్ని
తన బాధంతా నాదై నా బాధంతా తనదై
రేయింబవళ్ళు మట్టితోనే
మాట్లాడుతూ పోట్లాడుతూ
నోరు తెరిస్తే మట్టి పాటే మట్టి తోనే ఆట
మట్టి కలలు కంటు కలవరిస్తున్నవాన్ని
మట్టే ధ్యాసగా, శ్వాసగా
ధ్యానిస్తున్న వాన్ని
నేనూ – మట్టి మనిషినీ
నా తల్లి నుండి
ఈ బిడ్డ బొడ్డు తాడు బంధాన్ని
సెజ్‌ల ఉరి ఫెన్సింగ్‌తో
తెంపాలనుకుంటున్నారా ?
జాగ్రత్త..... జాగ్రత్త సుమా!
మట్టి గొట్టుక పోతరు

---

# స్త్రీ

## మామిండ్ల రమేష్ రాజా

నేనిప్పుడు
సరుకయ్యాను
క్షణానికి...
క్షణానికి మధ్య
నలిగిపోతున్నాను
అమ్మ... బడుతున్నాను
తనువెప్పుడూ
రాచపుండులా
ఉంటుంది
నా అడ్రస్సు
గుడి నుంచి
చౌరస్తాకు మారింది.



May 2010 pages.pmd 23 4/27/2003, 8:39 PM

కథ

# కాల్వ కిందకి

## బండారు శంకర్



***తె**ల్లారుగట్ల నాలుగ్గొట్టింది చెమ్మెదు నీళ్ళు మోకాన కొట్టినట్టు లేసి కూసుండు ఇస్తారి.*

*తువ్వాల బుజానేసుకొని పంచ సరిసేసుకుండు అలికిడికి లేసిన భార్య పిచ్చమ్మకు "అంతా సదురు నేను అందరిని లేపుకొస్తా" అని గన్వ దాటిండు ఇస్తారి.*

ఇస్తారి ఏటా 30 మందిని తీసుకొని మిర్యాలగూడెం కోతలకు పోతడు. ఈ కారు 20 మందే అయింద్రు. 'ఆసాములు ఎంత గోల చేస్తరో ఏందో?' అనుకుంటా దండుబాట దాటిండు. కుక్కలు గయ్యిమని ఏగబడ్డయ్యి. కర్రూపి గద్దాయించిండు. "ఈదయ్య బావో.... ఓ ఈదయ్య బావ" అని తలుపుకున్న గొల్లెం సప్పుడు సేసిండు. మగత నిద్రలో వున్న ఈదయ్య "ఆ ఎందోయ్ ఇస్తారి దా!" అండు. ఈదయ్య "లజ్జగాదయ్య గిప్పడిదాకా పంతావ్" అండు పరిగాశంగా తలుపు బయట వుండి. ఇంతలా ఈదయ్య భార్య అంకమ్మ లేచి తలుపు తీసి "రా తమ్మి కూచుందువుగాని" అంది. "ఏడక్క కూచుంటట్టు వున్నాది" అండు ఇస్తారి. "రాతరనే అన్ని సర్దిపెట్టినా" అని మూటలు చూపెట్టింది అంకమ్మ. "సరేగాని అక్కా నేను అందరిని లేపుకొస్తగాని మీరు సామానంతా తీసుకొని దండుబాట ఎక్కురి బొంతుగుట్టల్లకు పోవాలనామో ఏయాల్ల అయిద్దో ఏందో" అనుకుంట దబ్బదబ్బ పోయిండు ఇస్తారి,

లేచి కూచున్న ఈదయ్య దేవులాటల పడ్డడు ఆయన చింతా అంతా చిన్న పోరగాని సదువు మీదనే. పెద్దోనంటే హాస్టల్ల ఏసిండు గాని ఇప్పుడాడు పదిల పడ్డడు. చిన్నోని బడికి తోల్తామంటాలకే ఆడి పోరి పుట్టే. ఆపోరిని మెస్తందుకు ఈ పోరగాని సదువు బాయో. పాలుజీకే పిల్లని, పసిపోరగానేసుకొని కానరాని రాజ్యం పోవలసి వస్తుండే అని మతిల అనుకండు ఈదయ్య. "ఏందయ్యా ఏమో సింత సేస్తున్నవు" అంది భార్య అంకమ్మ "ఏంలేదే శీను గాన్ని సదువు గురుంచే ఆలోసిస్తున్నా పెద్దోన్ని సదివించి చిన్నోన్ని బందుపెడితిమి అండు" ఈదయ్య,

"నేను అప్పుడే సెప్పిన, వొద్దయ్యా ఆ మేస్త్రీ ఇస్తారి కాడ అప్పుదేకయ్యా అంటే ఇన్నవా కాల్వ కిందికి కోతలకు వస్తని అప్పుతెస్తివి ఇప్పుడది మిత్తికి మిత్తి మోపెడాయె. ఊల్లెనే ఉప్పిడో ఉపాసమో వుందాం అంటే నేను కోస్త నాపెండ్లం కోస్తదని ఉరుకుల పెడితివి పోరగాండ్ల గురించి ఆలోచించవయితవి. సంసారమల్ల పెడుతున్న అని అప్పుడింత ఇప్పుడింత తెస్తివి. రాసికి రావాయో రంగానికి రావాయో తాగి తందనాలడితివి. ఒక్క పైసా రెండు పైసలా ఎయ్యి రూపాయలు అప్పయింది. ఎకిఎకినా అప్పు తీరుద్దామంటే పైస లేదాయో. పసిపోరగాళ్ళ నేసుకొని పచ్చులోలిగే పోక తప్పుత లేదాయె" అని గుడ్లకు నీళ్ళు తీసుకుంది అంకమ్మ.

"ఎట్టయితే అట్టయ్యింది గాని ఈ ఒక్క కారు పోదాం పావె" అండు ఈదయ్య. "ఇగ అంతకన్న చేసేదేముంది పోరగాళ్ళ బతుకు ఏం సేస్తవో" అని కండ్ల నీళ్ళు తూడ్చుకుంది అంకమ్మ.

"ఓ కొడుకా ఎంకన్నా లెయ్యా లేరా" అని లేపింది తల్లి. లేసికుచుండు. ఎంకన్న ఇంటికి పెద్ద కొడుకు. ఎంకన్న మా అంటే పదిహేడేండ్లుంటడు. పది సదువుతుండు. సిన్నోడు సీనయ్య పదోయోట వుంటడు. ఒట్టి దద్దమ్మ. సిన్నపిల్ల సరిత ఐదేండ్లుంటది. ఎంకన్న మోకాన నీళ్ళు సల్లుకొండు. రాత్తేర అయ్య చెప్పిన మాటలు ఏది కొచ్చినై. అమ్మను, అయ్యను మిర్యాల గూడెం పంపి హాస్టళ్ళకు పొయ్యి బువ్వ తిని బడికి పోవాలె. సామానంత దండువాట మీదికి మెస్కపోవాలే. సందుకని "పట్టు కొడుక"ని నెత్తిమీద పెట్టిండు. రెండు భుజాలకు రెండు బస్త సంచులు తలిగించిండు. బువ్వ సర్వలు, పక్క బట్టలు నెత్తినేసుకుండు ఈదయ్య. అంకమ్మ పిల్లని సంకనేసుకొని పిలగాన్ని చేత పట్టుకొని తలుపుకు గొల్లెం పెట్టి మామిడికాయ తాళం వేసింది.

అప్పుడే లేసి ఆకిలూకుతున్న పక్కింటి గౌరమ్మకు అక్కా ఇల్లు బద్రం అని సెప్పింది.

"ఈ బజారు నున్న రెండు కొంపలు మీరు, మేమొక్కలమే చెల్లా బద్రంగా పోయిరారి" అని బాధ పడింది గౌరమ్మ.

బాట పట్టింద్రు. దండువాట మీదికి ఆమడదూరం వుంటది. సూదరోల్ల బజారుంగా పోవాలె. తెల తెలవారుతుంది. అందరు లేచి ఆకిండ్లు ఊకుతుంద్రు. నడిచినడిచి సూదరోల్ల బజారుకు సేరింద్రు. ముందల పోతున్న మొగన్ని పిలిచి " పిలగానికి సందుక బరువౌతున్నట్టుంది సూడరాదు" అని కసిరించినట్టు అంది అంకమ్మ. కొడుక్కు బరువైతుంది అని సందుకనెత్తుకుండు ఈదయ్య.

రాఘవరెడ్డి ఇంటిముందల అరుగుల మీద రాఘవరెడ్డి కొడుకు



May 2010 pages.pmd 24 4/27/2003, 8:39 PM

శ్రీనివాసరెడ్డి ఏప పుల్లేసుకొని పండ్లు తోముతుండు. ఆయన పక్కన ఎవలో దోస్తున్నాడు.

శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో ఎమ్.ఎ సదువుకుంటడు. సెలవలల్లా ఒచ్చినట్టుంది. ఈదయ్యోల్లు ఆడంగా మూట ముల్లే నెత్తినేసుకుని పోతుంటే రాఘవరెడ్డి కొడుకు శ్రీనివాసరెడ్డి "మనదేశంలో ఈ వలస బతుకులున్నంత కాలం దేశ అభివృద్ధి మాటలకే పరిమితం అవుతుంది అన్నడు. పక్కనున్న దోస్తు మనదేశ రాజకీయ వ్యవస్థ వున్నోని కానించి లేనోని దాకా అందరికి ఓటు హక్కును కల్పిస్తుంది. ఓటు లేక పోవడం వుండి వేయకపోవడం దేశద్రోహం అని ప్రగల్బాలు పలుకుతుంది. కాని ఓటు వేసిన పేదోనికి మాత్రం పని కల్పించదు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఏ దేశంలో లేదు" అన్నడు



వాళ్ళను దాటుకొని దండు బాట మీద కొచ్చి మూటలు దింపిండ్రు. ఎంకన్న భుజాలు గుంజుక పోయినయి. ఇంతలా జనానంత దండుబాట ఎక్కించిండు ఇస్తారి. మూటలు, ముల్లెలు, సందుకలు, దండువాట కాడి దేవుని రాములు ఆకలి అంతా నిన్నెది "అందరొచ్చినరయ్యా, తీరా లారీ ఆపినంకా ఓకాయిన సెంబట్క, ఓకామో వుచ్చుకు పోయింద్రు అంటే కుదరదు" అని అందరికి ఇనపడేటట్టు అన్నడు ఇస్తారి.

ఆ... ఇగ లారీ ఆపనే ఆపిండు. పదిగిల్లలా సిమెంటు లారీ "మిర్యాలగూడెం పోతదయా" అని అరచినట్టే అన్నడు ఇస్తారి క్లీనరుతోని. "ఆ పోతది" అన్నడు క్లీనరు. "ఎంతియమంటవు మనిషికి" "పదిహేను" అండు క్లీనరు. "పదిహేను లేవు ఏములేవు గాని పదికాడికి సేసేకో" అన్నడు ఇస్తారి. "అట్టకాదుగాని పన్నెండు సీసుకో" అన్నడు క్లీనర్. "సరే కానియ్యి పొద్దుపోతుంది బండి పక్కకు తీయ్యి" అండు ఇస్తారి. ప్రక్కకు ఆగింది. లారి ఎనక డోరు తీసిండు క్లీనరు. "అందరైనరమా" అని పిలిచినట్టు కూతేసిండు ఇస్తారి. డోరు పక్కేమ్మటి మేట్టోలిగా వున్నదాని మీద కాలు పెట్టి ఒక్కొక్కలు గొలుసు చేత పట్టుకొని ఎక్కుతుంద్రు. "కొడుకా ఎంకన్న మంచిగ సందువుకో కొడుకా! పదిల పాసైతే ఉద్యోగమో సద్యోగమో దొరుకుతది. ముందల ముందల నువ్వే మమ్ముల సాదాల్చి వస్తది" అని గుడ్లకు నీళ్ళు తెచ్చుకుంది అంకమ్మ. "కొడుకా ఎంకన్న బద్రం శ్రద్ధ పెట్టి సదువుకో, సబ్బుల బిల్లు ఖర్చు పెట్టుకోకు, దాసుకో భద్రం" అండు ఈదయ్య. సందుకలు, మూటలు, అన్ని లారిల ఏసింద్రు. "అంతా ఎక్కినారయా" కూతేసిండు ఇస్తారి. "ఏంచుకోరాదు" అండులారిలో ఓకాయన. "1,2,3.. " అని ఏంచిండు. "రైట్ రైట్ ఇగ పోనియవయా" అనంగానే క్లీనరొచ్చి డోరేసిండు. లారి కదిలింది. ఇరవై మంది సేతులు ఒక్కసారి లేసినై. లారి కనబడకుండా పోయినదాక వూగుతనే వున్నై.

ఎంకన్నకు దిక్కుతోసకుంట అయ్యింది. కుటుంబాన్ని ఇడిచి వున్నోడు కాదాయ. కాని తప్పదు అని హస్టల్ బాట పట్టెండు బువ్వ పెట్టె టైయమైంది జరసేపయితే బడి కూడ పెడతరు.

ఇయ్యాల ఇస్తారి గుంపు. రేపు ఇంకొకల గుంపు. ఊరు సగంబడ కాలి అయితది. ఊరు పడవ బడుతది అని దండుబాట కాడ దేవున రాములు ఇంటిముందల కూచున్న ముసలోళ్ళ బాధ.

పొద్దు అటు ఇటు నెత్తిమీది కొచ్చింది. మిర్యాలగూడాన దిగింద్రు గుంపంత. బొంతుగుట్టల్లకు పోవాలంటే ఇంకొక లారీని మాట్లాడిండు ఇస్తారి. మధ్యాన్నఏల్లకు బొంతుగుట్టల దిగింద్రు. పెద్దాసామి కొట్టమల్ల వుండేది. ఏవల పెట్టెలు ఆల్లు సర్ధుకున్నరు. రేపటి నుంచి కోతలకు పోవాలే.

అయెపాయె. కోతలయిపాయే. జతకు రెండు పట్లు పడ్డయ్యి. పగలు రాత్రి పురుగు బూచి అనక కష్టాలు పడితే ఒచ్చిన ఒడ్లు ప్రతి గింజ మీద పూర్తి హక్కు వాళ్ళకే వుంది.

లారీ మాట్లాడుకొచ్చిండు ఇస్తారి. ఈదయ్య కాలు కింద దుమ్ము లేసిపోతుంది. ఇద్దరు పోరగాండ్లయితే కండ్ల ముందర వున్నరు గాని ఇంటికాడ వున్నోడు ఎట్ల వుండో దబ్బున పోవాలె అన్నట్టేవుంది. అంకమ్మయితే మొకాన జీవి లేకుంటయ్యింది. పోరగాని మీద దేవులాట ఒకటైతే, రెండు మూడు సార్లు జ్వరం వచ్చింది. నలిసిన మనిషోలిగే అయ్యింది. పాలు తాగే పిల్ల గూడ నక్కనక్క అయ్యింది. లారీ రానే వచ్చింది. దమ్మ దమ్మ బడ్ల బస్తాలు లారీలకు ఎక్కించింద్రు. మూటలు, మల్లేలు, సందుకులు బస్తాల మీద పెట్టింద్రు. ఒకల తర్వాతొకరు ఎక్కుతుంద్రు. ఈదయ్య ఎక్కిండు. పోరగాళ్ళను తీసుకుండు. అంకమ్మ ఒక్కతే వుంది. ఎక్కబోయి చేతులు జారి అట్నే ఎల్లేలకల పడ్డది. జ్వరం ఒచ్చిన పానమాయె. చేతులల్లా బలం లేదు. పడ్డది పడ్డట్టే వుంది. కదుల్తలేదు మెదుల్తలేదు. ఈదయ్య దిగి సూస్తారికే సప్పుడు లేదు. సరిలేదు. ఏమమ్మా... ఏమమ్మా... అని కదిలించుడు. పిలిచిండు. అయిన సప్పుడు లేదు. ఈదయ్యకు కడుపుల భయం సొరబడ్డది. ఇస్తారి దిగి సెమ్ముల నీల్లు తెచ్చి మొకాన సల్లిండు. అయిన సప్పుడు లేదు. ఈదయ్య కాళ్ళచేతులు పోయి కడుపల సొరబడ్డయ్యి. "ఏమమ్మా" అనుకుంటూ తలకాయ కింద చెయ్యేసి లేపిండు. తడి తగిలింది. లేపి సూస్తరికే నెత్తురు. బయం దుక్కం తన్నుకొస్తున్నాయి. భోరుమని ఏడ్చుకుంటా ఎదుర్రొమ్ము గుద్దుకొంటుండు ఈదయ్య. గుంపంతా ఉలిక్కిపడ్డది. నక్కగా రాయిమీద పడతాలికే పాణం పోయింది అంకమ్మది. పుట్టేడు దుక్కానికి ఏడ్చుకుంటూ పోరగాళ్ళనేసుకొని పీనిగనేసుకొని అదే లారిల ఇంటిబాట పట్టింద్రు. ఇయ్యాల అమ్మానాయన వస్తరని సంబూరంగా ఎదురు చూస్తుండు ఎంకన్న. దండువాట కాడ లారి ఆగింది. ఊళ్ళెవున్న వాళ్ళంత నవ్వుమొకాలు ఏసుకొని లారీకి ఎదురొచ్చింద్రు. లారీల వున్నోల మొకాన ఏడ్పు. పీనిగను దింపింద్రు. ఎంకన్నకు ఏడ్పొస్తుంది. వాళ్ళమ్మ పీనిగ మీద పడి ఏడుస్తుండు. ఏమైంది నాయనా అమ్మకు అని అడుగుతుండు. ఎదురొమ్మును గుద్దుకుంటా పుట్టెడు దుఃఖానికి ఏడుస్తుండు ఈదయ్య.

"నీకు, తమ్మునికి, చెల్లెకు పుట్టెడు కష్టాలను పెట్టిందిరా ఎంకనా" అని సీనిగాన్ని, సరితను, వెంకన్న సేతుల పెట్టి సోయి తప్పి పడిపోయిండు ఈదయ్య....!?



# ఐపిఎల్ అతిపెద్ద గోల్‌మాల్

***ఇది కేవలం మోడీ – థరూర్‌లకే పరిమితమైన, ఉచితానుచితాలు (ఇది చాలా మర్యాదకరమైన పదము) కు సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. అంతకన్నా చాలా పెద్దది. డబ్బు వ్యవహారం పక్కన పెడదాము. కొంతమంది ఫ్రాంచైజీలలకు వందల కోట్లలో నష్టాలు వచ్చాయి. ఈ నష్టాలున్నప్పటికీ, అసలు ఉనికిలో లేని రెండు జట్లకు కొత్తగా రూ. 3,000 కోట్ల ఫ్రాంఛైజీ కల్పించారు.***

## పి. సాయినాథ్

పేదలకు ఆహార సబ్సిడీలను దారుణంగా తగ్గించిన ప్రభుత్వం ఐపిఎల్‌కు మాత్రం రాయితీల వర్షం కురిపిస్తున్నది. ఫోర్బ్స్ జాబితా కెక్కిన నలుగురు శత కోటీశ్వరులతోపాటు కోట్లకు పడగలెత్తిన మరికొంతమందికి ఈ రాయితీలు దక్కుతున్నాయి. ఐపిఎల్‌లో కుమ్ములాటలు పెరిగి దాని వ్యవహారమంతా రచ్చకెక్కింది. బిడ్డింగ్‌ను ప్రభావితం చేయటానికి ప్రయత్నించిన వారిలో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రులు (ఒకరో ఇద్దరో గవర్నర్‌లు ఉన్నారేమో ఎవరికి ఎరుక) ఉన్నారు. ఈ వ్యవహారంతో పార్లమెంటు ఉభయసభలు దద్దరిల్లాయి. పన్ను వసూలు దారులు "సర్వేలు" ప్రారంభించారు. ఈ వ్యవహారాన్ని ఉచితానుచితాలు లేదా వ్యక్తిత్వానికి ముడిపెట్టి కుదించినందుకు ప్రసారమాధ్యమంలోనూ, రాజకీయాలలోనూ వున్న పలువురు సంతోషిస్తున్నారు. బిసిసిఐ–ఐపిఎల్ విషయంలో కాంగ్రెసు, బిజెపీలు రెండూ చాలా తేలికగా కలసిపోతాయి. డబ్బుకు మతం లేదు, ఉభయులూ సమర్థించదగినది. ఇంకా చెప్పాలంటే ముగ్గురికీ సమ్మతమైనది. ఎన్‌సీపీ సేవలను ఎవరు మాత్రం మరచిపోగలరు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రసార మాధ్యమం కూడా దోబూచులాడుతున్నది. దీనిని మోడీ – థరూర్‌ల వివాదంగానే పరిమితం చేసి చూపిస్తున్నది తప్ప అంతకుమించి దాటి వెళ్ళడం లేదు.

పదేళ్ళ క్రితం క్రికెట్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణం పెద్ద అలజడినే రేపింది. దీనికి కూడా పెద్ద పెద్ద పట్టణాలే స్థావరాలుగా ఉన్నాయి. దీనిలో ఇండియన్ బుకీలు, వ్యాపారులూ దిగబడి ఉన్నారు. క్రమేణా ఈ ఆట వ్యాపారంగా తయారై బ్రహ్మాండమైన ఆకర్షణను సంతరించుకున్నది. పెద్ద యెత్తున వాణిజ్య ప్రకటనలు విడుదలయ్యాయి. కార్పొరేట్ వ్యక్తులు ప్రవేశించారు. లావాదేవీల్లో వివాదాలు కూడా తలెత్తాయి. బడా వ్యాపారులు, రాజకీయ నాయకుల పరస్పర ఆలింగనాలకు ఈ ఆట వేదికగా మారింది. ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యలకు కాస్త సమయాన్ని కూడా కేటాయించలేనివారు బిసిసిఐ – ఐపిఎల్‌కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఇందుకు సంబంధించి కొన్ని కీలకమైన ప్రశ్నలు ప్రసారమాధ్యమంలో లేవనెత్తారు.

చీకటి లావాదేవీల గురించీ, లంచాల గురించీ, 'నీతో ఎలా వ్యవహరించాలో నాకు బాగా తెలుసన్న' బెదిరింపుల గురించీ ప్రస్తుతం చర్చ జరుగుతున్నది. అలానే తెరచాటు మదుపరుల గురించీ, భ్రష్టాచార వ్యవహారాల గురించీ, పెద్ద యెత్తున పన్ను ఎగవేతల గురించీ చర్చ జరుగుతున్నది. ఐపిఎల్ బిడ్డింగ్ నుంచి తప్పుకుంటే 5 కోట్ల డాలర్లు ముడుపులు ముట్టజెపుతామని అవతలివారు ప్రతిపాదించినట్లు ఫ్రాంచైజీలే చెపుతున్నారు. రంగం నుంచి మర్యాదగా తప్పుకోవాలని, లేకుంటే పర్యవసానాలు తీవ్రంగా వుంటాయని కేంద్రమంత్రి ఒకరు హెచ్చరించారని కూడా చెప్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే ఇది కేవలం మోడీ – థరూర్‌లకే పరిమితమైన, ఉచితానుచితాలు (ఇది చాలా మర్యాదకరమైన పదము) కు సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. అంతకన్నా చాలా పెద్దది. డబ్బు వ్యవహారం పక్కన పెడదాము. కొంతమంది ఫ్రాంచైజీలలకు వందల కోట్లలో నష్టాలు వచ్చాయి. ఈ నష్టాలున్నప్పటికీ, అసలు ఉనికిలో లేని రెండు జట్లకు కొత్తగా రూ. 3,000 కోట్ల ఫ్రాంఛైజీ కల్పించారు.




ప్రపంచ సంపన్నులలో కొంతమందికి ప్రభుత్వ సబ్సిడీలు లభిస్తున్నాయి. బిసిసిఐ–ఐపిఎల్‌కు ప్రతియేటా అనేక విధాలుగా ప్రభుత్వ వ్యయం కోట్లలో ఉంటుంది. ఒక్క మహారాష్ట్రలోనే ఐపిఎల్‌కు వినోదపు



May 2010 pages.pmd 26 4/27/2003, 8:39 PM

పన్నును 10-12 కోట్ల రూపాయల మేర రద్దు చేయటంపై శాసనసభలో చర్చ జరిగింది. ప్రసారమాధ్యమంలో దీని గురించి చర్చ మొక్కుబడిగా మాత్రమే జరిగింది. ఇతర విధాలుగా కూడా మహారాష్ట్ర ప్రభుత్వం ఐపిఎల్‌కు సహాయం చేసింది. అయితే ఆ మొత్తం ఎంతో తెలియలేదు.




రానున్న ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రుణభారం రెండు లక్షల కోట్లు దాటనున్న తరుణంలో వీరికి ఈ రాయితీలు ఇచ్చింది. ఇతర రాష్ట్రాలలో కూడా బిసిసిఐ-ఐపిఎల్‌కు ఇలాంటి రాయితీలు, మినహాయింపులే లభించాయి. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం నుంచి లభించిన రాయితీలను, మినహాయింపులను మనం చర్చించలేము. అందుకు సంబంధించిన పూర్తి చిత్రం మన దగ్గరలేదు. ఈ భూమండలంపై గల అతి సంపన్నులలో నాల్గవ స్థానాన్ని ఆక్రమించిన వ్యక్తి నాయకత్వంలోని జట్టుకు ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఎందుకు స్పాన్సర్‌గా ఉండవలసి వచ్చింది? అత్యంత విలువైన భూములకూ, స్టేడియాలకూ నామమాత్రపు అద్దెను మాత్రమే వసూలు చేశారు. ఇలా పోయిన మొత్తం ఎంతో కూడా మనకు పూర్తిగా తెలియటం లేదు. వందల కోట్లలో ఉండవచ్చు.

పేదలకిస్తున్న సబ్సిడీలలో కోత విధిస్తున్న తరుణంలో క్రికెట్‌కు వందలకోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఎలా వెచ్చించిందో మనకు తెలుసు. అయితే ఇది మన దారి కాదు. ఐపిఎల్‌పై సాగుతున్న దర్యాప్తు పరిధిలోకి బిసిసిఐని కూడా తీసుకురావాలి. వీటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి మినహాయింపులు లభించాయి. ఎంత మొత్తంలో లభించాయన్న విషయాన్ని వెలికి తీయాలి. ఐపిఎల్ ద్వారా లబ్ది పొందుతున్న వారెవరు? ఇతరులతో పాటు 2010 లో ఫోర్బ్స్ పత్రిక ప్రచురించిన శత కోటీశ్వరుల జాబితాలోకి ఎక్కిన నలుగురు ఉన్నారు. వీరిలో ముగ్గురు టీమ్ యాజమానులు కాగా మిగిలిన ఒకరు టైటిల్‌ను స్పాన్సర్ చేసినవారు. వీరు డాల్లర లెక్క ప్రకారమే శతకోటీశ్వరులు. చాలా కాలంగా ఫోర్బ్స్ జాబితాలో ఉంటున్నారు. కోటీశ్వరులైన బాలీవుడ్ తారలు కూడా ఉన్నారు. ఈ మహానుభావులందరికీ ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నది. ఒకవైపున అన్నార్తుల సంఖ్య పెరుగుతుంటే ఆహార సబ్సిడీలను తగ్గించిన ప్రభుత్వం అదే సమయంలో ఈ శత కోటీశ్వరులకు రాయితీలను  ఇచ్చింది. చివరకు ఐపిఎల్ అంటే ఇండియన్ పైసా లీగ్ ఇంకా సూటిగా చెప్పాలంటే ఇండియా పైసా లూటీ అని పిలివాల్సి వస్తుంది.

వాణిజ్య ప్రకటనల కోసం బిసిసిఐ, ఐపిఎల్‌లు పెద్దమొత్తాలే ఖర్చు చేశాయి. ప్రసారమాధ్యమం దీని గురించి చాలావరకు మౌనం వహించింది. కోచి ఫ్రాంచైజీ వివాదం తరువాత తీవ్రమైన విమర్శ క్రీడల మంత్రి ఎ.ఎస్.గిల్ నుంచే వచ్చింది తప్ప ఐపిఎల్‌ను కవర్ చేస్తున్న మీడియా నుంచి రాలేదు. ఐపిఎల్‌కు పన్నుల రాయితీలు, సెక్యూరిటీ సబ్సిడీలు కల్పించడాన్ని ఆయన తప్పు బట్టారు. ఈ మ్యాచ్‌ల సందర్భంగా పట్టణ వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆ టీవి చర్చలో నలుగురు మంత్రులు పాల్గొనగా అందులో గిల్ ఒక్కరే ఈ విలువైన అంశాలను లేవనెత్తారు. గిల్ క్రికెట్‌కు పాతకాలపు అభిమాని. ఈ క్రీడ గురించి ఆయన నిజంగానే కలవరపడ్డాడు. కుంభకోణాలతో ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తి ఆయన. పిఎల్ వల్ల క్రీడలకు ఒనగూరిందేమీ లేదు. బిసిసిఐ-ఐపిఎల్‌లలోని ఉన్నత స్థాయిలో వున్నవారి ప్రయోజనాల మధ్య ప్రమాదకరమైన ఘర్షణ ఉన్నట్లు క్రీడల మంత్రి ఎన్నడో హెచ్చరించాడు. కరణ్ థాపర్ నిర్వహించిన ఆ చర్చలో పాల్గొంటూ పన్ను రాయితీ ఆమోదయోగ్యం కాదని గిల్ స్పష్టంగా చెప్పాడు. "ఇది పేద దేశం. ఈ విషయాన్ని నేనెప్పుడూ మరచిపోను. ఈ ఏడాది బడ్జెట్‌లో కూడా లోటు ఉన్నది... చట్టబద్ధమైన పన్నును వసూలు చేయవచ్చుని, ఈ మొత్తాన్ని ఇతర క్రీడల అభివృద్ధికి వినియోగించవచ్చుని" ఆయన అన్నారు. అయితే అలా జరగటం లేదు. జనం నుంచి రాబట్టిన సొమ్మును మనం శత కోటీశ్వరులకు అప్పజెబుతున్నాం. ఐపిఎల్ ఏర్పాటు చేసే అతిథి గదులు అగ్ని ప్రమాదానికి అనువైనవంటూ అగ్నిమాపకదళం అధికారులు అభ్యంతరం చెపుతున్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదు. వీటిలో ఒక్కొక్క సీటు రూ. 40,000 లు. ఇక్కడ కూర్చున్న వారికి ఐపిఎల్ ఆటగాళ్ళతో అర్ధరాత్రి విందులు ఉంటాయి. ఇంకా ఇతరమైన ప్రయోజనాలు కూడా ఉంటాయి. అర్ధరాత్రి దాకా విందులు, వినోదాలలో మునిగితేలే క్రికెటర్లు మరుసటి రోజు  మ్యాచ్‌లో తన సామర్థ్యాన్ని ఎలా ప్రదర్శించగలడు.

ఇటీవల ఎర్త్ అవర్‌ను పురస్కరించుకుని ముంబైకి చెందిన శిష్టులు గంటసేపు కరెంటును నిలిపివేసి కొంత ఇంధనాన్ని ఆదా చేశారు. ఐపిఎల్ ఆటలు గాని పగటిపూట ఆడేటట్లయితే చాలా విద్యుత్ ఆదా అవుతుంది. మరట్వాడా, విదర్భ ప్రాంతాలు 12 నుంచి 15 గంటల కరెంటు కోతతో విలవిలలాడుతున్నాయి. పరీక్షలు రాయాల్సిన పేద పిల్లలు సతమతమవుతుంటే ప్రైవేటు లాభాల కోసం ఐపిఎల్‌కు ఆపారమైన విద్యుత్‌ను వినియోగించటాన్ని చూస్తే అసహ్యం వేస్తున్నది. కాగితం మీదనే అయినప్పటికీ ఈ పేద పిల్లలకు విద్యా హక్కు ఉన్నదిగాని కరెంటు మాత్రం లేదు.

కార్పొరేట్ ప్రభువులూ, బాలీవుడ్ తారలూ క్రికెట్ జట్లకు యజమానులుగా ఉన్నారు. ఒక ఐపిఎల్ జట్టుకైతే ఏకంగా ఒక పత్రికాధిపతే యజమానిగా ఉన్నాడు. ఇతర దినపత్రికలకు చెందిన వారు కూడా భాగస్వాములుగా ఉన్నారు. ఒకప్పటి హీరోలు, క్రికెట్ ఆటగాళ్ళూ ఇప్పుడు పెట్టుబడులు కలిగి ఉన్నారు. ఒకప్పుడు పొగాకు, మద్యంలకు సంబంధించిన వాణిజ్య  ప్రకటనలకు దూరంగా ఉన్నందుకు గర్వించిన వారు ఈనాడు వాణిజ్య ప్రకటనలే ప్రధానమనుకుంటున్నారు. ఒకప్పుడు ప్రజల యాజమాన్యంలో నడిచిన క్రీడ ఇప్పుడు ప్రైవేటువారికి లాభాలు ఆర్జించి పెట్టే సాధనంగా మారింది. జాతి ఔన్నత్యాన్ని చాటాల్సిన క్రీడలు పూర్తిగా వ్యాపారమయమవుతున్నాయి.



May 2010 pages.pmd 27 4/27/2003, 8:39 PM

# కవిత్వంలో శ్రమ దోపిడీ చిత్రీకరణ

వి. ఉదయలక్ష్మి

***శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా 8 గంటల పనిదినాన్ని పోరాడి సాధించుకుంది కార్మికవర్గం. ఆధునిక కాలంలోనూ రూపాలు మార్చుకుని శ్రమదోపిడీ కొనసాగుతూనే ఉంది. మే డే స్ఫూర్తితో, శ్రామికులపై ప్రేమతో ఎప్పుడూ కవులు స్పందిస్తూనే ఉన్నారు. వారి ఉత్తేజకరమైన కవితా చరణాలు చైతన్యం రగిలిస్తూనే ఉంటాయి. గతంలో ప్రజాశక్తిలో ప్రచురించబడిన ఈ వ్యాసం మే డే సందర్భంగా....***

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే. కార్మికవర్గ పోరాట పటిమకు, సమరశీలతకు తార్కాణంగా నిలిచినరోజు. తమ జేబులు నింపుకునేందుకు రోజుకు 15,20 గంటలపాటు చాకిరి చేయిస్తున్న పెట్టుబడిదారుల దౌష్ట్యాన్ని కార్మికవర్గం ప్రశ్నించిన రోజు. ఎనిమిది గంటల పనిదినానికై కార్మికవర్గం సమ్మె పోరాటానికి దిగిన రోజు.

కార్మికవర్గ ఐక్యతను సహించలేని దోపిడీ వర్గం కాల్పులు జరిపించింది. కాల్పుల్లో అనేకమంది కార్మికులు నేలకొరిగారు. కార్మికవీరుల రక్తంతో తడిసి ఎర్రజెండా మింటికెగసింది. 1886 మేలో అమెరికాలోని చికాగో పట్టణాన జరిగిన సంఘటన ఇది. కార్మికవీరుల రక్తంతో ఎరుపెక్కిన ఆ జెండా ప్రపంచ పీడిత జాతి అంతర్జాతీయతకు సంకేతమైంది.

నాటి నుండి నేటి వరకు తమ మూల్గులుపీల్చే దోపిడి దారులపై ఎర్రజెండా నీడలో కష్టజీవులు అనేక విధాలుగా పోరాడుతూనే వున్నారు. ఈ పోరాటాలకు ఇతరేతర తరగతులతో పాటు కవులు కూడా బాసటగా వుంటున్నారు. వీరిలో కష్టజీవుల పోరాటాలకు అండగా నిలుస్తూ వారి కడగండ్లను ప్రతిబింబించే గీతాలతో స్ఫూర్తినిస్తున్న వారు కొందరైతే, కష్టజీవులతో ప్రత్యక్ష సంబంధాలు లేకపోయినా వారి జీవన విధానాన్ని, దోపిడీకి గురవుతున్న తీరును అవగతం చేసుకొని తద్విషయాలను కవిత్వీకరించిన వారు ఇంకొందరు.

గత శతాబ్దంలోనే ఇలాంటి కవులు కొందరు కార్మిక పోరాటాలకు తమ వంతు సహకారమిచ్చారు. 1871 లో పారిస్‌కమ్యూన్ స్థాపనకు కార్మికవర్గమే కారణమైనా మేధావులు, కవులు కూడా కరమందించారు. పారిస్ కమ్యూన్ పతనానంతరం లండన్‌లో తలదాచుకున్న యాజీవ్ పొట్టియార్ (ఈయన పేరును యాజినీ పాటిల్‌గా కూడా రాస్తున్నారు) నాడు రాసిన ఓ గీతం తరువాత కాలంలో అంతర్జాతీయ గీతంగా ఖ్యాతిగాంచింది. ఈ గీతాన్ని బాలాంత్రపు నళినీ కాంతారావు తెలుగులోకి అనువదించారు.

"ఆకలి మంటల మలమలలాడే
అనాథలందరూ లేవండోయ్
హింసాగతిని సహించలేక
ఈసడించినది యెల్ల ధర్మము
మంచి దినాలు రానున్నాయ్
మనకందరకు లేవండోయ్"

అని ప్రారంభమయ్యే ఈ గీతాన్ని ఆంధ్రప్రజానాట్యమండలి కళాకారులు నేటికీ అనేక సభల్లో పాడుతున్నారు. దోపిడీవర్గం, కష్టజీవుల శ్రమ ఫలితం చేజిక్కించుకుంటున్న వైనాన్ని కవి ఎత్తి చూపుతారు. ఈ రక్త పిపాసుల పీడ వదిలితే జగతి సమస్తం ఆనందిస్తుందంటారు.

కార్మికులు – కర్షకులు దోపిడీకి గురవుతున్న తీరుపై మహాకవి శ్రీశ్రీ పలు గీతాలు రాశారు. ఆయన రాసిన "ప్రతిజ్ఞ" కవితను ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేర్కొనవలసి వుంది.

గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ,
పరిప్లవిస్తూ,
ధనిక స్వామికి దాస్యం చేసే
యంత్ర భూతముల కోరలు తోమే
కార్మికవీరుల కన్నులనిండా
కణకణ మండే గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదు కట్టే షరాబు లేడోయ్"

అంటారాయన. శరీరం కష్టం స్ఫురింపచేసే సమస్త చిహ్నాలు



May 2010 pages.pmd 28 4/27/2003, 8:39 PM

తాను రచించే గీతాలకు భావం – భాగ్యమన్న ఈ కవి లోకంలో కష్టజీవులకు ఎదురవుతున్న అన్యాయాలు, ఆకలి, వేదన పరిష్కరించే దిశగా పాటలు రాస్తున్నానని చెబుతారు.

వస్తు సంపదను సృష్టించేది కార్మికవర్గం. లాభాలు గడించేది మాత్రం యజమాని ఒక్కడే ఇది అన్యాయమంటే "అనుభవించాలి మీ కర్మం" అంటూ కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తాడు యజమాని. ఈ భావాన్ని 'వాడు' అనే కవితలో ఇలా ప్రతిబింబింపజేస్తాడు శ్రీశ్రీ–

"అందరం కలిసి చేసిన ఈ
అందమైన వస్తు సముదాయం అంతా
ఎవడో ఒక్కడే వచ్చి
ఎత్తుకుపోతూ వుంటే చూచి
"అన్యాయం, అన్యాయం!" అని మేమంటే
"అనుభవించాలి మీ కర్మం" అంటాడు.

సామాజిక సంపదపై అందరికీ హక్కుంది. సంపదపై ఒక్కడు గుత్తాధికారం కలిగివుండటానికి వీల్లేదంటారు ఈ కవి.

ఇదియే సూత్రం ఒక్కడు మాత్రం
భూమిని గుత్తకు కొనరాదు – కడు
సోమరిపోతై మనరాదు
నేలా నీరు గాలీ వెలుగూ
కొందరి సొత్తని అనరాదు – అవి
అందరి హక్కై అలరారు.

శ్రీశ్రీ కవిత్వంలో ఇలాంటి భావాలు అనేకచోట్ల దర్శనమిస్తాయి. దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం జరపాలనే సందేశం అనేక గీతాల్లో వ్యక్తమవుతుంది.

"పోయేవి, తెగరాలిపోయేవి, తెగటారిపోయేవి మన దాస్య బంధాలే"

అన్న చరణం "ప్రపంచ కార్మికులారా! ఏకంకండు. పోయేదేమి లేదు సంకెళ్ళు తప్ప" అన్న కారల్ మార్క్స్ పిలుపును తలపింపజేస్తుంది.

శ్రమించే వారొకరు అనుభవించే వారు వేరొకరా?

ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తుంది జాతీయోద్యమ కవి గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన ఈ గీతం –

అన్యాయ కాలంబు దాపురించిందిపుడు
అందరము మేలుకోవాలండి
మాన్యాలు భోగాలు మనుజులందరి కబ్బు
మార్గాలు వెతకాలి రండి
ఏటి పొడుగున దున్ని యెరువేసి నీరెట్టి నూర్పి
పండించేది మనమంతా
గోటు చేయుచు బూతు కూతలను కూసి
కలకొట్టి కొనుపోవుటింకొకరంతా

సామాజిక సంపదను ప్రజలందరూ అనుభవించాలి తప్ప ఏ ఒక్క వర్గమో హస్తగతం చేసుకోవడం కూడదంటున్న గరిమెళ్ళ సోషలిస్టు భావాలు, కార్మిక–కర్షక ఉద్యమాల ప్రభావాలకు లోనయ్యారనిపిస్తుంది.

అధికార భూతములడుగు లంచములిచ్చి
పరిపరి విధముల పన్నులిచ్చి
మునసబు కరణాల ముడుపులన్నియునిచ్చి
కోసినూడ్చిన పరికూలికిచ్చి
కచ్చేరి బంట్రోతు గామల కీనామిచ్చి
పాలెళ్ళకు కొంత పంటనిచ్చి
యజమానులకు పంట నర్ధభాగమునిచ్చి
పైకమిచ్చిన వాని వడ్డికిచ్చి
గడ్డిమాత్రమే మిగిలించు కాపువాడు
స్వేదమున తాను పశువుల రక్షించుకొరకు
కటకటా యెట్టులున్నదో కాపులదశ
సుగుణధనులారా జనులారా చూడరయ్యా

చిలకమర్తి లక్ష్మీనరసింహం రచించిన పై కవిత దాదాపు వందేళ్ళ క్రితం రైతాంగం కష్టఫలం ఏ విధంగా దోపిడీ దార్ల హస్తగతమయ్యేదో స్పష్టం చేస్తున్నది. చెమటోడ్చి పండించిన గింజలే కరువైన రైతాంగ దుస్థితిని

"ఏటికేతం బెట్టి యెయిపుట్లు పండిస్తె
ఎన్నడూ మెతుకెరుగనన్నా
నేను గంజిలో మెతుకెరగనన్నా"

అంటూ జానపదులు పాడుకొనే గీతం కూడా ప్రతిబింబిస్తుంది.

సి. నారాయణరెడ్డి ఒక గీతంలో

అధికారం ఒక వర్గం ఆటబొమ్మ కాదు
ఐశ్వర్యం ఒక వర్గం అబ్బసొమ్ము కాదు
రెక్కలు విరిగిన పీడితులొక్కటై ఉప్పెనలా
లేస్తున్నారు
దోపిడి రుచులను మరిగిన దొరలను
తుడుచుకుపోతున్నారు

అనడంలో వర్గ దోపిడి సమసిపోవాలనే భావం ధ్వనించడంతో పాటు కష్టజీవులు పోరాటోన్ముఖం కావడం కూడా కనిపిస్తుంది.

"మా కండలు పిండిన నెత్తురు, మీ పెండ్లికి చిలికిన అత్తరు" అంటూ కరుణశ్రీ రచించిన గీతం ప్రజలను బాగా ఆకట్టుకున్నది.

మా నోట్లో ఆకటి భగ భగ
మీనోట్లో సిగార్సు భుగభుగ
మా కీ పడిపోయిన మేడలు
మీ కేడంతస్తుల గోడలు

సమాజంలో కొందరికి కట్ట గుడ్డే కరువైతే ఇంకొందరికి ఒంటినిండా బంగారం. కొందరు మండుటెండల్లో చెమటోడ్చి చాకిరి చేస్తుంటే ఇంకొందరు పండు వెన్నెల్లో ఆడుకొంటున్నారు. పేదవారి పూరిపాకలో కారుచీకటి కమ్ముకొంటే వున్నవాడి పాకీదొడ్లో పట్టపగలే లైట్లు వెలుగుతుంటాయి. ఇలా ధనిక–పేద వర్గాల జీవన విధానంలో తలెత్తిన వ్యత్యాసాన్ని అలతిపదాల్లో తనదైన శైలిలో రచించారు కరుణశ్రీ.

దేశం స్వాతంత్ర్యం సాధించి ఐదు దశాబ్దాలు గడిచినా భూస్వాముల పట్టు సమసి పోలేదు. పాలకవర్గం భూసంస్కరణల గురించి



May 2010 pages.pmd 29 4/27/2003, 8:39 PM

చట్టాలు చేసింది తప్ప ఆచరణలో కష్టజీవులకు భూములివ్వబూనుకోలేదు. పైగా బూర్జువా, భూస్వామ్యవర్గ ప్రయోజనాలను కాపాడేందుకే కంకణం కట్టుకున్నది. భూస్వామ్యవర్గం పద ఘట్టనల కింద శ్రామికులు నలిగిపోతున్న దుస్థితి నేటికీ పలు రాష్ట్రాల్లో వున్నది. దేశవ్యాపితంగా వెట్టిచాకిరీలో మగ్గిపోతున్న ప్రజలు ఇప్పటికీ లక్షలాదిమంది వున్నారు. తెలంగాణా ప్రాంతంలో శ్రామిక ప్రజలు ఒకప్పుడు వెట్టిచాకిరీలో ఎంతో మగ్గిపోయారు. నాడు తెలంగాణాలోని భూస్వామ్య కుటుంబాలకు ప్రతి హరిజన కుటుంబం నుండి ఒకరిని వెట్టిచాకిరి చేయించేందుకు పంపక తప్పేది కాదు.

రావుగారి ఇంటి ముందు రాత్రిపగలు కాపలారా
పుట్లకొలది వడ్లుదంచి పోటు తెల్లగెయ్యాలి
గుట్టల కొలదిగ వంటకు కట్టెలు పలగ్గొట్టాలి
అడవితిర్గ విస్తరాకు లెన్నైనా తేవాలి

అంటూ సుద్దాల హనుమంతు రాసిన గీతం నాటి తెలంగాణాలోని వెట్టి కార్మికుల దుస్థితి అర్థం చేసుకునేందుకు కొంతైనా ఉపకరిస్తుంది.

ఎంతచేసినా వెట్టిచాకిరీ పొట్టనిండేదేలా
పండిన గింజలు పన్నుకు పోతే పస్తులు మనకేరో
ఆరుగాలము కష్టబడిన మన మావురుమని యేడ్చి
పొలమేదిక్కో తెలియని దొరలూ గాదెలు నింపెడి
చేవలేని యీ బ్రతుకు పుట్టచలిచీమల చేసిన కూర్పు

అంటూ ఆరుద్ర 'త్వమేవాహమ్'లో బుర్రకథ వరసలో శ్రమజీవులు. భూస్వాముల దోపిడీకి గురవుతున్న తీరును కవిత్వీకరించారు.

వర్గదోపిడీకి, కష్టజీవుల వెతలకు అద్దంపట్టే అనేక గీతాలను నేడు ప్రజానాట్యమండలి కళాకారులు జనంలో పాడుతున్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించే ఈ గీతం జనాన్ని విశేషంగా ఆకట్టుకున్నది.

చెట్టూ పుట్టా చదునూచేసి
మెట్టా పల్లం చదరంచేసి
కొండకోన బారులు పేల్చి
వాగుల ఏరుల దారుల మార్చి
చెమటతో భూమిని తడిపిన వాడా
జాతికి జీవం పోసేవాడా
..........................
నీవంటో ప్రతి రక్తం బొట్టు
దోపిడీ దొంగల సంపద పెట్టు
కష్టజీవులంతా ఐతే జుట్టు
పరాన్నభుక్కుల ఆటలు కట్టు
చూపర ఐక్యత ఉడుంపట్టు
పనిదొంగల గుట్టుచెయ్యర రట్టు

ఈ నేలతో శ్రమజీవులకున్న బాంధవ్యం మరెవ్వరికీ వుండదు. తన శ్రమతో జగతిలో జిలుగులు నింపుతున్న, దోపిడీదార్లకు సంపద చేకూర్చిపెడుతున్న శ్రమజీవులను దండుగా కదలి దోపిడీవర్గం ఆటకట్టించమంటున్న ఈ గీత రచయిత దేవేంద్ర.

సమస్త వస్తు సంపద సృష్టించిన శ్రమ జీవికి వాటిపై అధికారం లేదు. ఈ అధర్మాన్ని అంతంచేసి సమధర్మమున్న సమాజం కోసం పోరాడమంటూ ప్రజాకవి వడ్లమూడి –

కష్టించే బలమున్నది
సృష్టించే శక్తున్నది
నీరెక్కల కదలికతో
ప్రతివస్తువు రూపుదాల్చె
నీ పూనిక లేనినాడు
నడువలేదు ఈ లోకం
అధర్మం అంతుతేల్చి
సమధర్మం స్థాపనకై
మోగించు నగారా
సాగించుము తుది సమరం

అంటారు.

శ్రీ నల్లి ధర్మారావు శ్రమజీవుల కష్టంతో దోపిడీ వర్గం ఆస్తులు పెంచుకొంటున్న వైనంపై ఇలా పాటగట్టారు.

"నిన్ను దోచిన దొరలందరు – విలాసాల బతుకుతూని
నీసెమట సెంటుజేసి – ఒళ్ళంతా పూసుకొని
కరిగిన నీ కట్టమంతా – రూపాయిల కట్టలుగా
సిందిన నీ నెత్తురంతా – సిందూరపు బొట్టులుగా
మార్చుకొని మేడలు గొట్టే కూలన్నా
మిగిలేను నీకు పిడికెడు మట్టే – కూలన్నా"

శ్రమజీవులపై సాగుతున్న దోపిడీని ప్రతిబింబిస్తూ ఇంక అనేకమంది కవులు తమవైన బాణీల్లో పలు గీతాలు రాశారు.

ఒక వర్గంపై మరో వర్గం సాగించే దోపిడీ అంతం కావడం, జాతి సంపద మొత్తం ప్రజల పరం కావడం కమ్యూనిస్టుల అభిమతం

నేలహక్కు ప్రజలదే
నీటిహక్కు ప్రజలదే
ప్రజల దోచు దోపిడీంద్ర
బ్రతుకు లెత్తిచూపరా
భారీ యంత్రాలన్నియున్
ప్రభుత్వపరము గావలెన్
పాలనాధికారముల్
ప్రజల వశముగావలెన్

అంటూ నార్ల చిరంజీవి రాసిన కవాతు పాట పైభావాలనే ప్రతిబింబిస్తుంది. వర్గ దోపిడీని చిత్రీకరించిని ఇలాంటి గీతాలు ఇంకా ఎన్నో వున్నాయి. పలు గీతాలు ప్రజల నాల్కలపై నర్తిస్తూనే వున్నాయి. సదా ఉత్తేజపరుస్తూనే వున్నాయి. సమాజంలో వర్గ దోపిడీ అంతమయ్యే వరకు ఇలాంటి గీతాలు సజీవమై అలరారుతాయి.

## నచ్చిన పుస్తకం

# నిర్దిష్ట స్థల కాలాల స్పృహ వున్న కథలు




వి. ప్రతిమ

**మ**తాతీతమైన మానవీయ సంబంధాలే ఆయన సిద్ధాంతాలు. ప్రతి మనిషినీ, ప్రతి సందర్భాన్ని ప్రజాస్వామిక దృష్టి కోణంతో చూడ్డమే ఆయన వాదం. ఆ సందర్భాలనీ, స్పందనలనీ బహుముఖీనంగా చిత్రించడమే ఆయన సాహిత్యం.

నాలుగు దశాబ్దాలుగా సాహితీసేవ చేస్తోన్న డా. మల్లెమాల వేణుగోపాల్ రెడ్డి గారి మూడో కథా సంపుటి "విరిసిన మల్లెలు". ఇందులోని పదహారు కథలూ కూడా యివ్వాల్టి సామాజిక సందర్భాలనీ, కుటుంబ జీవనాలనీ, వాటి మీద అనివార్యంగా ప్రసరింప బడుతోన్న సామ్రాజ్యవాద సంస్కృతినీ వివిధ కోణాల్లో నుండి చెప్పినవే...

నా చిన్నప్పుడు గణేష్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో గొడవలు రేగడం, అవి చాలా రోజులు కంటిన్యూ కావడం పేపర్లలో చూస్తుండేదాన్ని.. వినాయక చవితికి అంతంత ఉత్సవాలు చేస్తారని కూడా అప్పటి దాకా తెలీదు. ఆ తర్వాత వూరి ఊరికీ నాయకుడు వాడ వాడకీ వినాయకుడు.. ఇప్పుడయితే వీధికి ముగ్గురు వినాయకులు. వినాయక చవితి వస్తోందంటేనే ఈ వైపు నుండి ఒక మైకూ, ఆ పక్క నుండి మరో మైకూ వాయగొట్టేస్తాయని భయం... పోనీ అవన్నీ దేవుడి పూజా పాటలా అంటే అదేం కాదు.. పచ్చి శృంగారాన్ని నింపుకున్న కొత్త సినిమా పాటలు.. అదలా వుంచితే నిర్వ్యాపకంగా వుండే యువత చందాలు దండడం.. పండగ పేరుతో మందు తాగడం, పోయించడం.. ఉట్టి గొట్టడం, గొడవలు పడ్డం అంతా ఒక తంతులా సాగుతోందే తప్ప వినాయక పూజలా కాదు. ఈ అన్ని కోణాలనీ రచయిత చాల చక్కగా సున్నితంగా, సూక్ష్మంగా అర్థం చేయిస్తూనే మరో వైపు హిందూ, ముస్లిం మైత్రీ భావాన్ని చెప్పకనే చెప్తాడు. చివరికి ఈ నిమజ్జనంలో దొర్లిన అపశృతితో వూరి జనమంతా కల్లోల పడిపోతారు.

ఆయన అప్రమేయుడే.. ఎల్లమ్మ దేవత బాగానే వుంటుంది. వినాయకుడు బాగానే వుంటాడు. ఎటొచ్చీ వూరి ప్రజల మనసులు మాత్రం అల్లకల్లోలమై పోయాయి అంటూ ముగింపునిస్తాడు 'అప్రమేయుడు' అన్న కథలో...

అత్యంత సాధారణమైన శిల్పంలో చక్కటి భాష, పదబంధాలు అడుగడుగునా పాఠకుడ్ని ఆకట్టుకుని ఆశ్చర్యానికి గురిచేస్తాయి. కొడవటిగంటిగారన్నట్టుగా అత్యంత సాధారణమైన విషయాన్ని అసాధారణంగా చెప్పడం, అసాధారణమైన విషయాన్ని అత్యంత సాధారణంగా చెప్పగలగడం నిజంగా ఒక గొప్ప టెక్నిక్...

రాజకీయం అంటే బురదగుంట అని ఏవగించుకుంటూ అంతా ముక్కుమూసుకుని దూరంగా తొలగిపోవడం కాదు. ఎవరో ఒకరు ఎపుడో అపుడు పూనుకొని ఆ గుంటలోకి దిగి బాగు, చేసే పని మొదలుపెట్టాలి. ఎన్నికల్లో డబ్బిచ్చి, మందుపోసి ఓట్లు కొనుక్కునే కుసంస్కృతి ఎప్పట్నుండి మొదలయింది..? ఇక ఈ క్రమాన్నంతా శుద్ధి చేసి నిజాయితీగా, నిర్భయంగా ఓట్లు వేసి నాయకుడ్ని ఎన్నుకునే పరిస్థితి మళ్ళీ మనకు తిరిగొస్తుందా అని మనకు చాలాసార్లు అన్పిస్తూవుంటుంది. అనిపిస్తుందేగానీ అందుకోసం ఏం చేయాలో మనమెప్పుడూ ఆలోచించం.. సంకల్పించం.

ఎన్నికల సంస్కరణలు, పటిష్టమైన సమాచార హక్కు, మహిళా సాధికారత, అవినీతి నిర్మూలన, ప్రజలదే పాలన అని ప్రజాస్వామ్యానికో కొత్త భాష్యాన్నిస్తామంటూ ఒక తీరైన మేనిఫెస్టోలో ఎవరయినా ముందు కొచ్చినప్పటికీ డబ్బు అహంతో ప్రతిపక్షం వారిని తుంగలో తొక్కి పారేస్తుంది.

ఈ మొత్తం కుళ్ళిపోయిన రాజకీయ వ్యవస్థలో గట్టి సమాధానం ఈ సంపుటిలోని "క్రాస్‌రోడ్స్" ముందు నిలబడిన కూడలిలో నుండి మనల్ని దిశా నిర్దేశం చేస్తూ పాఠకుడిలో కొత్త ఆశను నింపుతుందీ కథ.



May 2010 pages.pmd 31 4/27/2003, 8:39 PM

"మలిన వస్త్రాన్ని అలా వదిలేస్తే యింకా మలినమవుతుంది. చీకటిని నిర్లక్ష్యం చేస్తే యింకా దట్టంగా అలుముకుంటుంది. బట్టల మురికి దానంతటదే తొలగిపోదు. చీకటి స్వయంగా సమసిపోదు. బట్టలను మనమే ఉతికి శుభ్రం చేసుకోవాలి. చీకటి స్థానంలో చిన్న వెలుగుని నింపాలి. అవినీతిని నిర్మూలించాలి, ప్రజలే ప్రభువులయి పరిపాలించాలి" అంటాడు రచయిత. మేధావులంతా మడిగట్టుకు కూర్చోకుండా కలిసి ఉద్యమించి గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావల్సిన అవసరాన్ని సూచిస్తాడు.

ఈ కథలన్నీ కూడ సమాజంలోని ఎగుడు దిగుడుల్ని అవకతవకల్ని ఎత్తి చూపిస్తూనే చివరి కొచ్చేటప్పటికి ఒక కొత్త ఆశతో ముగియడం విశేషం.

"ఆధ్యాత్మిక చింతన మనిషికి అవసరమైతే అవొచ్చునుగానీ అది మూర్ఖత్వం కాకూడదు అదే ఆత్మసాక్షి సమాజం పట్ల నిబద్దతతో కూడిన ఆచరణకు ప్రతిధ్వనించాలి అనే వేణుగోపాల్‌రెడ్డి గారు నిజజీవితంలో కూడా అదే నిబ్ధతకు కట్టుబడి పనిచేస్తారు. తాను ఏం చెప్తారో అదే చేసి చూపిస్తారాయన.

రాణుల ప్రేమపురాణాలు, ఆ ముట్టడికైన ఖర్చులు మాత్రమే చరిత్ర పాఠాలవుతాయి గానీ సామాన్యుల మరణాలు చరిత్రకెక్కుతాయా?

కాలవ ప్రవాహంలో కొట్టుకొచ్చి మోరీ కడ్డంగా పడి ఉబ్బిపోయి, దుర్గంధభరితమై వూరి ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసిన ఆ శవం ఆత్మహత్య చేసుక్ను మా వెంకడిదేమో అనుకున్నపుడు మాత్రం అంతా ఎవరికి వారే దూరంగా తొలగిపోతారు. మేధావులు కూడా అన్‌క్లెయిమేడ్ బాడీని తాకరాదంటూ, చట్టం తనపని తాను చేసుకుపోగలదంటూ ఉచిత సలహాలిస్తారు. చివరికి పోలీసులు కూడా ముందుకు రారు.

అయితే ఆ శవం మార్కెట్ యార్డు ఛైర్మన్ రామస్వామి కొడుకు సురేష్‌దనీ, దువ్వూరులో కక్షిదారులు ఖూనీ చేసి శవాన్ని కాలువలో పారేశారనీ తెలియగానే సీనంతా మారిపోతుంది.

ఒక లారీ నిండా పూలతో అలంకరించిన టాప్‌మీద, పాడె మీద ఒక శవం, శవం నిండా పూలు కప్పేశారు. మేళతాళాలతో వూరేగింపు సాగుతుంది. వూరిలోని ప్రముఖులూ, వారి కార్లూ చివరికి పోలీసులూ కూడా ఊరేగింపుగా నడుస్తారు. "కాల ప్రవాహం" అన్న కథలో మా వెంకడి శవానికి లేని గుర్తింపు డబ్బు, పలుకుబడి వున్న వాడి కొడుక్కి వుండడాన్ని గురించీ, కాల ప్రవాహంలో మంట గలిసిపోయిన మానవత్వాన్ని గురించీ చెప్తాడు రచయిత ఆర్తిగా...

ఈ సంపుటిలోని మరో చెప్పుకోదగిన కథ "ఔట్ సోర్సింగ్"

ఈ పురుషస్వామ్య సంస్కృతిలో స్త్రీల శరీరావయవాల మీద చివరికి గర్భసంచీల మీద కూడా ఎంత అదుపు వుంటుందో మనం అనేకసార్లు చర్చించుకున్నాం. ఆ క్రమంలో ఒకసారి గర్భసంచి అద్దెకిస్తే రెండు లక్షల రూపాయలొస్తాయని భార్యని గుజరాత్‌కి తీసికెళ్ళి ఒకసారి కాకుండా మళ్ళీ మళ్ళీ అదే పనికి వినియోగించాలని ప్రయత్నించిన నారాయణ భార్య ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోడు. అయితే అతడ్ని ధిక్కరించి మన వూరు వెళ్ళిపోదామంటూ పట్టుపట్టిన వెంకటలచ్చిని గురించి శీలా సుభద్రాదేవి 'గోవుమాలచ్చిమి' అన్న కథలో చెప్తారు. సర్రోగేట్ మదర్స్ గురించి బహుశా అదే తొలి కథ కావొచ్చును.

అయితే సుభద్రాదేవి చెప్పిందో కోణమైతే 'ఔట్ సోర్సింగ్' మరో కోణంలో మన కళ్ళముందు నిలుస్తుంది. స్త్రీలు మరే బలవంతాల మీద కాకుండా స్వయంగానే అయినా దీన్నో ఉపాధి మార్గంగా ఎంచుకోవలసి రావడం ఎంత బాధాకరం.

సంపన్న దేశాలు ప్రపంచీకరణ, ఔట్ సోర్సింగ్‌ల ద్వారా మూడో ప్రపంచదేశాలను హైజాక్ చేస్తున్నాయి. ఇప్పుడా క్రమంలో కన్న కడుపులు కూడా ఎలా హైజాకయి పోతున్నాయో చెప్తాడు రచయిత. గుజరాత్‌లోని నయానాపటేల్ హాస్పిటల్‌కి ఈ టెస్ట్‌ట్యూబ్ బేబీల కోసం, అద్దె గర్భాల కోసం ఎంతమంది విదేశీ దంపతులు వస్తూంటారో తెలిసి ఆశ్చర్యపోతాం మనం.. రచయిత స్వయంగా వైద్యుడు కూడా కావడంతో మెడికల్ కోణం నుండి కూడ చాలా సూక్ష్మంగా అర్థం చేయిస్తాడు కథని.

ఈ మొత్తం కథలు చదువుతూంటే మతాతీతమైన సహన స్నేహ భావమేదో అంతర్లీనంగా ప్రవహిస్తున్నట్లుగా వుంటుంది. ఈ కథల్లోని మనుషుల స్నేహాన్ని చూసి జాతి, మతం, కులం, ప్రాంతం భాష దూరంగా జరిగి తలలు దించుకుంటాయి. ఈ మనుషుల మైత్రీ బంధం వీరి జీవన విధానంలో రచయిత మ్రోగించిన విజయ దుందుభులతో ఓ కొత్త బంగారులోకపు ధగధగలు పరుచుకుంటాయి.

"ప్రతీ రచయితా ఏదో ఒక ప్రాంతానికి చెందినవాడై వుంటాడు... ఆ ప్రాంతపు ఉత్పత్తి సంబంధాలతో, జీవన విధానంతో సంస్కృతితో, భాషతో సంబంధం కలవాడై వుంటాడు. ఆ ప్రాంతపు జీవలక్షణాలతో మమేకత కలిగి వుంటాడు. అందువల్ల ఆరచయిత సృజించే కథావస్తువూ, పాత్రలూ, సంభాషణలూ, స్పందనలూ, ఆ ప్రాంతపు జీవితం నుండి పుట్టుకొచ్చినవై వుంటాయి. నిర్దిష్ట స్థలకాలాలతో ఆవరించినవై వుంటాయి" అంటారు సింగమనేని నారాయణగారో చోట...

మల్లెమాల వేణుగోపాల్ రెడ్డిగారు నిర్దిష్ట స్థల కాలాల స్పృహ స్పష్టంగా వున్న రచయిత. ఆయన కథలన్నీ కూడా నిర్దిష్ట స్థలకాలాలతో ఆవరించినవై వుంటాయి.

సామాజిక జీవన వేదనల లోంచి తెలిసో, తెలీకో అమానవీయ సంబంధాలవైపుగా ప్రయాణిస్తోన్న మనుషుల్ని స్నేహం, ప్రేమ అభిమానం, ఆత్మీయత, పరస్పరావగాహన వంటి మానవీయ సంబంధాలలోకి నడిపించడమే ఈ రచయిత ధ్యేయమని మనకి అర్ధమవుతుంది ఈ కథలు చదివాక.

ఎక్కడయినా
మల్లెలు పరిమళించకుండా వుంటాయా?
అందునా విరిసిన మల్లెలు
ఆ పరిమళాలను ఆఘ్రాణించి
ఆచరణలో పెట్టగలిగిన పాఠకులు
అమేయులు.



May 2010 pages.pmd 32 4/27/2003, 8:39 PM

## నచ్చిన పుస్తకం




# అనుబంధాల దర్పణం

సి.ఎల్. గాయత్రి

కందుకూరి వెంకట మహాలక్ష్మి తొలి కథల సంపుటి ఉషనిర్ణయం. మలి కథల సంపుటి "రష్యన్‌సీత" 2006 సంవత్సరానికి ఢిల్లీ తెలుగు సంఘం వారి విశ్వసాహితి బెస్ట్‌స్టోరీ అవార్డు పొందింది. ముచ్చటగా మూడో కథల సంపుటి "నాణానికి మరోవైపు". ఈ సంపుటిలో సంప్రదాయ విలువలకు, ఆధునిక జీవన సంఘర్షణలకు, సంస్కరణలకు ప్రాధాన్యత నిచ్చారు రచయిత్రి. ప్రముఖ కథకులు మునిపల్లెరాజు గారు ముందుమాట వ్రాసి రచయిత్రిని అభినందించారు.

దేశవిదేశాలలో పర్యటించి సాహితీపరంగా అనుభవాన్ని పొందిన రచయిత్రి ఆలోచనా విధానము, సృజనాత్మకత, వివిధ సమస్యలకు చూపించిన పరిష్కారం ఈ కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. దాదాపు పాతికకు పైగా ఈ సంపుటిలో చోటుచేసుకున్న కథలన్నీ వివిధ పత్రికలలో ప్రచురించబడి పాఠకుల అభిమానాన్ని చూరగొన్నాయి. చదివించే రచనాశైలికి సంగీత పరిజ్ఞానం తోడయ్యింది. ఈ సంపుటిలోని చాలా కథలు దాంపత్య బంధాన్ని విశ్లేషించగా, మరికొన్ని మానవీయ బంధాలను, మిగతావి లోకం పోకడలను, విదేశీమోజును తెలియజేస్తాయి.

అహం వల్ల ఏర్పడే అంధకారం మామూలు చీకటికంటె దట్టమైనది. అది జీవితాన్నే అంధకారం చేస్తుందని తెలిపే కథే "నాణానికి మరోవైపు" దాంపత్యబంధం నాణానికి ఒకవైపయితే ఆ బంధాన్ని నిలుపుకోవడానికి అవసరమైన సహనం, సౌశీల్యం, అణుకువ, త్యాగం మరోవైపు. ఈ కథలోని నర్మద పాత్ర ద్వారా రచయిత్రి ఈ విషయాన్ని చక్కగా వివరించారు. అహంకారంతో ప్రవర్తించడం వల్లనే దాంపత్య బంధానికి దూరమై జీవితాంతం నర్మద ఒంటరిగా జీవించవలసిన పరిస్థితులేర్పడ్డాయి. చివరికి తప్పు తెలిసికొని పశ్చాత్తాపంతో అహాన్ని విడిచి జీవితాన్ని సరిదిద్దుకోవాలని ప్రయత్నించేలోగా పరిస్థితి చేయిదాటి పోతుంది. అతి గారాబం అనర్థాలకు మూలమని అహంకారంతో ప్రవర్తించడం తగదని రచయిత్రి ఈ కథ ద్వారా వివరించారు.

దాంపత్య బంధంలో పునీతులై ప్రేమైక సహగమనాన్ని స్వతః సిద్ధంగా పొందిన మరొక కథ "బంధం – అనుబంధం" శంకరయ్య పార్వతమ్మల మధ్యగల ప్రేమానుబంధాలను ఆదర్శంగా నిలిపారు. రచయిత్రి. జీవితంలో కష్టసుఖాలను సంతోషంగా అనుభవించి, ఒక్కగానొక్క కొడుకుని తమ కళ్లముందే కోల్పోయి, ఆ గ్రామ ప్రజల ఆదరాభిమానాలను పొందిన ఆ వృద్ధజంట చరమకాలంలో దైవికంగా సహగమనాన్ని పొందటం, ఆ కథా సంవిధానం రచయిత్రి కథనాశైలికి మచ్చుతునక.

"వంద అబద్ధాలు చెప్పి ఒక పెళ్లి చెయ్యమన్నారు మన పెద్దలు. ఒక కాపురం నిలబెట్టడానికి ఒక్క అబద్ధం ఆడితే తప్పా??" అని తన మనసుకు నచ్చ చెప్పుకునే డాక్టర్ నిర్మల పాత్రను చక్కగా ఆవిష్కరించారు రచయిత్రి. "ఇదీ నా విధే" కథలో గోపాల్ సుజాత దంపతులు. గోపాల్‌కి తల్లి, తోబుట్టువులంటే ప్రాణం. ఎటొచ్చీ భార్యంటేనే చులకన. "తండ్రి దాన్ని పెంచలేక నా ఇంటికి పంపేడు గనుక నేను తిండి పెడుతున్నాను గనక నా ఇష్టప్రకారం నడవాలి. ఓ పనిమనిషిగా, వంటమనిషిగా, అవసరం వచ్చినపుడు పెళ్లాంగా పడుండాలంతే!" అనే మూర్ఖ స్వభావం కలవాడు. అంతటి మూర్ఖుడిని, వివేక శూన్యుడిని సుజాత బాల్య స్నేహితురాలైన డా॥ నిర్మల తన వైద్య వృత్తితో మార్చుతుంది. నీరసంగా ఉండి తన వద్దకు వచ్చి బాధలన్నీ చెపుకున్న సుజాతను ఓదార్చి, ధైర్యం చెప్పి ఒక చిన్న అబద్ధంతో వారి కాపురాన్ని సంతోషమయం చేస్తుంది. సుజాత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుందని ఆరునెలలకంటే బ్రతకదనే ఒక అబద్ధం గోపాల్‌కి చెపుతుంది నిర్మల. గోపాల్ బాధ వర్ణనాతీతం. అతనిలో ఏ మూలో దాగిన మానవత్వం నిద్రలేచి, పశ్చాత్తాపంతో సుజాతను వదులుకోలేక



May 2010 pages.pmd 33 4/27/2003, 8:39 PM

## విజయగీతిక

సూర్యశ్రీ

నీవు సైతం
విశ్వ విజేతవే
మనసుని విల్లుగా వంచి
కృషి శరాన్ని సంధిస్తే
ఓటమి విరిగి పడదా
విజయం సగర్వంగా ఆహ్వానం
పలకదా !
చీకటి నైరాశ్యం ఆక్రమించక ముందే
వేయి సూరీళ్ళ వెలుగు విరజిమ్ము
నవీన కాలంతో పాటు
నూతన కాంతులు ప్రసరించు
చెడు వ్యసనాలకు లొంగావో
శోక సాగరం నిలువెల్లా
మింగుతుంది
ఓటమికి దాసుడవుతావో
విజయానికి వారసుడౌతావో
తీసుకో నిక్కమైన నిర్ణయం
ఏలుకో ముందున్న సమయం !!

## రెక్కలు

కాళహస్తి వెంకటశేషగిరిరావు

చెట్లపై కేరింతలు
కోతికొమ్మచ్చులు
కాలువల్లో జలకాలాటలు
కాగితపు పడవలతో
ఆటలు-

బాల్యం
మధురమైన జ్ఞాపకం

మౌనం ఒక్కరిదే
మాట అందరిదీ
మాటసాయం లేని
మనుషులు మాత్రం-
ప్రాణంలేని
తోలుబొమ్మలు

కవిత్వం
విరిసిన ఇంద్రధనస్సు
అంతేకాదు
అది రేపటి ఉషస్సు-
ప్రగతికి బాటలు
ఉషోదయం

ఎదకు రెక్కలు అమర్చింది
యవ్వనం
ఏ కొమ్మను చేరి
ఎమైపోతుందో-
పరవళ్ళు త్రొక్కే
మనసు.

ఇక్కడ
అనుబంధాలుండవు
అగాధాలే
గుండెల నిండా-
సాగరం సంగమమే
మనిషి జీవితం

ఆస్తినంతా అమ్ముకోడానికి ప్రయత్నిస్తాడు. చివరకు భార్యను ప్రేమించడం, ఆరాధించడం నేర్చుకుంటాడు. గోపాల్‌లో వచ్చిన మార్పుకు కారణం డా॥ నిర్మలే "రోగాలకు వైద్యం చెయ్యడమొక్కటే కాకుండా, కూలిపోతున్న సంసారాన్ని నిలబెట్టడం కూడా డాక్టర్ల కర్తవ్యమే! విధే!" అని రచయిత్రి అభిప్రాయపడడం సర్వదా హర్షణీయం. సమాజంలో ఇలాంటి సుజాతలెంతో మంది ఉన్నారనడం నిర్వివాదాంశం.

ప్రేమ పేరుతో ఆకర్షణకు లోనై జీవితాలను అంతం చేసికొనే యువతకు కనువిప్పు కలిగించి మార్గదర్శనం చేసే కథ "జీవితం కథ" ఈ కథలో "ప్రేమికుల్లారా! పెళ్లికి ముందే నా ప్రేమకథ చదివితే ఒక్కసారి ఆగి ఆలోచించుకోండేం" అనే సరిత మాటలు నిజంగా ఆణిముత్యాలు అక్షరసత్యాలు.

మధ్య తరగతి కుటుంబంలో నగల పిచ్చి గల భార్యను మార్చిన భర్త "గట్టెక్కించిన చిట్కా" సహనంతో సంసారాన్ని దిద్దుకున్న "రాబందులు" లోని శారద పాత్రలు సమాజంలో కనిపించేవే.

స్వచ్ఛమైన స్నేహానికి ప్రతీకలుగా నిలుస్తుంది "విలువైన మనసు" కథ, స్నేహితుల మాటలు ఔషధంలా పనిచేస్తాయని రచయిత్రి ఈ కథ ద్వారా నిరూపించారు. ఉదాహరణగా ఈ కథలోని కొన్ని మాటలు

"మంచి మాటలు మనిషిలోని సంస్కారాన్ని ఎదుటివారికి తెలుపడమే కాకుండా, ఆ మాటలు ఎదుటి వ్యక్తిలోని మాలిన్యాన్ని పారద్రోలి, మార్పుని తెస్తాయి." అనుభవజ్ఞులైన వారి సూక్తుల సరసన చేరే ఈ వాక్య నిర్మాణం మహాలక్ష్మి గారికి వెన్నతో పెట్టిన విద్య. ఇలాంటి మాటలు ఈ సంపుటిలో అనేకం.

మారుతున్న కాలంతోపాటు మన ఆలోచనా విధానాల్లో మార్పురావాలని, ఆ మార్పు సుఖసంతోషాలను కలిగించేదై ఉండాలని "ఓ పుత్రీ నీ వెలువెంత?" కథ ద్వారా తెలుస్తుంది. పిసినారితనంతో భార్యా పిల్లలను ఇబ్బందిపెట్టి, తిరిగి వారి ద్వారానే మారిన తండ్రికి ఉదాహరణ ధర్మారావు. ఈ పాత్ర "పర్యవసానం" కథలో కనిపిస్తుంది. ఆ ధర్మారావు సంతానం తండ్రికి సున్నితంగా కనువిప్పు కలిగించే విధానం నేటి యువతకు ఆదర్శప్రాయం. ఈ కథా సంవిధానమే రచయిత్రిలోని ప్రజ్ఞకు నిదర్శనం. కథలలో సమస్యను చూపించి వదలకుండా చక్కటి పరిష్కారాన్ని కూడా చెప్పగలుగుతారు.

ఇవే కాకుండా స్వదేశం గొప్పతనం తెలిపే "స్వదేశం - స్వర్గలోకం", తన కుటుంబం వల్ల నష్టపోయిన దీపను ఆదుకున్న "ఒక్కటే గమ్యం", లోకులు పలుకాకులు అని నిరూపించిన "లోకం" వంటి నిత్య జీవితానికి దగ్గరగా ఉండే కథనంతో మానవతా విలువలకు దర్పణంగా నిలుస్తాయి ఈ సంపుటిలోని కథలన్నీ.

తండ్రిగారి ప్రోత్సాహంతో భారతదేశంలోనే తొలి లేడీ మెజీషియన్‌గా పేరుతెచ్చుకొని ప్రదర్శన లిచ్చిన రచయిత్రి, తన కథలలో కూడా సమస్యలతో పాటు పరిష్కారాలను సూచించి పాఠకులను అబ్బురపరిచారు. ప్రముఖ పత్రికలలో ప్రచురితమైన ఈ కథలన్నీ ఒకే సంపుటిగా రూపుదాల్చిన విధం పాఠకులకు పౌష్టికాహారాన్ని అందించినట్లుగా ఉంది. అందరూ చదవాల్సిన ఒక మంచి కథా సంకలనం 'నాణానికి మరోవైపు'.



May 2010 pages.pmd 34 4/27/2003, 8:39 PM

## నచ్చిన పుస్తకం




# వాస్తవిక జీవన శిల్పాలు


**శ్రీరామ్ జొన్న విత్తుల**


ప్రశ్న చాలా శక్తివంతమైంది. దానితోనే అస్తిత్వం అనేది ఆరంభమౌతుంది. స్థలకాలావధుల్ని అధిగమించి విస్తరిస్తుంది. ఏ ప్రశ్నా కడదాకా ప్రశ్నగానే మిగిలిపోదు. ఏదో ఒక సందర్భంలో జవాబును వెతుక్కుంటుంది. అలాగే ఏ జవాబూ ఉత్త జవాబు మాత్రమే కాదు. ఎందుకంటే, ప్రతి జవాబులోంచీ మళ్లీ లెక్కలేనన్ని ప్రశ్నలు పుట్టుకొస్తూనే వుంటాయి. ఇలా నిరంతరం జవాబులు సృష్టించే ప్రశ్నలకి సమాధానాలు వెతుక్కునే ప్రక్రియే జీవితం. ఈ అవగాహనతోనే కాబోలు యువ రచయిత పలమనేరు బాలాజీ కథలు కొన్ని ప్రశ్నలతో ముగిస్తే మరికొన్ని జవాబులతో ముగుస్తాయి. వాచ్యంగా జవాబుతో ముగిసిన ప్రతి కథా, సూచ్యంగా మరికొన్ని ప్రశ్నలని మన మీదికి సంధిస్తుంది. అది ఆయన కథాశిల్ప రహస్యం.

పలమనేరు బాలాజీ వెలువరించిన గదిలోపలి గోడ కథా సంపుటంలో మొత్తం పంతొమ్మిది కథలున్నాయి. దాదాపు అన్నీ మనుషుల్లోని మానవత్వపు జాడల్ని వెతికిపెట్టే కథలే. మరీ ముఖ్యంగా జాడ కథ జన సామాన్యానికి ఏమాత్రం పరిచయం లేని జీవన వాస్తవిక కాఠిన్యత. అడవుల్లో ఏనుగుల జాడని కనిపెట్టి అనుక్షణం వాటి కదలికల్ని అధికారులకి అందజేసే వృత్తి నైపుణ్యం కలిగిన తాత్కాలిక ఉద్యోగి సంజీవుడు. ఒక రోజు ఏనుగుల జాడని కొనుక్కోవడానికి అడవిలోకి వెళ్లినవాడు వెళ్లినట్లే మాయమైపోతాడు. అతని జాడ కనిపెట్టవలసిన బాధ్యత కలిగిన అటవీ శాఖాధికారులుగానీ రాజకీయనాయకులుగానీ ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు ఉండిపోతారు. మన యంత్రాంగం, మంత్రాంగాల నిర్లిప్తతా నిర్లక్ష్య వైఖరుల్ని ప్రదర్శించడంతో ఈ కథ ముగుస్తుంది. సంజీవుడు ఏమయ్యాడనే ప్రశ్నని ప్రశ్నగానే వదిలేసి పాఠకుల గుండెల్లో అలజడిని సృష్టిస్తాడు రచయిత. ఆ ప్రశ్నకి జవాబుని వెతకటం మొదలుపెట్టలేగాని, అది ఎంతటి రచయితనైనా సవాలు చేయగల విస్తృతి కలిగిన కథా వస్తువుగా రూపొందగలదు.

మానవ సంబంధాల్లో అతి సున్నితమైనవీ అత్యంత ప్రభావయుతమైనవీ స్త్రీ పురుష సంబంధాలు. ఎంతటి స్త్రీ పక్షపాతి అయినా పురుషుడు, మౌలికంగా మగాడే. ఏదో ఒక సమయంలో ఏదో ఒక సందర్భంలో మగాడిలోని పురుషాహంకారం ఏదో ఒక రూపంలో బయటపడక తప్పదు. అదే విధంగా స్త్రీలోని న్యూనతాభావం బయటపడడం స్వాభావికమే. ఆ ఆత్మన్యూనతా భావాన్ని జయించిన ఓ ఉద్యోగిని కథే సంకోచం. మన ఆఫీసుల్లో సహోద్యోగుల వెకిలిచూపుల బాణాల్నించీ తప్పించుకోలేక టాయిలెట్‌కి వెళ్లడానికి సైతం సంకోచించే ఉద్యోగినుల సంఖ్య తక్కువేమీ కాదు. వారికి తగిన ఆత్మ స్థైర్యాన్ని ఇవ్వడంలో ఈ కథ ఇచ్చే స్ఫూర్తీ ధైర్యాలు గుర్తింపదగినవి.

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులైనప్పుడు పనుల పంపకాల్లో నిత్యం ఆధిపత్య పోరాటాలే. వాటిలో ఎప్పుడూ మగాడిదే పైచేయి. దాన్ని సవాలు చేసే ఉద్యోగిని అంతర్దర్శనంలోనూ, తన భార్యని తనెంతవరకూ అర్థం చేసుకున్నాడో బేరీజు వేసుకుని, తన భార్య తన వల్ల ఎంత కోల్పోయిందో గ్రహించిన ఉద్యోగి స్పర్శ కథలోనూ కనిపిస్తారు. అదే కౌంటర్ కథకి వస్తే పురుషాధిక్యత ఏమేరకి స్త్రీల అంతరంగిక జీవితాన్ని ఛిద్రం చెయ్యగలదో వివరిస్తుంది. ఏనుగుల రాజ్యం రెండు దారుణమైన మరణాలతో ముగిసి అటు ఆటవీ శాఖాధికారుల నిష్క్రియాపరత్వాన్నీ ఇటు గ్రామీణుల అమాయకపు జీవితాల్నీ ప్రదర్శిస్తే ఎంతెంత దూరం, గది లోపల గోడ కథలు మనకి అతి దగ్గరగా ఉండే వాళ్లకి మనం ఎంత దూరంగా ఉన్నామో, మనం అనుకునే దగ్గరతనంలో ఎంత డొల్లతనం ఉందో వివరిస్తాయి.

మనిషి చుట్టూ వున్న అసమానతల్ని మునిదేవర ప్రత్యక్షంగా ప్రదర్శిస్తే వ్యక్తుల ఆంతరంగిక వైరుధ్యాల్ని కొందరిలా రోడ్డు దాటినవాడు కథలు ప్రదర్శిస్తాయి. అదృశ్యమౌతున్న జాతి మరో ప్రత్యేకమైన శైలిలో




May 2010 pages.pmd 35 4/27/2003, 8:39 PM

# చెదిరిన ప్రతిబింబం

**మహమ్మద్‌ఖాన్**

ఎంతగా గుర్తుపెట్టుకోవాలన్నా
కొన్ని దృశ్యాలు, చెదిరిన ప్రతిబింబంలా
కాలగర్భంలో కలిసిపోతాయి
ఎంతగా
మరచిపోవాలన్నా
కొన్ని సత్యాలు, ఎద పలకపై
శిలాశాసనాలయి ప్రత్యక్ష మౌతాయి
గెలుపు ఓటముల్లా
ఈ మరపులూ, జ్ఞాపకాలు మలుపులు
తిరిగి
ఒక దాని వెంట మరొకటి
నీడలా వెంబడిన్తా, మనల్ని
అనుసరిస్తాయి
మనం ఏదో అనుకుంటాం గాని
కొన్ని సంఘటనలు
ఎంత వద్దన్నా, ఎంతగా త్రోసిపుచ్చినా
బలవంతాన, అనుకరిస్తూ
ఎవరో నెట్టుకొచ్చినట్లు, ఎదుట పడ్తాయి
కావాలని ఎంత గింజుకున్నా
కాల గర్భంలో కలియని దృశ్యాలు
సయితం
దాగుడు మూతలాడుతూ వేధిస్తుంటాయి
అది మాట గావచ్చు, దృశ్యంగావచ్చు,
చిత్రంగావచ్చు
మరేదైనా
ఎదను తీవ్రంగా గాయపర్చిన లేదా
ఆశ్చర్య పర్చిన
తీవ్రాతి తీవ్రమయిన సంకేతం కావచ్చు,
ఏదైన యాధృచికంగా, మనసు జోక్యం
లేనిదే,
ఏది గుర్తుకురాదు

# రైతు నానీలు

**మేరెడ్డి యాదగిరి రెడ్డి**

కంటికి కునుకు లేదు
వొంటికి సుఖం లేదు
అర్ధరాత్రి
కరెంటు

నారు మడిలో
పికాసో చిత్రాలు
కొంగల
తొక్కుడు కదా!

సహకార
వ్యవయసామంటే
కూలీగా
మారిన రైతు

ఇవాల పొలాల్లో
పంటలు పండటం లేదు
రియాల్టర్లు
రూపాయలు పండిస్తున్నారు

బి.టి. విత్తనం
వచ్చిందిక
బహుళజాతి కంపెనీల
విషపు పుత్రిక

---

పతనమౌతున్న మానవీయతా విలువల్నీ మానవసంబంధాల్లో విస్తరిస్తున్న వ్యాపార ధోరణుల్ని పట్టిచూపిస్తుంది. బ్యాంకు లావాదేవీల్లో అనుభవంలేని సామాన్య రైతుల కడగండ్లని కండ్లకు కట్టే అదృశ్యం. కళలు, కలలుగా మారిపోయే వైనాన్ని వివరించే ఆత్మీయులు, తనను తాను తెలుసుకోవడమెలాగో తెలియజెప్పే కొత్తనడక కథలతోపాటు రాజకీయంలో పావులు గద్దెనెక్కినా, అధికారం దక్కినా సేవకులుగానే ఉండిపోయే వైనాన్ని విశ్లేషించిన దళితుల గుండె చప్పుడును వినిపించే చప్పుడు కథలు పాఠకులకి వైవిధ్యభరితమైన, జీవితచిత్రాలనందిస్తాయి.

రాయలసీమంటే రైతుల కన్నీటి కథ. ఆ కన్నీరే ఘనీభవించి పంతాలు పట్టింపులకి దారితీసి చివరికి తరాల అంతరాల్లో శత్రుత్వంగా మారిపోవడం తపన కథలో కనిపిస్తే, కార్మికుల కడగండ్లు కడదాకా కడగండ్లుగానే ఎలా మిగిలిపోతాయో ధర్నా కథ వివరిస్తుంది. పిల్లల్ని బడికి పంపడం అంటేనే జైలుకి పంపడంగా మారిపోయిన ఈ కాలంలో ఆ జైలునుంచి విడుదలైన విద్యార్థి తిరిగి ఇంటికి రాకపోతే ఆ తల్లిదండ్రుల బాధ ఎంత దుర్భరంగా ఉంటుందో బడికి వెళ్లే దారి కథ వివరిస్తుంది. ఈ విధంగా సమాజంలోని వివిధ సమస్యల్ని కథా వస్తువులుగా స్వీకరించి వాటికి సమాధానాల్ని వెతుక్కోవడానికి కావలసిన స్ఫూర్తినిచ్చే ఈ కథలన్నీ చదవదగినవీ, ఆలోచించదగినవీ మాత్రమే కాదు, ఆచరించదగినవి కూడా...

వాస్తవానికి ఈ రచయిత ఈ విధంగా ప్రశ్నలు సమాధానాల ప్రక్రియనే తన కథాశిల్పరహస్యంగా చేసుకోవడం వెనుక సాహిత్య కృషి ఎంతవుందో అంతకు మించిన వైయక్తిక జీవనశిల్పం వుందనడం సమంజసం. ఎందుకంటే వ్యక్తిగతంగా ఆయన కేవలం ఒక్క మనిషి మాత్రమే కాదు. స్వయంగా ఆయనే ఓ పెద్ద సమూహం. ఆయన ఎప్పుడూ ఒంటరిగా ఉండరు. ఎవరినీ ఒంటరిగా ఉండనివ్వరు. ఎప్పుడు చూసినా చుట్టూ రకరకాల మనుషులు రకరకాల ప్రశ్నలతో సమస్యలతో తయారుగా ఉంటారు. వారి ప్రశ్నలకు ఓపిగ్గా జవాబులు వెతుకుతూ సామాన్యమైన మనుషుల్ని మాత్రమే కాదు జీవితాన్ని విశ్లేషించగల రచయితల్ని సైతం ఆశ్చర్యపరుస్తాడు. ఆ ఆశ్చర్యంతోనే యువ రచయిత సుంకోజి దేవేంద్రాచారి "కొత్త కథ" అనే కథ రాశారు. ఒక రచయిత మరొక రచనకి ప్రేరణనివ్వడం కొత్తేమీ కాదు. కానీ ఒక రచయితే స్వయంగా మరొక రచయితకి కథా వస్తువుగా మారడం మాత్రం నిజంగా కొత్త కథే.....

■

## కవిత

# కొన్ని మెరుపులు

హిందీ మూలం: **అల్‌జహీల్**
తెలుగు అనువాదం : **డా॥ జి.వి. రత్నాకర్**

**మూడు వందల సం॥ల పురాతన రాజభవనాన్ని చూసి**
మూడు వందల సంవత్సరాల బంధుత్వం కూడా ఒక బంధమే
నేను కాలాలకతీతమైన యుగాల నివాసిని
పచ్చి పచ్చి సంబంధాల ఉచ్చు త్రాళ్ళలో బందీని
ఎంత నిరంకుశత్వమో నేను దాన్ని కనీసం
ఎదిరించలేకున్నాను.

**ఓమాట**
గరుకైన ఆకాశపు కొండకి
రాత్రంతా నా వీపు ఆనించి రుద్దాను
ఉదయం ఆకాశపు కొంగుపై
రక్తపు మరక సాక్ష్యంగా కనిపించింది

**ఒక మాట**
నా ముందు సముద్రం ఉంది
నా వెనుక కూడా ఉంది
వేల సంవత్సరాల జ్ఞాపకాల ఎడారిలో
నేను ఒక చిన్న కొండపై నిలబడి
నిన్ను పలవరిస్తున్నాను.

**జ్ఞాపకాలు**
భూమి జ్ఞాపకాల్ని మనకి ఇస్తూ ఉంది
మరి మనం నడుస్తూ ఉన్నాము
భూమి హక్కుల కథని వినిపిస్తూ ఉంది
మరి మనం వింటూ ఉన్నాము
మనం నడుస్తూ ఉన్నాము, వింటూ ఉన్నాము
చూపుల్ని దాచుకుంటూ
ఒకచోట నుండి మరో చోటుకి నడుస్తున్నాము
భూమి విస్తరిస్తుంది, ముడుచుకుంటుంది
మనం వ్యాపించలేదు, ముడుచుకోనూలేదు.



**సంద్రం - 1**
సంద్రం పొంగుతుంది
సంద్రం ఉప్పొంగుతుంది
అలలు సంద్రాన్ని మింగుతున్నాయి
నన్ను ముంచుతున్నాయి

సంద్రం ప్రవహిస్తుంది
సంద్రం ప్రవాహమౌతుంది
సుదూర స్వప్నమై సాగుతుంది
నన్ను ఒంటరిని చేసి, ఏకాంతంలో వదిలింది

**సంద్రం - 2**
సంద్రమా
ఓ సంద్రమా
నీలోపల ఆకసం ఉంది
నీ లోపల
ఏమీ లేదు
నేను కూడా లేను

**కిటికీ, పరదా మరియు నువ్వు**
రాత్రివేళ
కళ్ళు బాధల సరిహద్దుపై నిద్రపోయాయి
మరి నువ్వు నా జీవిత రహదారుల్లో నిన్నే కోల్పోయావు
కిటికీ తెరుచుకుంది
పరదా గాలిజోరుకి తలక్రిందులౌతుంది
మరియు నెమ్మది నెమ్మదిగా
రాత్రి కొంగుని కిటికీ వదిలేసింది.



May 2010 pages.pmd 37 4/27/2003, 8:39 PM

# కొత్త పుస్తకాలు

## ప్రజాసాహితి (మాసపత్రిక)




**మహాకవి శ్రీశ్రీ**

**శతజయంతి ప్రత్యేక సంచిక**

**పేజీలు : 144 వెల :50/-**

**లభ్యత: 9848631604**

"అభిప్రాయాలకోసం బాధలు లక్ష్యపెట్టని వారందరిదీ ఈ మహాప్రస్థానం.... ఈ మరో ప్రస్థానం. అందుకే నిన్న వదిలిన పోరాటం నేడు అందుకొనక తప్పదు. శ్రీశ్రీ శతజయంతి అంతం కాదిది ఆరంభం"

**-సంపాదకీయం నుండి**

## చినుకు (మాసపత్రిక)




**5వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక**

**పేజీలు : 280(ఎ4 సైజు) వెల :50/-**

**లభ్యత: 0866-6640595**

"పత్రికలంటే మన గురించి మళ్ళీ మనం తెలుసుకునే పెద్దబాలశిక్షలు. మనం నిర్లక్ష్యం చేస్తున్న అనుబంధాల గురించి, నిర్లిప్తంగా ఊరుకుంటున్న ఉద్వేగాల గురించి, అరికట్టలేని స్వార్థాల గురించి ఈ పత్రికలు ఎన్నో రూపాలలో, మరెన్నో విధాలుగా మనల్ని హెచ్చరిస్తాయి. మన భవిష్యత్‌కు ఒక మార్గాన్నిస్తాయి. కొన్ని స్నేహాలనిస్తాయి. మాట్లాడుకోవడానికి కబుర్లనిస్తాయి. కలుసుకోవడానికి మనుష్యుల నిస్తాయి."

**- సంపాదకీయం నుండి**

## వెలుగు రాగాలు




**డా॥ జి.వి. పూర్ణచందు**

**పేజీలు : 96 వెల :40/-**

**లభ్యత: 9440172642**

"కవిగా, చిత్రకారునిగా, మినీ కవితోద్యమ ప్రచారకునిగా భాషా పరిశోధకునిగా, కార్యకర్తగా తెలుగునాట ప్రసిద్ధి పొందిన డాక్టర్ జి.వి. పూర్ణచందు "కలం దీపం" నుంచి వెలుగు రాగాలు వెలువడుతున్నాయి. కవికి ప్రకృతి పరిశీలనం, బహుగ్రంథ పరిచయం, విశిష్ట భావనాశక్తి వుంటే కవితలు పుష్టిమంతంగా, కొత్తకాంతులతో ప్రకాశిస్తాయని చెప్పటానికి 'వెలుగు రాగాలు' ప్రత్యక్ష సాక్ష్యం."

**- డాక్టర్ గుమ్మా సాంబశివరావు**

## నాతిచరామి




**ఝాన్సీ కె.వి. కుమారి నాటకాలు**

**పేజీలు : 150 వెల :135/-**

**లభ్యత: 9948094563**

"ఝాన్సీ రేడియో మాధ్యమం తెలిసిన రచయిత్రి. ఉద్వేగాలను ఈ మాధ్యమంలో ఎలా పండించాలో తెలుసుకున్న రచయిత్రి. అందుకుగాను నేపథ్య సంగీతాన్ని, ఫ్లాష్‌బాక్‌లను ఎంతో నాటకీయంగా వాడుకునే నేర్పు ఉన్న రచయిత్రి. "

**-ఆచార్య మొదలి నాగభూషణ శర్మ**

## ముఖాముఖం




**పరకాల పట్టాభిరామారావు**

**పేజీలు : 212 వెల :100/-**

**లభ్యత: 0866-2474635**

"సకల సామాజిక రంగాలలో విలువలు విధ్వంసమవుతున్న వర్తమాన సంక్షోభ తరుణంలో మళ్ళీ సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ అవసరాన్ని మరీమరీ నొక్కి చెపుతున్న సామాజిక శాస్త్రవేత్త పరకాల. 'వాస్తవిక సంఘటనల నుంచి సత్యాన్ని అన్వేషించే' అభ్యుదయ రచయితగా ఈ 'ముఖాముఖి' వ్యాస సంపుటి ద్వారా పరకాల మనకు కనిపిస్తారు."

**- పెనుగొండ లక్ష్మీనారాయణ**

## ఆత్మనుంచి అక్షరానికి




**(సాహిత్య వ్యాసాలు)**

**దేవరాజు మహారాజు**

**పేజీలు : 108 వెల :60/-**

**లభ్యత: 040-20081144**

"ఒక సుదూర జీవన కణానికి
రక్తం అందించడమే యాత్రయితే,
ఒక చెట్టువేరు దూరంలో ఉన్న
ఖనిజాల్ని శోధించడమే యాత్రయితే,
ఆత్మనుండి అక్షరానికి చేరిన
మానవ ఇతిహాసం కూడా
ఒక మహా యాత్రే కదా?"

**- రచయిత**



May 2010 pages.pmd 38 4/27/2003, 8:39 PM

# కొత్త పుస్తకాలు

### అసమయ రంగుల ముఖమూ... ఇద్దరి దాహం (కవిత్వం)




**బి.యస్.యం. కుమార్**

**పేజీలు : 163, వెల : 100/-**

**లభ్యత: 9959700060**

"గది గర్భాన్ని నింపుకున్న 'ఆత్మఛాయ' వెంట చేరుకుని మారుతూ... తోడిన నిద్ర సమూహాలు. కలల చారని దింపేసుకొంటాయి" వంటి సరికొత్త భావ వ్యక్తీకరణలు.

"విరిగిన మంచు స్థాపిత ధారణ, మట్టిఋతువులు, పారపోసిన కిటికీలు, గ్లాసెడు మధ్యాహ్నం, కంఠాల సేకరణ, పొడుగ్గా అలికిన రూపమూ..." లాంటి ఎన్నో నూతన పదచ్ఛాయలు మనం కుమార్ కవిత్వంలో చదవగలుగుతాం."

**- శైలజామిత్ర**

### ఆడు మగాడు (స్త్రీవాద కవితా సంపుటి)




**యాసలపు సూర్యారావు**

**పేజీలు : 81, వెల : 50/-**

**లభ్యత: 9491439012**

"ప్రేమ పేరిట ఉన్మాద దాడులు, వరకట్న వేధింపులు, హత్యలూ, భూస్వామ్య భావజాలపు దౌర్జన్యమూ, దుర్నీతి, ఆడపిల్లల పట్ల వివక్ష, నిరాకరణ; పడుపువృత్తిలో బతుకులీడ్చే అభాగ్యుల పట్ల కర్కశం, కాఠిన్యం.... ఇలాంటి అమానుషాలన్నిటిపైనా ఈ కవి ఆవేదన చెందుతాడు. ప్రతి భావోద్వేగం చివరా అనంతమైన ఆశ కల్పించే భరోసా వినిపిస్తాడు. బాధను పంటి బిగువున పట్టుకొని వెలుగుతీరంవైపు, విముక్తిమార్గం వైపూ నడిచి వెళ్ళే శక్తినీ, చైతన్యాన్నీ రగిలిస్తాడు."

**-సత్యాజీ**

### అమెరికా అందాల గంధాలు




**శ్రీమతి కోరుపోలు కళావతి**

**పేజీలు : 100, వెల : 50/-**

**లభ్యత: 08922-271064**

"ఆమె రాతలకంటే కూడా ఆమెలోని ఉత్సాహం, రచన పట్ల ఆమెకు గల మక్కువ చూసాక అధ్యయనం, సాధన వుంటే సాహిత్య లోకానికో కొత్త మహిళా రచయిత్రి పరిచయం అవుతుంది... కదా.. అనే ఆశ కలిగింది. సలహాలిచ్చేటంతటి సాహిత్య జ్ఞానమూ, ప్రతిభ నాకు లేవని తెలుసు. అయినా మంచిని ప్రోత్సహించడానికి అవేవి అవసరం లేదుకదా."

**-గంటేడ గౌరునాయుడు**

### కాలస్పర్శ (వచన కవిత్వం)




**కాసర్ల నరేశ్‌రావు**

**పేజీలు : 81, వెల : 50/-**

**లభ్యత: 9441406252**

"కాసర్లకు బాధకలిగించిన ప్రతి అంశంమీద కవిత్వం రాశాడు. చివరకు సెల్‌ఫోన్ మీద రాసింది కూడా. సెల్ వల్ల శబ్దస్పర్శ తప్ప మనుషులస్పర్శలు కరువవుతున్నాయి. "మిత్రులారా! దయ చేసి నాకు ఫోన్ చేయవద్దు. నేనూ మీకు చేయను" అంటూ యాంత్రిక విసుగును వ్యక్తీకరిస్తారు. అలాగే గాయపడిన తెలుగు పాటల మీద, స్వాప్నిక వసంతాలమీద, చలిపులిమీద, డైరీమీద, పండుగలమీద, పాన్‌దాన్‌మీద ఇలా తనను ప్రభావితం చేసిన ఎన్నో వస్తువులను కవిత్వీకరించాడు."

**-డా॥ నాళేశ్వరం శంకరం**

### కవితాలోకనం




**టి.ఎల్. కాంతారావు**

**పేజీలు : 234, వెల : 120/-**

**లభ్యత: 9490751657**

"నిష్కృష్టమైన సాహిత్యాభిప్రాయాలకి, ప్రవాహ సదృశమైన శైలి కూడా జత పడినప్పుడు, ఆ విమర్శ పూవుకు తావి జతకూడినట్లుంటుంది. శ్రీ కాంతారావు విమర్శలో సూక్ష్మ విశ్లేషణతోపాటు ఒక వేగమూ, ఉద్వేగమూ గల శైలి కూడా ఉంది. అందుచేత ఈయన విమర్శలో ఆపకుండా చదివించే లక్షణం ఉంది."

**-అద్దేపల్లి రామమోహన రావు**

### నాతిచరామి (నాటకం)




**కొట్టి రామారావు**

**పేజీలు : 32, వెల : 30/-**

**లభ్యత: 9908789405**

"మంచి నాటకరచనలు కరువైపోతున్న ఈ రోజులలో ప్రదర్శనకు పనికివచ్చే రచనలు చేసినవారు ధన్యులు. రచనా సౌందర్యము, ప్రదర్శనా యోగ్యతను కలుగజేస్తూ శ్రీకొట్టి రామారావు రచన ప్రదర్శనా యోగ్యము. ఇది రేడియో నాటికగా ప్రదర్శించవచ్చు. రంగస్థలిపై ఏకాంకికగా ప్రదర్శించవచ్చు. కథ సామాన్యమైనదే. జరుగుతున్నదే. ప్రస్తుతం స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యే అయినా అభినయానికి, అనువైన సంభాషణలకు, సన్నివేశాలకు అవకాశం కల్పించారు రచయిత."

**- డా॥ జంధ్యాల రాధాకృష్ణ**




May 2010 pages.pmd 39 4/27/2003, 8:39 PM

## నివాళి

# 'ఇట్లు మీ విధేయుడు"



1932 ఫిబ్రవరి 6వ తేదిన జన్మించిన 'భరాగో'కు కేంద్ర సాహిత్య ఆకాడమీ ఆవార్డ్ తెచ్చిన కథా సంకలనం "ఇట్లు మీ విధేయుడు" –'భరాగో'గా ప్రసిద్ధులైన వీరి పేరు "భమిడిపాటి రామగోపాలం" మధ్యతరగతి కుటుంబ జీవన శైలిపై చక్కటి శైలితో చాలా మంచికథలు పాఠకులకు అందించారు. 1995 ప్రాంతంలో దూరదర్శన్‌లో వీరి కథలు ధారావాహికంగా ప్రసారాలు అయ్యేయి. ఎన్.జి.ఓ లో మనస్థత్వాలు, ఆఫీసు వ్యవహారాలు, అతివల అంతరంగాలు, పాత – కొత్త తరాల అంతరాలు.. మర్యాదలు, సాంప్రదాయాలు, మధ్యతరగతి మనస్థత్వాలు, తటపటాయింపులు... నిర్ణయాలు తీసుకోలేని మనస్థత్వాలు, భరాగో కథల్లో కనిపిస్తాయి. నాలుగు దశాబ్దాల కాలంలో సాగిన వీరి కలం... 1950–1990 మధ్య సహజ పరిణామం, కుటుంబ నీతి, రీతి కనిపిస్తాయి. పోర్టు నుంచి పదవీ విరమణ చేసి సాహిత్యరంగంలో ముఖ్యంగా పుస్తకాల ప్రచురణ ప్రాజెక్టులను "భరాగో" సమర్ధవంతంగా నిర్వహించారు. జ్యేష్ఠలిటరరీ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా పురస్కారాలు... పెద్ద ఎత్తున సభలు నిర్వహించారు. "ఇట్లు మీ విధేయుడు" కథాసంకలనంలో 1960 నుండి 1990 దాకా రాసినవి. వెన్నెలనీడ (1960) నుండి 1990 ప్రతి రాత్రీ వసంతరాత్రి" కథ ద్వారా హాస్యంతో తొణికిసలాడే కథా గమనంతో పాటు, మధ్యతరగతి జీవిత చిత్రణ... ఎంతో వాస్తవికంగా చేసారు. 1949 లోనే ఆంధ్రపత్రికలో "నేను మా ఆవిడ కథ" నుండి ఇటీవల వరకు భరాగో రాసిన కథలు 160 దాకా వుంటాయి. సర్పరేఖ (1964 –నవల) కుండపెంకులు (నవల 1961), వంటొచ్చిన మొగాడు (1966 కథలు) వెన్నెల నీడ (1977), కథన కుతూహలం (కథ 1985), నాకీ ఉద్యోగం వద్దు (నవల1988), ఇట్లు మీ విధేయుడు (1990) సరదా కథలు (1995), కులాసా కథలు (1997), ప్రసిద్ధమైనవి... ఇంకా అనేక అనువాద రచనలు ఆయన చేసారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట కాలం గురించి, విశాఖ ఉక్కుకై సాగిన ఉద్యమాలు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు... ప్రపంచీకరణ ప్రవేశం – నూతన ఆర్థిక విధానాలపై, అలాగే 92 నుండి 'సాగుతున్న మతోన్మాదంపై బలమైన' ముద్ర వేసే... ఆలోచింపజేసే కథలు. భరాగో కలం నుండి రాకపోవడం వారికలంపై సామాజికపరంగా ఒక విమర్శే.. మధ్యతరగతిని స్పర్శించిన ఆయన కలం 7 ఏప్రియల్ 2010న శాశ్వత విశ్రాంతి తీసుకుంది.

**-తంగిరాల చక్రవర్తి**


## 'ప్రస్థానం'కు చందా కట్టండి!
## నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!

**అయిదేళ్లకు : రు. 500/-**
**పదేళ్లకు : రు. 1000/-**

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-**
**సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-**
**విడి ప్రతి : రు. 10/-**

**చందా దారులకు విజ్ఞప్తి** — **చిరునామా పైన చందా ప్రారంభ మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.**

ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్–20
వివరాలకు : 040–27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in





May 2010 pages.pmd 40 4/27/2003, 8:39 PM



# విజయనగరంలో సాంస్కృతిక విశ్వవిద్యాలయం రావాలి!

విజయనగరం జిల్లా సాహితీస్రవంతి ఆధ్వర్యంలో స్థానిక సంగీత కళాశాలలో ఏప్రిల్ 18న సాంస్కృతిక విశ్వవిద్యాలయ సమాలోచన సమావేశం జరిగింది. ఈ సభలో సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ చీకటి దివాకర్ మాట్లాడుతూ సాహిత్యం, కళలు, సంస్కృతిలో భాగమని అన్నారు. ఒకప్పుడు ఈ జిల్లాలో అభివృద్ధి చెందిన సాహిత్యం, కళలు ఇప్పుడు ఉనికి కోల్పోతున్నాయన్నారు. సాహిత్యాన్ని, కళల్ని ప్రపంచీకరణ విధ్వంసం చేసి, అందులో భాగమైన సంస్కృతిని నాశనం చేస్తోందని అన్నారు. వీటిపై అధ్యయనం, కృషి, విశ్లేషణలు జరగాల్సిన అవసరముందన్నారు. అందుకు సాంస్కృతిక విశ్వవిద్యాలయం అవసరమన్నారు. అలాంటి సంస్థను ఏర్పాటుచేయడానికి కావల్సిన అర్హతలు ఈ ప్రాంతానికి ఉన్నాయని, ఉమ్మడిగా సమాలోచన చేసి ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచాలని సూచించారు. దీనిపై విజయనగరంలో నిర్వహించిన సాహిత్యశాలలో తీర్మానం కూడా చేశామన్నారు. ఈ సభను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రామసూరి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక విశ్వవిద్యాలయ ఏర్పాటుకు ఇది అంకురార్పణ కావాలన్నారు. విజయనగరం రాజులు సాహిత్య, సాంస్కృతిక, కళావారసత్వం కొనసాగించిన తీరును వివరించారు. నూతన సాంస్కృతిక అభివృద్ధిలో గత వైభవాన్ని తీసుకురావచ్చున్నారు. అండలూరి సోమేశ్వరరావు మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, జానపద, లలిత కళలతో పాటు వేదం, జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ ఖ్యాతిని తెచ్చిపెట్టాయని అన్నారు. వాటిని మళ్ళీ వెలుగులోకి తేవడానికి సాంస్కృతిక విశ్వవిద్యాలయం అవసరమన్నారు. ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి మాట్లాడుతూ  ఇన్నేళ్ళ తర్వాతైనా సాంస్కృతిక విశ్వవిద్యాలయ ఏర్పాటు స్ఫురణకు రావడం ముదావహమన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో 'భారతభవనం' పేరిట సాంస్కృతిక కేంద్రం నడుస్తోందన్నారు. అలాంటి నమూనాలో ఒక విశ్వవిద్యాలయం ఏర్పాడాల్సిన అవసరముందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎంవివిఎస్ శర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో మిగిలినచోట్ల కంటే విజయనగరంలో సాంస్కృతిక కృషి ఒక్కపాలు ఎక్కువగానే ఉందని అభిప్రాయపడ్డారు. విశాఖ ఉక్కు కోసం గనుల్ని సాధించుకోవడంలో, గోదావరి బేసిన్‌లో గ్యాస్ సాధించుకోవడంలో మన వైఫల్యం, రాజకీయ చైతన్యాన్ని తెలియజేస్తోందన్నారు. ఈ అంశాలన్నీ సంస్కృతితో ముడిపడి ఉన్నాయని చెప్పారు. ప్రజాస్వామిక భావజాలంతో సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం విశ్వవిద్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. గతంలో విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'థియేటర్ ఆర్ట్స్'లో ఈ రకమైన కృషి కొంత జరిగిందని ఉదహరించారు. వానాకాలపు సమావేశాల్లో మూడు జిల్లాల ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల, మంత్రుల సహకారంతో సాంస్కృతిక విశ్వవిద్యాలయం తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. నాటకరంగ ప్రముఖులు అల్లూరి సీతారామరాజు మాట్లాడుతూ జిల్లాకో యూనివర్శిటీ పెట్టాలన్న ప్రభుత్వ ఆలోచన సాకారం కావాలన్నారు. మరో నాటక కళాకారుడు ఈపు విజయకుమార్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ నాటకోత్సవాలు జరుపుకోవడానికి వేదిక కావాలన్నారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ బి. అనురాధ మాట్లాడుతూ సంగీత కళాశాలస్థాయిని పెంచి యూనివర్శిటీగా మార్చాలని కోరారు. బి. నారాయణరావు మాట్లాడుతూ గతవెంతో ఘనకీర్తి కలిగిన విజయనగరం వారసత్వాన్ని కొనసాగించడానికి ఒట్టిమాటలు కట్టిపెట్టి, గట్టి మేలు తలపెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజానాట్యమండలి సభ్యులు షణ్ముఖరావు మాట్లాడుతూ కళారంగంలో విజయనగరం ఒకప్పుడు ఉజ్వలంగా ఉండేదని, నేడు నిర్వీర్యమైపోయిందన్నారు. ప్రముఖ న్యాయవాది పరుశురాం కాలగమనంలో వచ్చిన మార్పులు వల్ల కళాకారుల్లో ఏర్పడిన అనారోగ్యకరపోటీ కొంత నష్టం చేసిందన్నారు. జానపద అధ్యయనవేత్త బద్రి కూర్మారావు కల్చర్ అనే పదం అగ్రికల్చర్ నుంచి వచ్చిందని కులం, వృత్తులు, భాషలు, ఆచారాలు ఇవన్నీ సంస్కృతిలో భాగమన్నారు. విశ్వవిద్యాలయం జానపద కళారూపాల్ని సజీవం చేయాలన్నారు. ఎన్జీవో అసోసియేషన్ నాయకులు పి. రామచంద్రరావు విశ్వవిద్యాలయ సాధనకు ఓ కమిటీ ఏర్పాటుచేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో, మండల, జిల్లా పరిషత్‌ల్లో దీనిపై తీర్మానాలు ఆమోదింపజేయాలని చెప్పారు. కవి అల వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

**- రాజాచంద్రశేఖర్, అల**

## 'అలల సవ్వడి' ఆవిష్కరణ



**'అలల సవ్వడి' కవితా సంపుటి ఆవిష్కరణ. చిత్రంలో జె. బంగారం, డాక్టర్ యు.ఎ. నరసింహమూర్తి, పుస్తక రచయిత 'అల', దుప్పల రవికుమార్**

విజయనగరం పట్టణంలోని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమం జరిగింది. ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ యు.ఎ. నరసింహమూర్తి సామాజిక న్యాయం అంశంపై ఈ సభలో ప్రసంగించారు. అంబేద్కర్ రచనలు లోతుగా అధ్యయనం చేస్తేగాని అంబేద్కర్ జీవితం అర్థం కాదని ఆయన అన్నారు. ఆయన మార్గాన్ని అనుసరిస్తున్న వాళ్ళు దాన్ని ఆచరణలో చూపలేకపోతున్నారని, సామాజిక మార్పునకు విశేషంగా కృషిచేసిన అంబేద్కర్ గొప్ప మేధావని కొనియాడారు. వ్యవస్థలో ఉండే శక్తులంతా ఏకమై బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కృషిచేయాలన్నారు. కవి అల రచించిన 'అలల సవ్వడి' కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు.

అరసం నాయకులు పెనుగొండ లక్ష్మీనారాయణ 'అలల సవ్వడి' పుస్తకాన్ని సమీక్షించారు. ఈ పుస్తకం ముందుమాటలో కవి 'తన కంటూ ఒక కచ్చితమైన తాత్వికత ఉందని చెప్పారని, అది ఈ పుస్తకం నిండా కనిపిస్తోందని' అన్నారు. రెండు దశాబ్దాలుగా తెలుగునాట సంభవించిన అనేక సంఘటనల్ని శక్తివంతంగా కవిత్వీకరించిన ఉత్తరాంధ్ర కవుల్లో 'అల' ముందుపీఠిన ఉంటారని కొనియాడారు. ఈ వ్యవస్థను నడిపిస్తున్న అదృశ్యశక్తి అలకు సుబోధకమేనన్నారు. ప్రపంచీకరణ ప్రారంభకాలంలో కవిత్వం రాయడం మొదలెట్టిన అల సామ్రాజ్యవాదాన్ని సమయం దొరికిన ప్రతిచోట ఉల్లేఖించి, కత్తి దూసారన్నారు. ప్రగతిశీల దృక్పథం అలవర్చుకుని విస్తృత అధ్యయనం సాగించిన అల మతోన్మాదం, కులతత్వం, స్త్రీవాదం మొదలైన అంశాల ప్రాతిపదికగా రచన సాగించారని అన్నారు. వ్యవసాయరంగం మీద, ఆ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం మీద కవితలు స్పందింపచేస్తాయని అన్నారు. 'యుద్ధం ముగియలేదు' అన్న కవిత సంకలనంలోనే ఉత్తమమైనదని అభివర్ణించారు.

సాహితీవిమర్శకులు దుప్పల రవికుమార్ మాట్లాడుతూ ఈ కవితాసంపుటిలో 44 కవితలున్నాయని అందులో 11 అక్షరం, పద్యం, పాట పేరిట వచ్చాయన్నారు. వీటిలో కవి ఆకాంక్షలు, సాహిత్యం పట్ల ఉన్న నిబద్ధత తెలుస్తుందని అన్నారు. 1990 నుంచి 2002 వరకు రాసిన కవితలు నేరుగా ఆవేశంగా రాసినవి కాగా, 2002 నుండి 2010 వరకు రాసిన కవితల్లో పరిణితి కనపడుతుందని ఆయన అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కవి జె. బంగారం మాట్లాడుతూ అల గతంలో 'నిప్పులవాగు, మట్టిచెట్టు, పిట్ట బజనిక కావ్యాల్ని రచించారని, ప్రస్తుత కవితా సంపుటి 'అలల సవ్వడి' వాటికి భిన్నమైన వచన కవితా సంపుటి అన్నారు. అల స్పందిస్తూ తన సాహిత్యాన్ని ప్రచురించి, ప్రచారం చేస్తోంది మిత్రులేనని, వారి సహకారంతోనే కవిగా నిలువగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామాజిక న్యాయం అంశంతో కవిసమ్మేళనం జరిగింది. డాక్టర్ రామసూరి, డాక్టర్ చాగంటి తులసి, మానాపురం రాజాచంద్రశేఖర్, పి. లక్ష్మీనర్సింహం, మరువాడ భానోజీ, పాయల మురళీకృష్ణ, పి. లక్ష్మణరావ్, ఏవిఆర్.మూర్తి, అనంతరావ్, కె. సన్యాసిరావు తదితరులు తమ కవితల్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో చీకటి దివాకర్, ఎస్‌విఆర్ కృష్ణారావు, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

**- చంద్రిక**



***ఏప్రిల్ 11న పెద్దాపురంలో జరిగిన 'ఆడు మగాడు' కవితా సంపుటి ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో పుస్తక రచయిత యాసలపు సూర్యారావు, ఆవిష్కర్త పెద్దాపురం మున్సిపల్ ఛైర్మన్ శ్రీమతి ముప్పన శ్యామలాంబ, సభాధ్యక్షులు బి. అనంతరావు, ముఖ్య అతిథి డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు, మరోకవి జోశ్యుల కృష్ణబాబు, గద్దే***



***వికృతినామ ఉగాది వేడుకలు సందర్భంగా కవి సాదనాల వేంకటస్వామినాయుడిని 'ఉగాది పురస్కారం-2010' తో సత్కరిస్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీమతి వి. ఉషారాణి, మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణ.***



May 2010 pages.pmd 42 4/27/2003, 8:39 PM

## డైరీ

# "మానవుడే మా సంగీతం"



అనితర సాధ్యమైన శైలిలో తన కవితల ద్వారా ఆధునిక సాహిత్యాన్ని భూమార్గం పట్టించి, భూకంపం సృష్టించిన కవి శ్రీశ్రీ అని ప్రముఖకవి నిఖిలేశ్వర్ అన్నారు. శ్రీశ్రీ శతజయంతిని పురస్కరించుకొని ప్రజాసాహిత్య వేదిక పాలమూరు శాఖ వెలువరించిన "మానవుడే మా సంగీతం" జిల్లా కవుల కవితా సంకలనం పుస్తక పరిచయ సభ ఏప్రిల్ 10న మహబూబ్‌నగర్ పట్టణంలోని స్థానిక లుంబిని ఉన్నత పాఠశాలలో సాహిత్యవేత్త కె. అయ్యన్న అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా నిఖిలేశ్వర్ ప్రసంగిస్తూ దేశ చరిత్రలో, శైశవగీతి, శరచ్చంద్రిక మొదలైన కవితాఖండికలు కాలాన్ని జయించిన కవితలని, తన జాతి నాలుకలపై నడయాడే కవిత్వాన్ని అల్లిన మహాకవి శ్రీశ్రీకి మరణం లేదని అన్నారు. భారతదేశంలో నలుమూలల తమ చెమటను చిందించి ఇతర దేశాలకు తన శ్రమను పంచిన పురిటివలస కూలీల గడ్డ పాలమూరు నుండి శ్రీశ్రీ పై కవితాసంకలనం వెలువడం హర్షణీయమని అన్నారు. మౌలికంగా కవిత్వం సంక్షిప్తంగా, శక్తివంతంగా వుండాలని చెబుతూ "అది జీవనది/ అది దీపశిఖ/ అది చెమట విలువ తెలిసిన బాట" (డా॥ కె. వీరయ్య), "నేలకూలినవాడిచేత/ కవాతు చేయించేది కవిత్వం" (కె.నవీన్), శ్రమజీవుల/ స్వేద బిందువులతో/ కరచాలనం చేసిన/ ఎనిమిదవ సజీవ సముద్రుడు శ్రీశ్రీ నారెండు కన్నుల దిక్సూచి శ్రీశ్రీ (జనజ్వాల), కాలం చెట్టు/ నూరు శరత్తులు/ మారాకులు తొడుక్కుంటున్న వేళ/ ఆకాశాన తూర్పున/ సూర్యుడి కంటె ముందే/ తొంగి చూశాను తోక చుక్కనై (జి. యోగానంద్), "గుడిసె సమాధిపై లేస్తున్న సౌధాలను చూసి/ రగిలిపోయినవాడు/ అతడు మనిషి/ అతడు శ్రీశ్రీ (రాజారాం ప్రకాశ్) మరి కొందరు కవుల కవితలను ఉటకించారు. పాలమూరు కవులు శ్రీశ్రీ స్ఫూర్తిని అభివ్యక్తీకరించడం అభినందనీయమని అన్నారు.

కవి హిమజ్వాల మాట్లాడుతూ ప్రస్తుతం శ్రీశ్రీ సమాజానికి అక్కరకు రాడనే కాలం పోయిందని తన కాలపు సందర్భంలో సామాజిక చైతన్యం ప్రతిబింబించే కవిత్వం రాశాడని అన్నారు. శ్రీశ్రీ కంటే ముందు ఫ్యూడల్ సంస్కారం ఉండేదని, కందుకూరి, గురజాడల కృషితో ప్రజాస్వామిక సంస్కారం ముందుకు వచ్చిందని శ్రీశ్రీ ప్రవేశంతో ప్రజా సంస్కారం ముందుకు వచ్చిందని అన్నారు. శ్రీశ్రీ కవిత్వానికి లక్ష్యం చైతన్యమంటూ శ్రామిక రాజకీయాల వైపు కవి నిలబడాలని అప్పుడే కష్టజీవుల చరిత్ర ముందుకు వెళుతుందని హిమజ్వాల అన్నారు.

రచయిత పెంటమరాజు నరసింగరావు మాట్లాడుతూ సమాజానికి తనకు సామరస్యం కుదిరే దాక కవి చేసే అంతర్‌బహిర్ యుద్ధారావమే కవిత్వమని, నెత్తురు కన్నీళ్ళు కలిపి శ్రీశ్రీ కొత్త టానిక్ తయారు చేసి ఈ వృద్ధ ప్రపంచానికి అందివ్వడం సరైందని 'చలం' అనడం అతిశయోక్తి కాదని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ఖలీల్ మాట్లాడుతూ మార్పులోని ఆర్ద్రత, తడి సాహిత్యంలో ప్రతిబింబించాలని, కవులు రచయితలు మాత్రమే మాట్లాడే సాహిత్యభాష కాకుండా పొలాల్లో, గనుల్లో, కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల గురించి మాట్లాడాలని అన్నారు. పాలమూరు శ్రామికులను కేంద్రంగా చేస్తూ కథా సంకలనం తీసుకు రావడానికి రచయితలు ముందుకు రావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో విరజాజి రామిరెడ్డి, పరిమళ్ లక్ష్మాగౌడ్, నవీన్, దేవదానం, ఎం.కె. కుర్మన్న, గుడిపల్లి నిరంజన్, వనపట్ల సుబ్బయ్య, బీంపల్లి శ్రీకాంత్, జి. యోగానంద్, తదితర సాహితీమిత్రులు పాల్గొన్నారు. నవీన్ ఆహ్వానం పలుకగా యువకవి ఎస్.శాంతన్న వందన సమర్పణ చేశారు.

**- యోగానంద్**

## రచయితలకు సూచనలు

సాహిత్యప్రస్థానం పత్రికకు కథలు, కవితలు, వ్యాసాలు పంపిస్తున్న రచయిత/రచయిత్రులకు ధన్యవాదాలు. నాణ్యతలో తేడాలున్నా కవితలు విరివిగా వస్తూనే ఉన్నాయి. కథల విషయం అలా లేదు. వచ్చిన కొన్ని కథలు కొత్తదనం లేకుండానూ, పేలవంగానూ ఉంటున్నాయి. మంచి కథలు పంపించడానికి ఆయా కథకులు మరింతగా కృషిచేయాలి. మంచి వ్యాసాలు ఎక్కువ సంఖ్యలో వస్తున్నప్పటికీ సుదీర్ఘంగా ఉండటం ఒక సమస్యగా ఉంది. మరీ పెద్ద వ్యాసాలను పత్రిక పేజీల సంఖ్యరీత్యా ప్రచురించడం ఇబ్బందే. వ్యాసరచయితలు సాధ్యమైనంత వరకు ముద్రణలో మూడు పేజీలకు మించకుండా (చేతివ్రాతలో సుమారుగా ఆరు పేజీలు) రాయడానికి ప్రయత్నించగలరు. ప్రసిద్ధులైన గురజాడ, శ్రీశ్రీ, జాషువా వంటివారిపై ఎక్కువగా వస్తున్నాయి. వీరితోపాటు విభిన్న సాహిత్యకారుల సాహిత్యం గురించి కూడా వ్యాసాలు రాయడానికి వ్యాసరచయితలు ప్రయత్నించాలి. పత్రికకు రచనలు పంపించడంతో పాటు సంవత్సర చందా కట్టి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మీ మిత్రులు, శ్రేయోభిలాషులకు సాహిత్యప్రస్థానం పత్రికను పరిచయం చేయగలరు. మీ సహాయ సహకారాలతో పత్రికను మరింత వినూత్నంగా, ప్రయోజనకరంగా తీసుకురావడానికి మా వంతు ప్రయత్నం ఎప్పుడూ ఉంటుంది.

**- సంపాదకుడు**



May 2010 pages.pmd 43 4/27/2003, 8:39 PM

## "జంజం మాట" పుస్తకావిష్కరణ



ప్రకాశం జిల్లాలోని మార్కాపురంలో తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 11న స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆత్మీయ సమావేశాన్ని కె. మురళీమోహన్‌రాజు ఏర్పాటు చేశారు. ప్రముఖ కవి జంజం కోదండరామయ్య రచించిన "జంజంమాట" నానీల కవితాసంపుటిని డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డి ఆవిష్కరించి తొలుత పుస్తకాన్ని తెలుగు భాషోద్యమసమితి అధ్యక్షులు ఆచార్య ఆదిత్యకి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలాన్ని బట్టి కవులు కూడా సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యాన్ని అందించాలని కోరారు. ప్రముఖకవి బిరదవోలు రామిరెడ్డి మాట్లాడుతూ జంజం కోదండరామిరెడ్డి చదివింది తక్కువే అయిన ఆయన సామాజిక దృక్పథంతో కూడిన అతని కవితా శైలి బాగుంటుందన్నారు. ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ విశ్రాంత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, సాహితీమిత్రులు డాక్టర్ ఆర్. గోపాల్‌రెడ్డి చేసిన సేవలు ఎంతో విలువైనవన్నారు. ఒక పక్క డాక్టరుగా మరో పక్క రచయితగా ఉంటూ మన నెల్లూరు జిల్లాలో ఏ సాహిత్య సభ జరిగినా హాజరువుతూ కవిత్వాన్ని వినిపిస్తారని అన్నారు. సంస్థ అధ్యక్షులు కె. మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ డాక్టర్ గోపాల్‌రెడ్డి ఒక పక్క 'కత్తి'తో వృత్తిని కొనసాగిస్తూ మరో పక్క 'కలం' తో ప్రవృత్తిని కొనసాగిస్తూ రెండింటీకి న్యాయం చేయగలిగిన వ్యక్తి అన్నారు. అంతేకాకుండా ఉత్తమ సేవకునిగా నాతోపాటు విశాఖపట్టణంలో కూడా స్టేట్‌బెస్ట్ సిటిజన్ అవార్డు అందుకున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్‌రెడ్డిని జిల్లా టాక్‌బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆర్.వి. శేషయ్య నాయుడు, ఐ.యన్.టి.యు.సి జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ బాషా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు మద్దూరి శ్రీనివాసులు, ఎస్.ఐ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్.రామారావు, కవి గుర్రాల రమణయ్య, తిక్కన రచయితల సంఘం ఉపాధ్యక్షులు, పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ, ఊరుబిండి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, తిక్కన కళాపీఠం కోశాధికారి శ్రీనివాసరాజు, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, పేరం సుందరరామిరెడ్డి దగ్గుపాటి రాధాకృష్ణ, సన్‌సంస్థ అధ్యక్షులు దశయ్య రవితేజ, కవి దశరద రామిరెడ్డి, అల్లాడి వేణుగోపాల్ తదితర యాభై మందికిపై గా కవులు పాల్గొన్నారు.

**కె. మురళీ మోహన్ రాజు**

## 'నూరేళ్ళు - నూరుగురు కథకులు - నూరు కథానికలు" ఆవిష్కరణ



నూరేళ్ళు–నూరుగురు కథకులు–నూరు కథానికలు' (1910–2009 – శతజయంతి సంకలనం) –గ్రంథాన్ని ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసరు బీలా సత్యనారాయణ మార్చి 17న ఆంధ్రా యూనివర్శిటీ, హిందీ విభాగపు సెమినార్ హాలులో ఆవిష్కరించారు. హిందీ సాహిత్య కిరణ్ సభను నిర్వహించింది. ఈ సంకలనానికి జయంతి పాపారావు, ఆచార్య ఎస్. శేషారత్నం సంపాదకులుగా వ్యవహరించారు. ఆచార్య ఎస్. శేషారత్నం అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఢిల్లీ నుండి ప్రముఖ రచయిత్రి శ్రీమతి చిత్రాముద్గల్ విశిష్ఠ అతిథిగా విచ్చేశారు. ముఖ్య వక్తగా విచ్చేసిన డాక్టర్ వేదగిరి రాంబాబు మాట్లాడుతూ "1910 నుండి ఒక్కొక్క సంవత్సరంలో ఒకొక్క రచయితది ఒకే కథను తీసుకుని ఈ సంకలనాన్ని తీసుకువచ్చారన్నారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఈ సంకలనం వార్షిక క్రమపద్ధతిలో చారిత్రక అధ్యయన క్రమపద్ధతితో రూపుదిద్దుకుందని తెలిపారు. తెలుగులోనే కాకుండా ఇతర భారతీయ భాషల్లో కూడా ఈ పద్ధతిలో వచ్చిన తొలి సంకలనం ఇదేనని సంపాదకుల కృషి చారిత్రాత్మకమైనదన్నారు. నూరేళ్ళలోని సమస్త పరిణామాన్ని ఈ కథలు అద్దంలో చూపించినట్లు చూపిస్తాయని జయంతి పాపారావు వివరించారు. ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, పి.జి. విద్యార్థులూ, రచయితలూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**ఆచార్య ఎస్. శేషారత్నం**



***డాక్టర్ అద్దేపల్లి సాహిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన బివిఎస్ఎమ్ కుమార్ కవితా సంపుటి 'అసమయ రంగుల ముఖమూ–ఇద్దరి దాహం' ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో తంగిరాల చక్రవర్తి, కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి, బి.ఎస్.ఎమ్. కుమార్, అద్దేపల్లి రామమోహనరావు, అంబటి సురేంద్రరాజు, శ్రీరామకవచం సాగర్, శైలజామిత్ర ఉన్నారు.***



May 2010 pages.pmd 44 4/27/2003, 8:39 PM

# అనంతపురంలో అంబేద్కర్ జయంతి



సాహితీ స్రవంతి అనంతపురం జిల్లా శాఖ అధ్వర్యంలో ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా అనంతపురం పట్టణంలో సాహితీకారులతో ర్యాలీ నిర్వహించి జిల్లా పరిషత్ ముందు ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ పి.కుమార్‌స్వామి హాజరై అంబేద్కర్ ఆశయాలను సాహితీకారులు తమ సాహిత్యం ద్వారా ప్రచారం చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత చరిత్రను కవితల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సాహితీవేత్తలను కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన కవులు తరగం క్రిష్టయ్య, మిద్దె మురళీకృష్ణ, జయరాజ్ రాజన్న, జ్యోతి గంగాధర్ మొదలైన వారు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం డా॥చెలికాని రామారావు భవనంలో మార్చి 28న సాహిత్యసభ జరిగింది. ఈ సభలో 'అభ్యుదయ సాహిత్యం, నిన్న, నేడు, రేపు' అనే అంశంపై ప్రఖ్యాత కవి, విమర్శకులు డా॥ ఆవంత్స సోమసుందర్ ఉపన్యసించారు. తదనంతరం ఆర్.కె. ఐడియోలాజికల్ అండ్ ఫిలసాఫికల్ సొసైటీ కార్యదర్శి డా॥ చెలికాని స్టాలిన్, ఇతర ప్రజా సంఘాల నాయకులు డా॥ సోమసుందర్‌ను ఘనంగా సన్మానించారు.

# 'నవ్వులు' పూయించిన కవి సమ్మేళనం



ప్రకాశం జిల్లా మార్కాపురంలో తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యాన ఏప్రిల్ 11న స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో "నవ్వు" అంశంపై కవి సమ్మేళనం జరిగింది. కె. మురళీమోహన్‌రాజు సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వలేకపోవడం ఒక రోగం అంటూ నవ్వు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ జాయింట్ కన్వీనర్ భవానీ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ మనిషికి నవ్వు ఒక వరం అది సంతోషానికి, ఆరోగ్యానికి ఒక సంకేతంలాంటిదని, అర్థంలేని నవ్వు అనర్థాలకు దారితీస్తుందని వివరించారు. విశ్రాంత ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అరుణాచలం మాట్లాడుతూ ముసి ముసినవ్వులు చెడును సూచిస్తాయంటూ మన పెద్దవారు అంటారన్నారు. నవ్వు సహజ సిద్ధంగా స్వచ్ఛంగా ఉండాలి. చిరునవ్వులు నవ్వుతుంటే ఎదుటివారి హృదయం పులకించి సంతోషంతో నిండిపోవాలని అన్నారు. జిల్లా టాక్స్‌బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆర్.వి.శేషయ్యనాయుడు మాట్లాడుతూ నవ్వు వల్ల పది సంవత్సరాలు బ్రతికేవారు. ఇరవై సంవత్సరాలకు పైగా బ్రతకగలరని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కె. మురళీమోహన్‌రాజును అభినందించారు.



హైదరాబాదు త్యాగరాయ గానసభలో ఏప్రిల్ 22న జరిగిన లేఖిని మహిళా చైతన్య సాంస్కృతిక సంస్థ 5వ వార్షికోత్సవ సందర్భంగా తమిరస జానకి కవితా పురస్కారం అందుకుంటున్న కవయిత్రి శైలజామిత్ర. చిత్రంలో దేవాదాయ శాఖ కమీషనర్ రమణాచారి, కలెక్టర్ ఉషారాణి, కృష్ణకుమారి, కళాదీక్షితులు ఉన్నారు.



May 2010 pages.pmd 45 4/27/2003, 8:39 PM

## డైరీ

# లింగగిరి గ్రామంలో పుప్పాల పుస్తకాల ఆవిష్కరణ



నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి గ్రామంలో ఏప్రిల్ 11న పుప్పాల కృష్ణమూర్తి రచించిన రెండు కథా సంకలనాల ఆవిష్కరణ సభ జరిగింది. హుజూర్‌నగర్ స్పందన సామాజిక అధ్యయన వేదిక, నల్గొండ సాహితీస్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు సెంట్రల్ యూనివర్శిటీ రీడర్ బెల్లంకొండ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. మొదటగా 'విష వలయం' గల్పికల పుస్తకాన్ని హైదరాబాద్ పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శీలం ప్రసాదరావు ఆవిష్కరించారు. 'స్వేచ్ఛ-సౌందర్యం' పుస్తకాన్ని రచయిత మామగారు, మార్క్సిస్టు పార్టీ గ్రామ బాధ్యులు రావూరి నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం రిటైర్డ్ లెక్చరర్ శ్రీరామకవచం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లింగగిరి గ్రామానికి సాహిత్యపరంగా వందేళ్ళ చరిత్ర ఉందన్నారు. జూనూతల వెంకటనారాయణ శాస్త్రి 'శంభులింగేశ్వర తారావళి' గ్రంథాన్ని ఆనాడే రాశారని తెలిపారు. శ్రీరామకవచం సత్యనారాయణ 'కూడలి సంగమేశ్వర శతకం (కందపద్యాలు)', 'కాడిగెట్టు' నాటిక, 'శ్రీకన్యకా పరమేశ్వరి' బుర్రకథ, 'దయానంద చరిత్ర' బుర్రకథ, 'వైదికా సిద్ధాంతము' అను అనువాద గ్రంథం పుస్తకాలను రచించారని తెలిపారు. తాను 'ఆత్మవేదన' శతకం, 'కాళీయమర్దనం' గేయకావ్యం, 'మట్టపల్లి లక్ష్మీనృసింహస్తుతి' తారావళి, 'నీలకంఠయము' ప్రథమ, ద్వితీయ భాగాలు రాశానని తెలిపారు. రిటైర్డ్ తెలుగు లెక్చరర్ బొబ్బేళ్ళపాటి రామారావు 'మట్టపల్లి లక్ష్మినర్సింహ శతకం', 'వేంకటేశ్వర శతకం', 'సిద్దార్థుడు' లఘుకావ్యం, 'శ్రీసీతారామం' రామయాణ కథ రాశారని అన్నారు. ప్రస్తుతం పక్షవాతంతో ఉండికూడా కూతురు సహాయంతో గ్రంథరచన చేస్తున్నారని తెలిపారు. పుప్పాల కృష్ణమూర్తి 'జీవితచిత్రం', 'విష వలయం', 'స్వేచ్ఛ-సౌందర్యం' సాంఘిక కథలు పెద్దల కోసం, 'బుడిబుడి కథలు', 'మోసం', 'పాలపిట్ట' కథా సంకలనాలు పిల్లల కోసం రాశారని తెలిపారు. బెల్లంకొండ రవికాంత్ 'ఒంటరి దుఃఖం', 'మంచుపూల వెన్నెల' మొత్తం మూడు కవితా సంకలనాలు వెలువరించారని ప్రశంసించారు. అలాగే పుప్పాల మట్టయ్య ప్రజాశక్తి దినపత్రికలో పనిచేస్తూ 'మొద్దోడు' శీర్షికన వ్యంగ్య రచనలు చేసారని, నూకగంప వెంకయ్య కవితలు, పాటలు రాశారని ముందుతరాల వారు ఈ సాహిత్య పరంపర కొనసాగించాలని కోరారు. అనంతరం రిటైర్డ్ లెక్చరర్ మంత్రి ప్రగడ భరతారావు 'విష వలయం' పుస్తక విశేషాలను సభికులకు వివరించారు. 'స్వేచ్ఛా-సౌందర్యం' పుస్తకాన్ని బెల్లంకొండ రవికాంత్ పరిచయం చేస్తూ కథలన్నీ జీవిత సంఘర్షణలోంచి అంతర్జాతీయతను వ్యక్తం చేస్తాయన్నారు. ప్రతీ కథ సామాజిక స్పృహతో అలరారుతుంటుందని అన్నారు. లింగగిరి గ్రామ సర్పంచ్ బండారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'రచనల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా అభ్యుదయాన్ని వర్షిస్తుంటాడని, గ్రామాభివృద్ధికి సహకరించడంలో ఎప్పుడూ ముందుంటాడని అభినందించారు. 'స్పందన' బాధునాలు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రచయిత 'జీవనచిత్రం' 1993లో స్పందన నుంచి ఆవిష్కరించామని, పుప్పాల కృష్ణమూర్తి ఇంకా ఎక్కువ కథలు రాయాలని కోరారు. సభాధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ 'మేం ఎక్కడున్నా కృష్ణమూర్తి కథలు చదివితే గ్రామం ఒక్కసారి కళ్ళముందు కనిపిస్తుందని, మట్టివాసన వదలనివాడు నిత్యం పిల్లవాడులా ఉంటాడని ప్రశంసించారు. కృష్ణమూర్తి ప్రభావంతోనే రవికాంత్, మట్టయ్య, వెంకయ్య రచనలు చేస్తున్నారని అన్నారు. రచయితను వారి గురువు శ్రీరామకవచం శాలువా కప్పి సత్కరించారు. రచయిత స్పందిస్తూ తల్లితండ్రులకు 'స్వేచ్ఛ-సౌందర్యం' పుస్తకాన్ని అంకితమిచ్చానని, సాహిత్యాన్నిచ్చి ఆదరించినందుకు మంత్రి ప్రగడ సరోజనమ్మ, బొబ్బేళ్ళపాటి జానకమ్మ గారలకు 'విషవలయం' అంకితమిచ్చానని, ఆ తల్లుల వల్లనే సాహిత్యం అబ్బిందంటూ వస్త్రాలతో సత్కరించారు. చక్కని ముఖచిత్రం ఇచ్చిన 'ఫోటోగ్రాఫర్ బొమ్మల వెంకన్న'ను ప్రసాద్ శాలువ కప్పి సత్కరించారు. ఈ సభలో సాహితీమిత్రులు, స్పందన సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పుప్పాల మట్టయ్య వందన సమర్పణతో సభ ముగిసింది. ■



***హైదరాబాద్ చిక్కడపల్లిలోని నగరకేంద్ర గ్రంథాలయంలో ఏప్రిల్ 17న బిందు ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'గోదావరి కెరటాలు' కవితా సంపుటి ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో డా॥ ఎన్.గోపి, డా॥ సి. భవానీదేవి, ఎన్. అరుణ, శ్రీమతి తుమ్మిడి సూర్యకుమారి, కవితా సంపుటి రచయిత పనసకర్ల ప్రకాశ్, సాయివెంకన్నబాబు, ఆచార్య మసన చెన్నప్ప ఉన్నారు.***



May 2010 pages.pmd 46 4/27/2003, 8:39 PM



కవయిత్రి శ్రీమతి ఝాన్సీ కె.వి. కుమారి రచించిన నాటక సంపుటి 'నాతిచరామి' గ్రంథాన్ని మార్చి *31*న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో శాసనసభ్యురాలు శ్రీమతి జయసుధ ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలోఆకాశవాణి హైదరాబాదు వివిధభారతి పూర్వ డైరెక్టర్ నల్లూరి బాబూరావు, ప్రముఖ రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ, పూర్వ అడిషనల్ డైరెక్టరు జనరల్ ఆఫ్ పోలీస్ మల్లెల బాబూరావు, లోకాయుక్త డైరెక్టర్ జస్టిస్ ఐజక్‌ప్రభాకర్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కొలకలూరి ఇనాక్, మాజీమంత్రివర్యులు శ్రీమతి పుష్పలీల, ప్రముఖ కవి సుధామ, ప్రొపెసర్ కె. ఆనందన్ ఉన్నారు.



ముంబాయిలో మైసూరుఆసోసియేషన్ హాల్‌లో మార్చ్ *13*న శ్రీమతి భమిడిపాటి కళ్యాణి రచించిన 'ఒక ఓదార్పు–వేయి నిట్టూర్పులు' కవితా సంపుటిని 'నేటినిజం' సంపాదకులు బైస దేవదాస్ ఆవిష్కరిస్తున్న దృశ్యం.



హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని కేంద్రగ్రంథాలయంలో 'విశ్వసాహితి' స్వర్ణోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన పుస్తక చర్చావేదికలో ప్రారంభోపన్యాసం చేస్తున్న డాక్టర్ ద్వానాశాస్త్రి. చిత్రంలో కళాప్రపూర్ణ డాక్టర్ పోతుకూచి సాంబశివరావు, ఉస్మానియా తెలుగు ఆచార్యులుడాక్టర్ బి. జయరాములు, నూరారంశంకర్ ఉన్నారు.




డిగ్రీ విద్యార్థి, యువకవి సూర్యశ్రీ రాసిన 'వసంత కుసుమం' కవితా సంపుటిని మార్చి *20*న ఖమ్మంలోని ఎస్‌ఆర్& బిజిఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వి. ఉషారాణి. చిత్రంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. మాధవరావు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బి. మాధురి, కవితా సంపుటి రచయిత సూర్యశ్రీ ఉన్నారు.




తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట కళాసాహితి నిర్వహించిన శ్రీశ్రీ శతజయంతి సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు. చిత్రంలో దివికుమార్, జి. సుబ్బారావు, కె. కాత్యాయన శర్మ, ఎం. ఆశీర్వాదం ఉన్నారు.



హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో 'మానస ఆర్ట్ థియేటర్స్' ఆధ్వర్యంలో ఏప్రిల్ *13*న జరిగిన సభలో ప్రముఖ రచయిత వేదవిజ్ఞాన పరిశోధకులు డాక్టర్ కె.వి. రంగారావును సత్కరిస్తున్న దూరదర్శన్ సంచాలకులు డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు. చిత్రంలో కళాదీక్షితులు, రఘుశ్రీ, జనార్ధనరావు, సూర్యప్రకాష్ ఉన్నారు.



May 2010 pages.pmd 47 4/27/2003, 8:39 PM



మార్చి 13న ముంబాయిలో జరిగిన సభలో 'నేడు' పక్షపత్రికను ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయిత, ప్రొఫెసర్ డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి. వేదికపై సీనియర్ జర్నలిస్ట్ బైస దేవదాస్, ఎమ్మెల్యే షబ్నంమౌసీ, 'నేడు' సంపాదకులు మంజులా రెడ్డి, సంగెవేని రవీంద్ర తదితరులు ఉన్నారు.



నెల్లూరులో మార్చి 15న చలపాక ప్రకాష్ రచించిన 'మూడు ముక్కలాట' దీర్ఘకవితా సంపుటికి గాను 'సృజన-2009' ఉత్తమ సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్న మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ, రచయిత, పబ్లిషర్ ఎస్వీ కృష్ణ తదితరులు.



హైదరాబాద్ చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో మార్చి 31న కళానిలయం వారి ఉగాది విశిష్ట పురస్కారంతో కవి ఎన్.వి. రఘువీరప్రతాప్‌ను సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో ఆచార్య డాక్టర్ చెన్నారెడ్డి, డైరెక్టర్ ఆర్కియాలజీ డాక్టర్ ఈడ్పుగంటి పద్మజారాణి, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కొలకలూరి ఇనాక్ ఉన్నారు.

## స్పందనలు

ప్రతి నెలా 'సంపాదకీయా'నికి కేటాయిస్తున్న స్థలం 'మరీ కుదింపబడి'నట్లు అనిపిస్తూ వుంది: ఒక్కో నెల విషయ ప్రాధాన్యతను బట్టి ఎక్కువ స్థలాన్ని కేటాయించవలసి రావచ్చు. కానీ ఏ నెల చూచినా ఏదో 'సంపాదకీయం' ఉండాలి కాబట్టి ఏ విషయాన్నయినా ఏదో అలా 'టచ్' చేసి విడిచిపెడుతున్నట్లు అనిపిస్తోంది. వెరసి 'సంపాదకీయం' యొక్క ప్రాధాన్యత కనిపించడం లేదు.

పాఠకుల ప్రతిస్పందన అవసరం లేదని 'సాహిత్య ప్రస్థానం' అనుకుంటోందా?

**జి. సూరి**
**హైదరాబాద్**

నేను ఈ మధ్యనే ప్రస్థానం మాసపత్రిక పాత కాపీ ఒకటి చదివాను. మంచి కథలు, ఉపయోగపడే వ్యాసాలే కాకుండా ప్రముఖ కవులు వ్రాసిన కవితలు, కవితకు తగ్గట్టుగా బొమ్మలతో ప్రచురించారు. చాలా ఆలోచింపజేసేవిగా వున్నాయి. ఎంతటి మంచి పత్రిక అయినా ఆ పత్రికలో ప్రచురించిన శీర్షికలపై అభిప్రాయాలు, సద్విమర్శలు 'జాబులు' లేదా 'ప్రతిస్పందన', 'పాఠకుల పేజి', 'లేఖా పరిమళం' ఇలా ఏదో పేరుతో అన్ని పత్రికలు ప్రచురిస్తున్నాయి. ప్రస్థానం కూడా 'అభిప్రాయ వేదిక' అని పేజీ పెడితే బావుంటుందని నా సూచన.

**- ఈవేమన**
**శ్రీకాకుళం**

**⊙ ప్రస్థానం పత్రికలో ప్రచురితమయ్యే అన్ని అంశాలపై పాఠకుల స్పందనకు ఎప్పుడూ స్వాగతమే. ఉపయోగపడే విశ్లేషణలు, సూచనలకు ప్రస్థానం ఎప్పుడూ ఆహ్వానం పలుకుతుంది.**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**


ఫొటో: తవ్వా ఓబుల్ రెడ్డి